

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 148

SUNDAY Special | ఆదివారం 12-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | CHENNAI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



స్పిన్‌తో విన్ ఇండియా

ఆస్ట్రేలియా భయపడినట్లే జరిగింది. భారత్ స్పిన్ అస్త్రంతోనే గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను రవీంద్ర జడేజా కూల్చినట్లే.. రెండో ఇన్నింగ్స్‌ను రవిచంద్రన్ అశ్విన్ పడగొట్టేశాడు.

- వివరాలు 12లో



వధువు కోసం పాదయాత్ర

కర్ణాటకలో ఫిబ్రవరి 23న 200 మంది బ్రహ్మచారులు పాదయాత్ర చేయనున్నారు. దాని పేరు 'బ్రహ్మచారిగళ పాదయాత్రె'. మాండ్య జిల్లాలో చేపట్టనున్న ఈ పాదయాత్రపై స్పెషల్ స్టోరీ

- ఫ్యామిలీ పేజీలో



దక్షిణాసియా ముఖద్వారంగా..

'యాక్ట్ ఈస్ట్'తో త్రిపుర పురోగమిస్తోందని, త్వరలోనే అభివృద్ధి ఆసియా ముఖద్వారంగా మారనుందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



యుద్ధం మరికొన్నేళ్లు సాగొచ్చు

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరికొన్నేళ్లు సాగొచ్చని ప్రైవేట్ మిలటరీ కాంట్రాక్టర్, వాగ్నర్ గ్రూప్ యజమాని యెవ్‌గెనీ ప్రిగోజిన్ అన్నారు.

వివరాలు 6లో ▸



హరియాణా ఆస్పత్రుల్లో డ్రెస్ కోడ్

హరియాణా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బందికి త్వరలో డ్రెస్ కోడ్ అమలు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

వివరాలు 6లో ▸



గగనతలంలో మరో కలకలం

అమెరికాలోని అలాస్కాలో కారు పరిమాణమున్న ఓ వస్తువు ఎగురుతుండగా, దానిని యుద్ధ విమానంతో కూల్చేశారు.

వివరాలు 6లో ▸

వేటకు వేదిక రెడీ!

ప్రారంభానికి తుది మెరుగులు దిద్దుకుంటున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

- 250 మందితో రేయింబవళ్లు పనులు
- భారీ బోట్ల రాక కోసం బ్రేక్‌వాటర్ ఛానల్ పూర్తి
- దీంతోపాటు వేగంగా ఉప్పాడ, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- మొత్తంగా రూ.3,520.56 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు
- వీటిల్లో 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునే అవకాశం
- 60,858 మంది మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం
- సకల మౌలిక సదుపాయాలతో చకచకా పనులు
- వేలాది మంది మత్స్యకారుల వలసలకు బ్రేక్


జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద పూర్తయిన బ్రేక్ వాటర్ పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మత్స్యకారులంతా సుదీర్ఘ కాలంగా కలలు కంటున్న ఫిషింగ్ హార్బర్లు ఇప్పుడు అందుబాటులోకి వస్తున్నాయి. ఇంతకాలం కాగితాలకే పరిమితమైనవి వాస్తవ రూపం దాలుస్తున్నాయి. వీటి రాకతో ఇక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని వేలాది మంది మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేటకు వెళ్లి, ఎప్పటికప్పుడు ఇంటికొస్తూ.. కుటుంబ సభ్యులతో కలిసి గడిపే రోజులు అతి త్వరలోనే రానున్నాయని చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మత్స్యకారుల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. వారికి ఆ కష్టాలను దూరం చేయాలని భావించి, అధికారంలోకి రాగానే దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకేసారి తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో తొలి దశలో చేపట్టిన నాలుగు ఫిషింగ్ హార్బర్లు జువ్వలదిన్నె (నెల్లూరు), నిజాంపట్నం (బాపట్ల జిల్లా), మచిలీపట్నం (కృష్ణా జిల్లా), ఉప్పాడ (కాకినాడ జిల్లా) పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు దాదాపు 95% పూర్తయ్యాయి. ప్రధానంగా డ్రెడ్జింగ్, బ్రేక్ వాటర్, ప్రీకాస్ట్

మిగతా 2వ పేజీలో ▶

> ఇంతకాలం ఉపాధి కోసం కుటుంబాలను వదిలి పొరుగు రాష్ట్రాలకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలన్నీ తీరిపోనున్నాయి. త్వరలో జువ్వలదిన్నె హార్బర్ అందుబాటులోకి వస్తుండటం పట్ల చాలా సంతోషంగా ఉంది. దశాబ్దాల మా కల ఇప్పుడు నిజమవుతోంది.
>
> - బుచ్చింగారి చిట్టిబాబు, మత్స్యకారుడు, ఆదినారాయణపురం, నెల్లూరు జిల్లా



చంద్రబాబూ ఈ ప్రశ్నలకు జవాబుందా?

నారాసుర రక్తచరిత్రలో ప్రతిపేజీ హత్యలు, కుట్రలే...

1 వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు అధికారంలో ఉన్నది చంద్రబాబు నాయుడే కదా? అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేసినా చంద్రబాబు నో చెప్పారెందుకు? 'సిట్'తో సరిపెట్టారెందుకు?

2 ముఖ్యమంత్రి కుటుంబానికి ఎంపీ అవినాశ్ నుంచి అర్ధరాత్రే ఫోన్ వెళ్లినట్లు తెలుగుదేశం ఓ అభూత కల్పనను సృష్టించింది. ఎవరు చెప్పారిది? సీబీఐ కూడా చెప్పలేదుగా? పోనీ... అప్పుడు అధికారంలో ఉన్నది మీరే కదా? దీన్ని నిరూపించే కాల్ డేటాను చూపించగలరా? ఉదయం 6.10కి వివేకా పనిమనిషి ఇంటి తలుపు తీసేదాకా ఆయన మృతి గురించి ఎవ్వరికీ తెలియదన్నది పచ్చి నిజం కాదా? ఆమె చెప్పాకే బంధువులకు, బయటి ప్రపంచానికి తెలిసిందన్నది వాస్తవం కాదా?

3 అవినాశ్‌రెడ్డి అప్పటికే ఎంపీ. కడప లోక్‌సభ ఇన్‌చార్జి కూడా. వివేకానందరెడ్డిని జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ప్రకటించారు జగన్. ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో అవినాశ్ గెలుపు కోసం వివేకా ప్రచారాన్ని ప్రారంభించారు. ముందురోజు రాత్రి జమ్మలమడుగులో ప్రచారం చేశారు కూడా. అలాంటిది ఎంపీ సీటు కోసం ఆయనపై కుట్ర పన్నాల్సిన అవసరం అవినాశ్‌కు ఎందుకుంటుంది?

4 మార్చి 15, 2019న ఉదయాన్నే జమ్మలమడుగు ప్రచారానికి వెళుతుండగా అవినాశ్‌కు వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఫోన్ చేసి వివేకా మరణించినట్లు చెప్పటంతో ఆయన హడావుడిగా అక్కడకు చేరుకున్నారు. ఆ ఫోన్ రాకపోయి ఉంటే ఆయన వచ్చి ఉండేవారే కాదు. వచ్చిన వెంటనే ఆయన విషయం తెలుసుకుని మొదట సీఐకి ఫోన్ చేశారు. అప్పుడున్నది తెలుగుదేశం సర్కారు. సీఐ కూడా టీడీపీ నేతలు కోరి తెచ్చుకున్న వ్యక్తి. అలాంటిది సీఐకి ఫోన్ చేశాక.. బంధువులకు ఫోన్లు చేశారు అవినాశ్‌రెడ్డి. ఇందులో ఆయన చేసిన తప్పేంటి?



4లో

న్యూస్‌రీల్

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీగిరి ఆలయంలో ఆగమశాస్త్రానుసారం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 5లో ▸

బెంగళూరులో అనుమానిత ఉగ్రవాది అరెస్టు



అంతర్జాతీయ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న ఓ వ్యక్తి బెంగళూరులో అరెస్టయ్యాడు. ఎన్‌ఐఏ, బెంగళూరు పోలీసులు కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు.

వివరాలు 6లో ▸

టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా..



టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందిస్తున్న తనను చూసి ఓర్వలేక మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఏ పదవీరానీయడం లేదని టీడీపీ సీనియర్ నేత ఈర్లె శ్రీరామమూర్తి ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్రంగా బరిలోకి దిగుతున్నానని ఆయన వెల్లడించారు.

వివరాలు 2లో ▸

సీనరేజ్ వసూళ్లపై వక్రభాష్యం



ప్రభుత్వంపై బురదజల్లే ఉద్దేశంతోనే 'ఖనిజాల సీనరేజ్ వసూళ్ల ప్రైవేటుపరం' అంటూ ఈనాడు పత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని గనుల శాఖ సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

వివరాలు 2లో ▸

ఇదండీ సంగతి



పాత బడ్జెట్‌లోని తీర్మానాలు ఇంకా అమలు కాలేదా అని ప్రతిపక్షాలు గొడవచేస్తున్నాయ్‌సార్!

విద్యాలయాలుగా ఆర్బీకేలు

యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా కూడా మారిన ఈ కేంద్రాలు

- ఈ విద్యాసంవత్సరం నుంచే సిలబస్‌లో చేర్చిన ప్రభుత్వం
- డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీటిల్లో ఇంటర్న్‌షిప్
- నెల నుంచి ఐదు నెలలపాటు వీటి కేంద్రంగానే పాఠాలు
- ప్రతీ ఆర్బీకేకు ముగ్గురు నుంచి ఆరుగురు చొప్పున కేటాయింపు
- ఖరీఫ్ సీజన్ నుంచే ఎన్జీ రంగా వర్సిటీ స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్
- ఉద్యాన వర్సిటీ విద్యార్థులకు డిసెంబర్ నుంచే ప్రారంభం

2లో


కాకినాడ జిల్లా జి.రాగంపేట ఆర్బీకే వద్ద వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అది టీడీపీ అసత్యాల పుస్తకం

- మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు
- రచన, ప్రచురణకర్త లేని పిరికి పందల పుస్తకం




సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై విడుదల చేసింది టీడీపీ అసత్యాల పుస్తకం అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. వయసు మీద పడిన చంద్రబాబు ఒక అజ్ఞాని అని ఆ పుస్తకం నిరూపిస్తోందన్నారు. విషపు రాతలతో ఒక పుస్తకాన్ని అచ్చేసి బయటకు వదిలారని, రాజకీయాల్లోకి ఆడవాళ్లను కూడా లాగి వివాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పుస్తకంపై టీడీపీ, చంద్రబాబు పేర్లు పెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు ఓ పిరికిపంద అని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ రోజు మీరు ఏం చేశారు?

టీడీపీ విడుదల చేసిన పుస్తకాన్ని ఎవరు ప్రచురించారు? ఎన్ని కాపీలు వేశారు? అన్న కనీస వివరాలు లేవు. పైగా అదేదో అంతర్జాతీయ పార్టీ అయినట్లు ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో విడుదల చేయడం మరో తమాషా. నిజంగా దమ్ముంటే ప్రచురణకర్త, ఎక్కడ, ఎన్ని కాపీలు ముద్రించారు వంటి

మిగతా 3వ పేజీలో ▶



సౌర కిరీటం!

నాసా శాస్త్రవేత్తలు ఈ మధ్య ఓ అద్భుతాన్ని చూశారు!

సూర్యుడిపై కార్యకలాపాల వీడియో ఒకటి చూస్తుండగా ధ్రువ ప్రాంతంలోంచి ప్లాస్మా పోగు ఒకటి బయటకొచ్చింది!

కుతకుత ఉడుకుతూండే ఈ పోగు చూస్తూండగానే విడిపోయింది!

అది అలా అలా ఎగురుతూ ఓ రింగు ఆకారాన్ని సంతరించుకుంది!

సూర్యుడి ఉత్తర ధ్రువ ప్రాంతంలో గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది!!

- వివరాలు 6లో

క్లుప్తంగా...

వైఎస్సార్ విశ్వవిద్యాలయం వీసీగా బాబ్జి నియామకం

నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్



సాక్షి, అమరావతి/కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా మాజీ డీఎంఈ డాక్టర్ కోరుకొండ బాబ్జిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మూడు ఏళ్ల పాటు బాబ్జి వీసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా వైద్య శాఖలో నియమితులయిన బాబ్జి అనంతరం అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా వ్యవహరించారు. రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యలు చేపట్టి.. ఇదే హోదాలో 2022 ఫిబ్రవరి 2న డాక్టర్ బాబ్జీ పదవీ విరమణ చేశారు. త్వరలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విధుల్లో చేరతానని డాక్టర్ బాబ్జీ అన్నారు.

న్యాయస్థానాలకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు మినహాయింపు

- ఏపీ హైకోర్టు, సబార్డినేట్ కోర్టులు, ట్రిబ్యునల్స్, జ్యుడీషియల్ ఇన్‌స్టిట్యూట్స్‌కు మినహాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పని పరిస్థితులు, న్యాయస్థానాల పని పరిస్థితుల్లో తేడా
- అందుకే మినహాయింపు

సాక్షి, అమరావతి: న్యాయస్థానాల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ కంట్రోల్‌లో ఉండే న్యాయ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరు నమోదు నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముత్యాల రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ హైకోర్టుతో పాటు సబార్డినేట్ కోర్టులు, ట్రిబ్యునల్, జ్యుడీషియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి సైతం ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు పనిపరిస్థితులు న్యాయ స్థానాలు, సంస్థల పని పరిస్థితుల్లో తేడా ఉందని, అలాగే సెలవులు, వేసవి సెలవుల్లో తేడా ఉందని, దీంతో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ ఘటనలో ముగ్గురి అరెస్టు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు శనివారం రాత్రి ముగ్గురిని అరెస్టు చేశారు. సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీలో ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు దిగి ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఫ్యాక్టరీ నిర్వాహకులు సింగవరపు విశ్వనాథ్, సింగవరపు రఘురామ్, సూపర్‌వైజర్ అక్కిరెడ్డి శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. మరోవైపు జేసీ ఇలక్కియా ఆధ్వర్యంలో ఫైవ్‌మెన్ కమిటీ ఈ ఘటనపై విచారణను ముమ్మరం చేసింది. త్వరలోనే విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆ కమిటీ తెలిపింది.

టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా..

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉంటా
- నా ఎదుగుదలను అడుగడుగునా అయ్యన్న అడ్డుకుంటున్నాడు..
- టీడీపీ సీనియర్ నేత శ్రీరామమూర్తి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విశేష సేవలందిస్తున్న తనను చూసి ఓర్వలేక మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఏ పదవీరానీయడం లేదని టీడీపీ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి ఆరోపించారు. అందుకే ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థి(టీడీపీ రెబల్)గా బరిలోకి దిగుతున్నట్టు వెల్లడించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు వచ్చిన రాజకీయ అవకాశాలను అయ్యన్నపాత్రుడు ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నాడని.. అలాంటి వ్యక్తిపై పార్టీ ఏ చర్యలూ చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, ఆర్‌టీఏ కమిషనర్‌గా పదవులిచ్చే సమయంలో అయ్యన్నపాత్రుడు అడ్డుతగిలాడని చెప్పారు. చివరకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయమై తనను చంద్రబాబు పిలిచి.. నీ అభ్యర్థిత్వాన్ని పరిశీలించామని, అచ్చెన్నాయుడిని కలవమని చెప్పినట్టు గుర్తు చేశారు. చివరి ప్రయత్నంలో బీసీ కులానికి చెందిన మహిళకు కేటాయించారని, అప్పుడు కూడా తాను బాధపడలేదని, కానీ తాజాగా ఆమెను కూడా తప్పించి తన నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యాయుడికి కేటాయించడంపై ఆవేదనకు గుర్తె.. తానే స్వతంత్ర అభ్యర్థిగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నానని శ్రీరామమూర్తి వివరించారు.

కరెంటు బండి.. కొందాం పదండి



ఎలక్ట్రిక్ వాహనాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు

సెక్షన్ 80 ఈఈబీ కింద రూ.1.50 లక్షల వరకు రాయితీలు	అన్ని రకాల ఈవీలపై జీఎస్టీ 5 శాతమే	ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఆర్థిక ప్రయోజనాలు

ఏ రాష్ట్రంలో తక్కువ ధర ఉంటుందో అక్కడ కొనుక్కోవచ్చు

సాక్షి, అమరావతి: దేశమంతా ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) ట్రెండ్ నడుస్తోంది. తక్కువ ఖర్చులో ఎక్కువ మైలేజీ ఇచ్చే ఈ వాహనాల పట్ల అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఈవీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇవి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉన్నాయి. సహజంగానే ఏ రాష్ట్రంలో వాహనం తక్కువ రేటుకి వస్తుందో అక్కడ వాహనం కొని, అక్కడే రిజిస్ట్రేషన్ చేసుకుని సొంత రాష్ట్రానికి తెచ్చుకుని వాడుకోవడం చాలా మందికి అలవాటు. పలువురు వాహన వ్యాపారులు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తుంటారు. విద్యుత్ వాహనాలను కూడా ఇదే విధంగా తక్కువ రేటుకు లభించే రాష్ట్రంలో కొని తెచ్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో విద్యుత్ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కొత్త సెక్షన్ తెచ్చిన కేంద్రం

దేశవ్యాప్తంగా ఈవీలకు కేంద్రం కొన్ని రాయితీలు ఇస్తోంది. దేశంలో ఆదాయ పన్ను చట్టాల ప్రకారం.. కార్లు లగ్జరీ ఉత్పత్తుల కిందకు వస్తాయి. అందువల్ల పౌరులు వీటి కోసం తీసుకునే రుణాలపై పన్ను ప్రయోజనాలను పొందలేరు. కానీ విద్యుత్ వాహనాల (ఈవీ) యజమానులను పన్నుల నుంచి మినహాయించేందుకు ఎనర్జీ ఎఫిషియెంట్ బిల్డింగ్ యాక్ట్‌లో 80 అనే కొత్త సెక్షన్ను కేంద్రం తీసుకువచ్చింది. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీకి, పునరుద్ధరించడానికి చెల్లించాల్సిన రుసుము నుంచి ఈవీలకు మినహాయింపు ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 2019లో తీసుకువచ్చిన ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఫేమ్–2) పథకంలో ద్విచక్ర వాహనాలకు (రూ.1.5 లక్షల ధర వరకు) కిలోవాట్‌అవర్ (కేడబ్ల్యూహెచ్) బ్యాటరీ కెపాసిటీకి రూ.15 వేలు అందిస్తుంది. అదేవిధంగా ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్లకు ప్రతి కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ సామర్థ్యానికి రూ.10 వేలు ప్రత్యక్ష ప్రోత్సాహకాన్ని ఇస్తోంది. అలాగే ఈవీలపై 5%జీఎస్టీని మాత్రమే వసూలు చేస్తోంది. అయితే ఇవి ఒక వ్యక్తికి ఒక వాహనం కొనుగోలుకే వర్తిస్తాయి. ఈ విషయంలో రాష్ట్రాలు తమ వెసులుబాటునిబట్టి వేర్వేరుగా రాయితీలు, ప్రోత్సాహకాలను సమకూరుస్తున్నాయి.

పలు రాష్ట్రాల్లో ఈవీలకు ఇస్తున్న రాయితీలు

- ఏపీలో ఈవీలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజుల నుండి పూర్తి మినహాయింపు లభిస్తోంది. ద్విచక్ర వాహనాలకు రూ.15 వేలు, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు కిలోవాట్‌కు రూ.10 వేలు, బస్సులకు రూ.20 వేలు రాయితీలిస్తోంది. నగరాలు, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వేల ప్రాంతాలను గుర్తించింది. ఛార్జింగ్ స్టేషన్ల యజమానులకు రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించింది.
- ఢిల్లీ ప్రభుత్వం మొదటి వెయ్యి ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ రిజిస్ట్రేషన్లను మాత్రమే ప్రోత్సహిస్తోంది. ద్విచక్ర వాహనాలకు బ్యాటరీ సామర్థ్యం కేడబ్ల్యూహెచ్‌కు రూ.5 వేలు చొప్పున రూ.30 వేల వరకు అందిస్తోంది. ఇది రిజిస్ట్రేషన్, రహదారి పన్ను మినహాయింపునకు అదనం.
- తెలంగాణ ప్రభుత్వం రహదారి పన్ను, రిజిస్ట్రేషన్ ఖర్చులపై 100 శాతం మినహాయింపు ఇస్తోంది. మొదటి 2 లక్షల ద్విచక్ర వాహనాలు, 5 వేల నాలుగు చక్రాల వాహనాలు, 20 వేల త్రీవీలర్ ఆటోరిక్షాలకు రాయితీలను అందిస్తోంది. రాష్ట్రంలో బ్యాటరీ ఛార్జింగ్ సౌకర్యాలు ఉన్నాయి. మొదటి 500 బ్యాటరీ చార్జింగ్ పరికరాలపై 25 శాతం మూలధన రాయితీ ఇస్తోంది. పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ విద్యుత్ టారిఫ్‌పై పదేళ్లపాటు డ్యూటీ మినహాయింపు ఉంటుంది.
- మహారాష్ట్రలోని అన్ని ఈవీలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను ప్రభుత్వం మాఫీ చేసింది. మొదటి లక్ష ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు ప్రతి కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ కెపాసిటీకి రూ.5 వేలు ప్రోత్సాహం అందిస్తోంది.
- గుజరాత్ మొదటి 1.1 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన వినియోగదారులకు ప్రతి కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ సామర్థ్యంకు రూ.10 వేల వరకూ సబ్సిడీ ఇస్తోంది. మొదటి 10 వేల మందికి కేంద్రం ఇచ్చే రాయితీలను సమకూరుస్తోంది.
- మేఘాలయలో మొదటి 3,500 ద్విచక్ర వాహనాలకు ప్రతి కిలోవాట్‌కు రూ.10 వేల సబ్సిడీని అక్కడి ప్రభుత్వం అందిస్తోంది. మొదటి 2,500 నాలుగు చక్రాల వాహనాలకు కేడబ్ల్యూహెచ్‌కు రూ.4 వేలు ప్రోత్సాహకం ఇస్తోంది.
- అసోం ప్రభుత్వం మొదటి లక్ష ద్విచక్ర వాహనాలు, 75 వేల త్రిచక్ర, 25 వేల నాలుగు చక్రాల వాహనాలకు వచ్చే ఐదేళ్లలో వాణిజ్య, వ్యక్తిగత వినియోగానికి వాడుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ ఐదేళ్లూ రోడ్డు పన్ను రిజిస్ట్రేషన్ మినహాయింపు వర్తిస్తుంది.
- ఒడిశా 2025 వరకు పన్ను, రిజిస్ట్రేషన్ రుసుముల్లో 100% మినహాయింపును ప్రకటించింది.
- రాజస్థాన్‌లో 2 కేడబ్ల్యూహెచ్ వరకు బ్యాటరీ సామర్థ్యం కలిగిన ఈవీలకు రూ.5 వేలు సబ్సిడీ ఇస్తోంది. 2 నుంచి 4 కేడబ్ల్యూహెచ్ వరకు ఉంటే రూ.7 వేలు అందిస్తోంది. ఇక్కడ ఫోర్ వీలర్లకు ఎలాంటి రాయితీలు లేవు.
- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈవీలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను మాఫీ చేసింది.
- గోవా ప్రభుత్వం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు రిజిస్ట్రేషన్ కూడా అవసరం లేదని ప్రకటించింది.

విద్యాలయాలుగా ఆర్బీకేలు

యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా కూడా మారిన ఈ కేంద్రాలు

సాక్షి, అమరావతి : అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్న వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) యూనివర్సిటీల్లో పాఠ్యాంశమయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, వెటర్నరీ, కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులుగా కూడా మారాయి. యూనివర్సిటీలు, అనుబంధ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులు ఇక నుంచి విధిగా ఆర్బీకేల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా మార్పుచేశారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విద్యార్థులు ఇందుకు శ్రీకారం చుట్టగా, మత్స్య యూనివర్సిటీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.



గుంటూరు జిల్లా నిడముక్కల ఆర్బీకేలో రైతుల అవగాహన సదస్సులో విద్యార్థులు

విజ్ఞాన భాండాగారాలుగా ఆర్బీకేలు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ఈ ఆర్బీకేలు రెండున్నరేళ్లుగా రైతులకు విశేష సేవలందిస్తూ అంతర్జాతీయ మన్ననలు అందుకుంటున్నాయి. రాష్ట్రంలో సచివాలయాలకు అనుబంధంగా మొత్తం 10,778 ఆర్బీకేలను ఏర్పాటుచేశారు. వన్‌స్టాప్ సెంటర్‌గా వీటిని తీర్చిదిద్దారు. బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుల మందులతో పాటు ఎరువులను రైతు ముంగిటకు సరఫరా చేస్తున్నారు. వీటికి అనుబంధంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా అద్దెకు సాగు యంత్రాలనూ అందుబాటులోకి తెచ్చారు. అలాగే, ఆర్బీకేల్లో ఏర్పాటుచేసిన కియోస్క్‌లు, డిజిటల్, స్మార్ట్ గ్రంథాలయాల ద్వారా అంతర్జాతీయంగా వస్తున్న ఆధునిక పోకడలు, మెళకువలను మారుమూల రైతులకు అందిస్తూ వాటిని నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దారు. ఇక వీటిల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా పండించిన పంట ఉత్పత్తులను కళ్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. ఇలా రెండున్నరేళ్లలో రెండు కోట్ల మందికి పైగా రైతులు వీటి ద్వారా సేవలందుకున్నారు. వీటి గురించి తెలుసుకున్న కేంద్రం సహా పలు రాష్ట్రాలు ఏపీ బాట పట్టగా, పలు దేశాల ప్రతినిధులూ ఇక్కడికొచ్చి వీటిపై అధ్యయనం చేశారు.

ఈ కేంద్రాల్లో ఇంటర్న్‌షిప్

సాధారణంగా.. మెడికోలకు బోధనాస్పత్రుల్లోనూ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధిత పరిశ్రమల్లోనూ చివరి ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. అదేరీతిలో వ్యవసాయ వర్సిటీ విద్యార్థులను జిల్లా కేంద్రాల్లో ఉండే డాట్ సెంటర్లకు, మిగిలిన వర్సిటీలు రీసెర్చ్ స్టేషన్, కేవీకేలకు అటాచ్ చేసేవారు. వాటి పరిధిలో ఓ వారం పదిరోజుల పాటు విద్యార్థులు స్టడీ చేసేవారు. ప్రస్తుతం ఆర్బీకేలు కేంద్రంగా ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధంచేసింది. ఉద్యాన విద్యార్థులకు ఆర్నెల్లు, వ్యవసాయ విద్యార్థులకు మూడు నెలలు, వెటర్నరీ విద్యార్థులకు నెలరోజుల చొప్పున ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా ఆయా యూనివర్సిటీ వీసీలు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. అలాగే, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కనీసం 20 నుంచి నెలరోజులపాటు ఇంటర్న్‌షిప్ ఉండేలా మత్స్య యూనివర్సిటీ కూడా షెడ్యూల్ రూపొందిస్తోంది. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ వర్సిటీల్లో ఈ ఇంటర్న్‌షిప్‌కు శ్రీకారం చుట్టారు.

ఆర్బీకేల్లో ఇన్ఫర్మేషన్ కార్నర్

ఇక ఇంటర్న్‌షిప్ కోసం ఆర్బీకేల్లో ఇన్ఫర్మేషన్ కార్నర్‌ను ఏర్పాటుచేశారు. రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ సెంటర్ల శాస్త్రవేత్తలతో పాటు స్థానిక అధికారులు, ఆర్బీకే సిబ్బందితో అనుసంధానం చేశారు. ప్రతీరోజు ఆర్బీకేలను విజిట్ చేస్తూ వాటి ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించేలా షెడ్యూల్ రూపొందించారు. ప్రధానంగా ఇన్‌పుట్స్ సరఫరా, కియోస్క్‌ల పనితీరు, వాతావరణ సమాచారం, నాలెడ్జ్ షేరింగ్, ఈ–క్రాప్ బుకింగ్, మార్కెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్, కొనుగోలు తీరు, ఆర్బీకే సిబ్బంది, బ్యాంక్ మిత్రల సేవలు, పశువులకు వ్యాక్సినేషన్, హెల్త్‌కార్డుల జారీ, సీహెచ్‌సీలు, పొలంబడులు, తోటబడులు, పశు విజ్ఞాన బడులు, వ్యవసాయ సలహా మండళ్ల పనితీరు, ఎఫ్‌పీఓలు, జేఎల్‌జీ గ్రూపుల పనితీరుతో పాటు పంటల బీమా, రైతుభరోసా, సున్నా వడ్డీ పంటల రుణాలు వంటి పథకాల అమలు తీరుతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలపై ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మొత్తంపై విద్యార్థుల అధ్యయనాన్ని అంచనా వేస్తూ 5–10 మార్కుల వరకు ఇస్తారు.

తరగతి గదుల్లో ఆర్బీకేల గురించి..

ఈ నేపథ్యంలో.. రైతులకు అన్ని విధాలుగా అండదండలందిస్తూ వ్యవసాయ, అనుబంధ రంగాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆర్బీకేల అంశాన్ని వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా చేర్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారుస్తున్న వీటి గురించి తరగతి గదుల్లో బోధిస్తున్నారు. సచివాలయాలకు అనుబంధంగా ఆర్బీకేలు ఎందుకు ఏర్పాటుచేయాల్సి వచ్చింది? వాటి ఆవశ్యకత, లక్ష్యాలు, వాటి ద్వారా గ్రామస్థాయిలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అందిస్తున్న సేవలు, రైతుల జీవితాల్లో ఆర్బీకేలు ఎలాంటి మార్పును తీసుకొచ్చాయి.. ఇతర రాష్ట్రాలు, దేశాలు ఆర్బీకేలను ఎందుకు ఆదర్శంగా తీసుకుంటున్నాయి వంటి అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చారు.

ఆర్బీకేల ద్వారా ఎంతో నేర్చుకుంటున్నాం



నేను బీఎస్సీ హానర్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. నాతో పాటు మరో ఆరుగురు విద్యార్థులు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం సింగరాజుపాలెం ఆర్బీకే పరిధిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాం. ఆర్బీకేల పనితీరు.. అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్నాం. రోజూ ఫీల్డ్ విజిట్స్ చేస్తున్నాం. సాయంత్రం పూట రైతులతో భేటీ అవుతూ వారి సమస్యలకు సలహాలు, సూచనలిస్తున్నాం.

– దాసరి షీలా జయశ్రీ, పార్వతీపురం ఉద్యాన కళాశాల విద్యార్థిని

ఆర్బీకేల గురించి కాలేజీలో ఎంతో చెప్పారు



నేను బ్యాచురల్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ చదువుతున్నా. ఏప్రిల్ నుంచి ఇంటర్న్‌షిప్‌కు వెళ్లబోతున్నాం. ఈసారి ఇంటర్న్‌షిప్‌లో ఆర్బీకేల విజిట్‌ను కూడా చేర్చారు. కాలేజీలో కూడా వాటి కోసం ఎంతో చెప్పారు. ఇంటర్న్‌షిప్‌లో వాటి పనితీరుపై ప్రత్యక్షంగా స్టడీ చేస్తాం.

– భూక్యాసాయి, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి

సుశిక్షితులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యాబోధన తరగతి గదులకే పరిమితం కాకూడదు. వారు నేర్చుకున్న పాఠాలు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులపైనా అవగాహన పెంపొందించుకోవాలి. యూనివర్సిటీ నుంచి బయటకొచ్చేసరికి పరిశోధనలు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం. అందుకే ఆర్బీకేల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నాం.

– డా.ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి, వీసీ, ఏపీ ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ

ఆర్బీకేలను పాఠ్యాంశంగా చేర్చాం



ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఆర్బీకేలను పాఠ్యాంశంగా చేర్చాం. ఆర్బీకేలు కేంద్రంగా ఇంటర్న్‌షిప్‌కు శ్రీకారం చుట్టాం. దాదాపు ఆర్నెల్లపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. కనీసం ఐదు నుంచి ఆరుగురు చొప్పున ఒక్కో ఆర్బీకేకు అటాచ్ చేశాం.

– డాక్టర్ టి.జానకీరామ్, వీసీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం

వేటకు వేదిక రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

వంటి పనులు దాదాపు పూర్తయినట్టే. కొద్ది రోజుల్లో మిగతా ఐదు శాతం పనులు పూర్తి చేసుకుని వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం పట్టిన చేపలు వేలం వేసుకోవడానికి హాలు, కోల్డ్ స్టోరేజ్, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వంటి భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.288.80 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ హార్బర్‌లో 1,250 బోట్లు నిలుపుకునే అవకాశం ఉంటుంది. తద్వారా 6,100 మంది మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది.

9 హార్బర్లతో 60,858 మందికి ఉపాధి

సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా రూ.3,520.56 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారు. తొలి దశ కింద రూ.1522.8 కోట్లతో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్లు నిర్మిస్తున్నారు. ఇందులో జువ్వలదిన్నె ప్రారంభానికి సిద్ధం అవుతుండగా, నిజాంపట్నంలో 75 శాతం పనులు పూర్తయ్యాయి. మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల పనులు కూడా 40 శాతం పూర్తయ్యాయి. రెండో దశ కింద రూ.1,997.76 కోట్లతో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (విశాఖపట్నం), బియ్యపుతిప్ప (పశ్చిమ గోదావరి), వోడరేవు (ప్రకాశం), కొత్తపట్నం (ప్రకాశం) హార్బర్ల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యి త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఈ హార్బర్లన్నీ అందుబాటులోకి వస్తే 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలిపే సామర్థ్యంతో పాటు 60,858 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. జువ్వలదిన్నె హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అందుబాటులోకి వస్తుందని అంచనా. కాగా, మత్స్యకారులకు అదనపు ఆదాయం తీసుకొచ్చేలా హార్బర్ల వద్ద ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కుల ఏర్పాటుకు ఏపీ మారిటైమ్ బోర్డు కసరత్తు చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టు కింద జువ్వలదిన్నె వద్ద 50 ఎకరాల్లో ఈ పార్క్ ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఇది ఇలా ఉండగా.. ఇది వరకు ఏటా 20 వేల మందిదాకా వలస వెళ్లేవారు. వైఎస్‌జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఆ సంఖ్య బాగా తగ్గింది. ఫిషింగ్ హార్బర్లు పూర్తయితే వలసలు పూర్తిగా ఆగిపోవడం ఖాయం.

పనుల పురోగతి ఇలా..

- 2021 మార్చి 19న పనులు ప్రారంభించారు. ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ఇందుకోసం 250 మంది రేయింబవళ్లు పని చేస్తున్నారు.
- భారీ మెకనైజ్డ్ బోట్లు వచ్చి ఆగడానికి వీలుగా కాలువను తవ్వడం కోసం ఏకంగా 10.5 లక్షల టన్నుల ఇసుకను తవ్వి పక్కన పోశారు. ఈ బ్రేక్‌వాటర్ ఛానల్ తిరిగి పూడిపోకుండా ఉండటం కోసం 3.20 లక్షల టన్నుల రాతిని వినియోగించారు. ఉత్తరం వైపు బ్రేక్ వాటర్ 835 మీటర్లు, దక్షిణం వైపు 620 బ్రేక్ ఛానల్స్‌ను రాతితో నింపే ప్రక్రియ పూర్తయింది.
- అలల ఉధృతిని తట్టుకునే విధంగా సిమెంట్‌తో నిర్మించిన 9,176 టెట్రాపాడ్స్ (త్రికోణాకారంలో ఉండే సిమెంట్ దిమ్మెలు) పేరుస్తున్నారు. ఇందులో ఇప్పటికే 6,919 టెట్రాపాడ్స్‌ను అమర్చారు. 1,250 బోట్లు నిలుపుకోవడానికి 909 మీటర్ల జెట్టీ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇందుకోసం 312 ప్రీకాస్ట్ ఎలిమెంట్స్ (సముద్రం లోపలికి సిమెంట్‌తో కూడిన ఇనుప దిమ్మెలు) ఏర్పాటు చేశారు.
- వీటిని ఒడ్డుతో అనుసంధానం చేసే సిమెంట్ జెట్టీ నిర్మాణం 672 మీటర్లు ఇప్పటికే పూర్తయింది. మిగిలింది పది రోజుల్లో పూర్తవుతుందని అధికారులు వెల్లడించారు. ఇది పూర్తయితే బోట్లు ఇక్కడికి వచ్చి ఆపుకోవచ్చు. చేపల వేటను ప్రారంభించవచ్చు.
- ఇక కేవలం ఉపరితలం మీద నిర్మించే అడ్మినిస్ట్రేషన్, మెరైన్ పోలీస్ స్టేషన్, కోల్డ్ స్టోరేజ్, చేపల వేలం కేంద్రం వంటి 30 శాశ్వత భవనాల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇప్పటికే చాలా భవనాలు శ్లాబు దశ దాటాయి. మిగిలినవి శ్లాబు దశకు చేరుకున్నాయి.

ఫిషింగ్ హార్బర్	ప్రాజెక్ట్ వ్యయం (రూ.కోట్లలో)	లబ్ధి పొందే మత్స్యకారులు	బోట్లు నిలిచే సామర్థ్యం
జువ్వలదిన్నె	288.80	6,100	1,250
నిజాంపట్నం	451	9,000	1,600
మచిలీపట్నం	422	3,300	550
ఉప్పాడ	361	17,700	2,500
బుడగట్లపాలెం	365.80	3,840	780
పూడిమడక	392.53	4,870	930
కొత్త పట్నం	392.45	4,200	820
వోడరేవు	417.55	9,500	1,650
బియ్యపు తిప్ప	429.43	2,348	441
మొత్తం	3,520.56	60,858	10,521

త్వరలో ప్రారంభం

తొలి దశలో చేపట్టిన నాలుగు ఫిషింగ్ హార్బర్ల పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలో జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రారంభించనున్నాం. రెండో దశ హార్బర్లకు సంబంధించి డిజైన్లు ఖరారు దశలో ఉన్నాయి. అవి ఖరారు కాగానే పనులు మొదలు పెడతాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి 50 కిలోమీటర్లకు ఒక ఫిషింగ్ హర్బర్ లేదా ఓడరేవు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– షాన్ మోహన్, సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు

సీనరేజి వసూళ్లపై వక్రభాష్యం

ప్రభుత్వంపై బురద జల్లేలా 'ఈనాడు' కథనం

- అత్యంత పారదర్శకంగా సీనరేజి టెండర్లు
- అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో చెక్
- మైనింగ్ రెవెన్యూ పెంచేందుకే ప్రైవేట్ సంస్థల ద్వారా సీనరేజి వసూళ్లు
- ఇతర రాష్ట్రాల్లోనూ ఈ విధానం అమలులో ఉంది
- సాంకేతిక, ఆర్థిక అర్హత ఉన్న ఎవరైనా టెండర్లలో పాల్గొనవచ్చు
- 'ఈనాడు'నూ టెండర్లలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం
- గనుల శాఖ సంచాలకులు వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి: ప్రభుత్వంపై బురదచల్లే ఉద్దేశంతోనే 'ఖనిజాల సీనరేజి వసూళ్లు ప్రైవేటుపరం' అంటూ ఈనాడు పత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని గనుల శాఖ సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో అపోహలు పెంచేలా పూర్తి అవాస్తవాలతో అందులోని రాతలు ఉన్నాయంటూ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి, అలసత్వాన్ని పూర్తిగా తొలగించాలనే మంచి ఉద్దేశంతో పారదర్శక విధానాలకు పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గనుల శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకున్న విధానాలతో రాష్ట్రంలో మైనింగ్ కార్యక్రమాలు పెరిగాయన్నారు. తద్వారా అటు ప్రభుత్వానికి మైనింగ్ రెవెన్యూ, ఇటు పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల లభ్యత, పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఆ ప్రకటనలో ఇంకా ఏం పేర్కొన్నారంటే..

అధ్యయనం తరువాతే..

ఇతర రాష్ట్రాలు చిన్నతరహా ఖనిజాల సీనరేజి వసూళ్లను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం ద్వారా మైనింగ్ రెవెన్యూలో స్థిరత్వం, పురోగతి సాధిస్తున్నాయి. దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో గనుల శాఖకు చెందిన మైనింగ్ అధికారులు రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పర్యటించి ఈ విధానాన్ని అధ్యయనం చేశారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని నివేదించడంతో ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సీనరేజి వసూళ్ల కోసం మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఎక్కువమంది టెండర్లలో పాల్గొనేలా నిబంధనలను సరళతరం చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని మైనింగ్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మైనింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాలు, జనరల్ ఫైనాన్షియల్ రూల్స్–2017కు అనుగుణంగానే ప్రభుత్వం రిజర్వు ధర, సరళమైన నిబంధనలను అమలులోకి తెస్తూ టెండర్ల నిర్వహణకు ఆమోదం తెలిపింది. కొత్త నిబంధనలతో నిర్వహించిన టెండర్లలో 5 జిల్లాలకు టెండర్లు ఖరారయ్యాయి. మొదట సాంకేతిక బిడ్‌ను పరిశీలించి అందులో అర్హులైన వారిని మాత్రమే ఫైనాన్షియల్ బిడ్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తున్నాం. కోట్ చేసిన వాటిలో అధిక మొత్తం నుంచి ఆక్షన్ ప్రారంభమవుతుంది. అంతకంటే ఎక్కువ ఎవరైతే కోట్ చేస్తారో వారికే టెండర్ దక్కుతుంది. ఇంత పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తుంటే 'ఈనాడు' పనిగట్టుకుని అబద్ధాలతో ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

టెండర్లలో 'ఈనాడు' పాల్గొనవచ్చు

టెండర్లలో బిడ్లు దాఖలు చేసిన సంస్థల అర్హతలను మాత్రమే గనుల శాఖ పరిశీలిస్తుంది. వ్యాపార రంగంలో ఉన్న ఈనాడు పత్రికకు కనీసం ఈ విషయం తెలియకపోవడం బాధాకరం. ఆసక్తి ఉంటే ఈ టెండర్లలో ఈనాడు సంస్థ ప్రతినిధులు కూడా పాల్గొనవచ్చు. వారిని కూడా ఆహ్వానిస్తున్నాం. రాష్ట్రంలో ఖనిజాలను రవాణా చేసే వాహనాలను ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పర్యవేక్షిస్తూ సీనరేజి వసూళ్లలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తారు. దీనివల్ల ప్రభుత్వానికి మైనింగ్ రెవెన్యూ పెరుగుతుంది. మైనింగ్‌పై పటిష్ట పర్యవేక్షణ కోసం సీఎం వైఎస్ జగన్ ప్రతి జిల్లాలో ఒక విజిలెన్స్ బృందాన్ని నియమించేలా ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఇంత మంచి విధానాన్ని అమలు చేస్తుంటే అవగాహన లేకుండా ఈనాడు పత్రిక వక్రీకరణ కథనాలను ప్రచురించడం సరికాదు.

క్లుప్తంగా...

128 దేశాల జాతీయ జెండాలు... రెండున్నర నిమిషాల్లో గుర్తించాడు

- కృష్ణా జిల్లాకు చెందిన ఆరేళ్ల బాలుడి అద్భుత ప్రతిభ
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



పెనమలూరు: కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన ఒకటో తరగతి బాలుడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. ఆరు సంవత్సరాల నాలుగు నెలల వయసు గల నాదెళ్ల దియాన్ష్ 128 దేశాల జాతీయ జెండాలను చూసి రెండు నిమిషాల 25 సెకన్లలో గుర్తించి చెప్పాడు. గత నెల 12వ తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో దియాన్ష్ ఈ ఘనత సాధించాడు. ఆ బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తూ సర్టిఫికెట్, మెడల్‌ను రెండు రోజుల క్రితం పంపారు. ఈ విషయాన్ని దియాన్ష్ తల్లిదండ్రులు ప్రియాంక, గౌతంకృష్ణ శనివారం వెల్లడించారు. తమ కుమారుడు ఇప్పుడు 135 దేశాల జాతీయ జెండాలను గుర్తిస్తున్నాడని తెలిపారు.

గిరి బిడ్డలపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

- వివిధ పథకాల కింద రూ. 15,589.38 కోట్ల ఖర్చు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



మాట్లాడుతున్న అప్పిరెడ్డి

సాక్షి,అమరావతి : గిరిజనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారని, వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. వివిధ పథకాల కింద రూ.15,589.38 కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గిరిజన విభాగం సమావేశం నిర్వహించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ తెగల జీవన ప్రమాణాల పురోగతితోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని పేర్కొన్నారు. 1.38 లక్షల గిరిజన కుటుంబాలకు 3 లక్షల ఎకరాల ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను పంపిణీ చేశారని గుర్తు చేశారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చారని, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన నిధులను ఖర్చు చేయడానికి సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు మేరాజోత్ హనుమంత్ నాయక్, మత్స్యరాస వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డైపర్లు మార్చినట్టుగా పార్టీలు మారుతున్నారు

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు




సాక్షి, భీమవరం : ప్రస్తుత రాజకీయాల్లో విలువలు కొరవడ్డాయని, చిన్న పిల్లలకు డైపర్లు మార్చినంత సునాయాసంగా రాజకీయ నాయకులు పార్టీలు మారిపోతున్నారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శనివారం ఎస్ఆర్‌కేఆర్, శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలో అడుగుపెట్టే నాయకులు బయటివారికి ఆదర్శనీయంగా ఉండాల్సిందిపోయి భావదారిద్ర్యంతో పాటు విలువలు, సంప్రదాయాలను మంటగలుపుతూ బట్టలు చించుకునేలా ప్రవర్తించడం మంచిదికాదన్నారు. త్రీ బీ అంటే బస్, బిర్యాని, బత్త(డబ్బు) ఏర్పాటుచేస్తే గానీ ప్రజలు సమావేశాలకు రావడం లేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉన్నవారే ప్రజలకు మేలు చేస్తారని, అలాంటి నాయకులను ప్రజలు ఎన్నటికీ మరచిపోరని వెంకయ్యనాయుడు చెప్పారు. యువత రాజకీయాల్లోకి వచ్చి విలువలతో కూడిన వ్యక్తిత్వం అలవర్చుకోవాలని సూచించారు.

లోకేశ్‌కు ప్రాణహాని తలపెట్టే కుట్ర

గవర్నర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పోలీసులు కావాలనే నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ టీడీపీ నేతలు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదు చేశారు. గవర్నర్‌ను శనివారం కలిసిన టీడీపీ నేతలు లోకేశ్‌కు ప్రాణహాని తలపెట్టే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రచార రథాలను సీజ్ చేయడమే కాకుండా మైకులు కూడా లాక్కుంటున్నారని గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ పాదయాత్రకు లేని అడ్డంకులు లోకేశ్ పాదయాత్రకే వర్తిస్తాయా?, ప్రజల వద్దకు వెళ్లే హక్కు ప్రతిపక్ష నాయకులకు లేదా అని ప్రశ్నించారు. డీఐజీ కొల్లి రఘురామిరెడ్డిపై చాలా అనుమానాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న పాదయాత్రకు ఇన్ని అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య ఉన్నారు.



బ్రాండెడ్ గుడ్డు గురూ!

మార్కెట్లో బ్రాండెడ్ గుడ్ల హల్‌చల్

- రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్
- సాధారణ గుడ్డుతో పోలిస్తే మూడు రెట్లు అధిక ధర
- యాంటీ బయోటిక్స్ దూరం.. అధిక ప్రోటీన్‌లమయం

సాక్షి, అమరావతి : బ్రాండింగ్ మానియా ఇప్పుడు కోడిగుడ్లకూ వచ్చి చేరింది. వివిధ రంగుల్లో, వివిధ పరిమాణాల్లో ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి వివిధ బ్రాండ్ల పేర్లతో విక్రయిస్తున్నారు. ఆహార పదార్థాల కొనుగోళ్లలో వినియోగదారులు నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తుండటంతో వారి అంచనాలకనుగుణంగా గుడ్లను ప్రవేశపెడుతున్నారు. ఎలాంటి రసాయనాలు, యాంటి బయోటిక్స్ వినియోగించని సహజ సిద్ధమైన కోడి గుడ్లు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్న గుడ్లు, అధిక ప్రోటీన్‌లున్న గుడ్లు.. ఇలా రకరకాల పేర్లతో విక్రయిస్తున్నారు. సాధారణ గుడ్డు ధరతో పోలిస్తే ఈ బ్రాండెడ్ గుడ్ల ధరలు అధికంగానే ఉంటున్నాయి. ప్రస్తుతం సాధారణ గుడ్డు ధర బహిరంగ మార్కెట్లో రూ.6 ఉంటే, బ్రాండెడ్ గుడ్డు దాని లక్షణాలను బట్టి ధర రూ.10 నుంచి రూ.25 దాకా ఉంటోంది. ఉదాహరణకు హ్యాపీ హెన్స్ బ్రాండ్‌తో విక్రయిస్తున్న సంస్థ ఫ్రీ రేంజ్ ఎగ్స్‌ను ఒక్కోటి రూ.25కు విక్రయిస్తోంది. ఈ గుడ్డు బరువు 100 గ్రాములుండటమే గాక, అధిక ప్రొటీన్లు, విటమిన్లతో ఉంటుందని చెబుతోంది.

'ఎగ్గోజ్'తో సంచలనం

ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన అభిషేక్ నగీ 2017లో తొలిసారిగా ఎగ్గోజ్ పేరుతో బ్రాండెడ్ ఎగ్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసి సంచలనం సృష్టించాడు. ఐఐటీ పూర్తి చేశాక ఒక రిటైల్ సంస్థలో ఉద్యోగంలో చేరినప్పటికీ కొత్తగా వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచనతో ఈ రంగంలోకి అడుగుపెట్టాడు. కోడిగుడ్లు అధికంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతుండటం, వినియోగం మాత్రం ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉండటాన్ని నగీ గమనించాడు. పైగా దక్షిణాది నుంచి ఉత్తరాదికి గుడ్డు రావడానికి ఎనిమిది రోజులకు పైగా సమయం పడుతోంది. ఈలోపు తనలో ఉన్న సహజసిద్ధమైన ప్రొటీన్‌లు కొన్నింటిని ఆ గుడ్డు కోల్పోతున్న విషయాన్ని గుర్తించారు. గుడ్డు పెట్టిన 24 గంటల్లోగా వినియోగదారుడికి చేర్చేలా ఎగ్గోజ్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టి విజయం సాధించాడు. ఆ తర్వాత అనేక మంది బ్రాండెడ్ ఎగ్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. ప్రస్తుతం సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ మార్కెట్లలో ఎగ్గోజ్‌తో పాటు కెగ్స్, గుడ్ మార్నింగ్, హాలో, ఎగ్గీ, హెన్ ఫ్రూట్, ఫ్రెషో, ఫామ్ మేడ్, బీబీ కాంబో, హ్యాపీ హెన్ తదితర బ్రాండెడ్ గుడ్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రతి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ

కోళ్ల పెంపకం దగ్గర నుంచి గుడ్డు ఎంపిక వరకూ అంతా ప్రత్యేకం. కొన్ని కోళ్లను సహజసిద్ధమైన వాతావరణం అంటే తోటల్లో పెంచితే, మరికొన్నింటిని ఫామ్స్‌లో పెంచుతారు. వాటికి దాణా, మందులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కొన్ని కోళ్లకు శాఖాహార దాణాను అందిస్తూ పెంచితే, మరికొన్నింటిని హెర్బల్స్, జీడిపప్పు, బాదంపప్పు వంటి ప్రత్యేక దాణాతో పెంచుతున్నారు. సాధారణంగా కోడిగుడ్డు బరువు 45 నుంచి 52 గ్రాముల మధ్యలో ఉంటుంది. గుడ్డు పరిమాణం పెరిగే కొద్దీ ధర పెరుగుతుంది. 53–60 గ్రాముల మధ్యలో ఉండే గుడ్లను ప్రీమియం గుడ్లుగా, 60 గ్రాముల దాటితే సూపర్ ప్రీమియంగానూ పరిగణించి ధర నిర్ణయిస్తుంటారు. బ్రాండెడ్ గుడ్డును ఎంపిక చేసేప్పుడు గుడ్డుపై పెంకు నాణ్యత కూడా కీలకం. మచ్చలు లేకుండా పరిశుభ్రంగా ఉండి, మరీ మందంగా కాకుండా పల్చగా ఉండే గుడ్లను ఎంపిక చేస్తున్నారు. వాటిని అందంగా ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా గుడ్ల ప్యాకేజింగ్ పరిశ్రమ విలువ రూ.25,412.32 కోట్లుగా ఉంటే, అది ఏటా 6 శాతంపైన వృద్ధి చెందడం ద్వారా 2028 నాటికి రూ.37,960.24 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

బ్రాండెడ్ ఎగ్ మార్కెట్లోకి ప్రవేశించాం..

బ్రాండెడ్ ఎగ్స్ మార్కెట్ ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. హలో బ్రాండ్ పేరుతో మేమూ ఈ రంగంలోకి అడుగు పెడుతున్నాం. ఇందుకోసం దాణా దగ్గర నుంచి గుడ్ల ఎంపిక వరకు అనేక ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. హై ఎండ్ ధరల సెగ్మెంట్లోకి కాకుండా సాధారణ గుడ్డు కంటే రెండు మూడు రూపాయలు అధికంగా ఉండే మార్కెట్‌పై తొలుత దృష్టిసారిస్తున్నాం.

– సురేష్ చిట్టూరి, ఎండీ, శ్రీనివాస హేచరీస్

సంతోషమే 'పూర్తి' బలం!

ఆనందంగా ఉన్నామనే భావన విజయపథం వైపు నడిపిస్తుందంటున్న మానసిక నిపుణులు

- సంతోషానికి ఓ సూచిక పెట్టి వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్ రిపోర్ట్ విడుదల
- 2022లో మొత్తం 146 దేశాల్లో భారత్‌కు 136వ ర్యాంక్
- విదేశాలకు, భారత్‌కు వర్తించే అంశాల్లో తేడాలే తక్కువ ర్యాంక్‌కు కారణమని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'సంతోషమే సగం బలం' అన్న సామెత ఎప్పటి నుంచో ఉన్నదే. కానీ ప్రస్తుత జీవన పరిస్థితులు, కొత్త అలవాట్లు, కెరీర్ సమస్యల నేపథ్యంలో మనిషికి 'సంతోషమే పూర్తి బలం' అన్నట్టుగా మారిపోయింది. సంతోషమనేది మనిషి జీవితంలో ఒక ముఖ్యమైన సానుకూల భావన అని.. ఆనందంగా ఉండేవారు మంచి మానవ సంబంధాలు కలిగి ఉంటారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సంతోషంగా ఉండేవారు తక్కువగా ఒత్తిళ్లకు గురవుతారని.. ఇతరుల కంటే అధిక సృజనాత్మకత కలిగి ఉండటంతోపాటు ఇతరుల పట్ల దాతృత్వాన్ని, ఉదారతను ప్రదర్శిస్తారని వివరిస్తున్నారు. ఇలాంటి వారు తోటివారి నుంచి సామాజికంగా తోడు పొందుతూ.. మంచి ఆరోగ్యంతో ఎక్కువకాలం జీవిస్తారని చెప్తున్నారు. అసలు తాము సంతోషంగా ఉన్నామనే భావనే.. చాలా మందిని తమ జీవితంలో అనేక ప్రయత్నాలు, చొరవ వైపు నెట్టి, విజయం దిశగా నడిపిస్తుందని విశ్లేషిస్తున్నారు. సమాజంలో లేదా కుటుంబంలో పెద్దల అంచనాలను చేరుకోలేకపోతే అసంతృప్తికి దారితీస్తుందని.. పెద్దగా సమస్యలు లేకపోయినా ఇంకేదో కావాలని కోరుకుంటూ నిరాశ, నిస్పృహలకు గురవుతున్నవారు పెద్ద సంఖ్యలో ఉన్నారని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

హ్యాపీనెస్‌కు ఓ ఇండెక్స్.. మన పరిస్థితి భిన్నం..

గ్లోబల్ హ్యాపీనెస్ కౌన్సిల్ మొదటగా ప్రపంచ దేశాలకు సంబంధించి హ్యాపీనెస్ ఇండెక్స్‌ను రూపొందించింది. 2012 నుంచి దాదాపు 150 దేశాలకు సంబంధించి పలు అంశాల ప్రాతిపదికన ఏటా 'వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్' నివేదికను వెలువరిస్తోంది. తలసరి జీడీపీ, సాంఘిక మద్దతు, వ్యక్తిగత స్వేచ్ఛ, అవినీతి స్థాయిలు, సేవాభావం, దాతృత్వం, ఆరోగ్యకర జీవన అంచనాలు, ఆనందానికి సంబంధించి ఆ దేశ ప్రజలు ఏమనుకుంటున్నారు అన్న అంశాలను ఇందుకు పరిగణనలోకి తీసుకుంటోంది. ఈ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భారత స్కోర్, ర్యాంక్ ఏమంత గొప్పగా ఉండటం లేదు. హ్యాపీనెస్ ఇండెక్స్ రిపోర్ట్–2022లో మొత్తం 146 దేశాలకుగాను భారత్ 136 ర్యాంకు సాధించింది. ఆయా దేశాలకు, ఇండియాకు వర్తించే విషయాల్లో తేడాలు, సారూప్యతలు భిన్నంగా ఉండటం కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెప్తున్నారు. అంతేగాకుండా మనదేశంలో సంతోషం–సంపద మధ్య బలహీనమైన సహ సంబంధం (కోరిలేషన్) కొరవడటమూ కారణమని ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత్రి జయశ్రీ సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. దేశంలో అసమానతల పెరుగుదల, ధనికులు తమ ఇళ్లలో ఆర్భాటంగా చేసే పెళ్లిళ్లు, ఫంక్షన్లు వంటివి సామాన్య ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతాయని చెప్పారు. మితిమీరిన పట్టణీకరణ, నగరాలు ఇరుకుగా మారడం, ఆహారభద్రత, ధరల పెరుగుదల వంటివి కూడా దీనిని ప్రభావితం చేస్తాయన్నారు.

శారీరక, సామాజిక అవసరాల నుంచి..

అమెరికాకు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ అబ్రహం మాస్లో 1970 దశకంలో చేసిన సిద్ధాంతీకరణల ప్రకారం..

- మనిషి జీవితం ప్రధానంగా ఆహారం, నీరు, శృంగారం, నిద్ర వంటి ప్రాథమిక శారీరక అవసరాలపై ఆధారపడి ఉంటుంది. ఇవి సంతోషాన్ని ప్రభావితం చేస్తాయి.
- శారీరక భద్రత, ఉద్యోగం, కుటుంబం, ఆరోగ్యం, ఆస్తుల భద్రత, ప్రేమ, తమదనే భావన, లైంగికపరమైన దగ్గరితనం, ఆత్మగౌరవం, విశ్వాసం, ఇతరులను గౌరవించడం, స్వీయ వాస్తవికత, నైతికత ఆనందాన్ని కలిగిస్తాయి.
- సామాజికంగా తెలిసిన వారితో స్నేహానుబంధాలు, ప్రేమ, బంధుత్వాల సాధనతోనూ చాలా మంది సంతోషపడి సంతృప్తి చెందుతారు.

సమష్టి ఆనందంతోనే ఉన్నత స్థాయికి..

ప్రపంచంలో ఎవరినైనా జీవితంలో ఏది ముఖ్యమని ప్రశ్నిస్తే.. సంతోషంగా ఉండటమేననే సమాధానం వస్తుంది. అందరూ ఆనందంగా ఉండాలనే కోరుకుంటారు. కానీ సంతోషమైనా, ఆనందమైనా ఎలా వస్తుందనేది ముఖ్యం. వ్యక్తిగత స్థాయి కంటే కూడా సమూహ, సమష్టి ఆనందం ఉన్నతస్థాయిలో నిలుపుతుంది. సంతోషం, సంతృప్తి, ఆనందం అనేవాటిని మనకు మాత్రమే పరిమితం చేసుకోకుండా విశాల సమాజానికి, వర్గానికి కలిగేలా చేయడం ద్వారా ఒక సార్థకత ఏర్పడుతుంది. అయితే అపరిమితమైన ఆశలు, ఆశయాలు, నెరవేర్చుకోలేని కోరికలు సరికాదు. జీవితం–చేస్తున్న పని మధ్య తగిన సమతూకం సాధించడమూ ముఖ్యమే. మనకు నచ్చిన ఆహారం తినడం నుంచి నిర్దేశించుకున్న లక్ష్యాలు, అంచనాలు చేరుకోవడం వరకు సంతోషానికి మార్గాలు ఎన్నో. ఒక్కొక్కరి అలవాట్లు, పద్ధతులు, ఆలోచనా ధోరణులు, పెరిగిన వాతావరణం వంటివాటి ఆధారంగా ఈ మార్గాలు మారుతూ ఉంటాయి.

– డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, డైరెక్టర్, ఆశా హాస్పిటల్స్

ఆక్వా రంగానికి 24 గంటలు విద్యుత్

- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్దనరెడ్డి



గోపవరంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న పద్మ జనార్దన్‌రెడ్డి, డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆక్వా రంగానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మ జనార్దనరెడ్డి చెప్పారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని గోపవరం గ్రామంలో 220/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో పద్మ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సబ్సిడీ పొందని అర్హులైన ఆక్వా రైతులు ఆయా ప్రాంతాల డీఈలకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం(ఆర్‌డీఎస్ఎస్) సాంకేతిక బిడ్‌లను పూర్తి చేసి ఆర్థిక అనుమతులకు పంపించామని పేర్కొన్నారు. సాంకేతికతను అందరూ ఆహ్వానించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరమని, వీటివల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 220 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో ఇది మరింతగా పెరుగుతుందన్నారు. ఈ ఏడాది నెల్లూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ నుంచి 800 మెగావాట్లు విద్యుత్ అందుబాటులోకి వస్తుందని, రానున్న రోజుల్లో కరెంటు కోతలు ఉండబోవని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఏపీ ట్రాన్స్‌కో గ్రిడ్, ట్రాన్స్‌మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీకే భాస్కర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అది టీడీపీ అసత్యాల పుస్తకం

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి వివరాలు అందులో ఉటంకించాలి కదా చంద్రబాబూ? అంత పిరికిపందవా?

- ఆ పుస్తకంలో మీరు రాసినవన్నీ అసత్యాలని మీకూ తెలుసు. మీరెన్ని అసత్యాలు రాసినా సీఎం ప్రతిష్టను , నిజాలను ఏమార్చలేరు. అవి తప్పుడు రాతలని, విషపు రాతలని చంద్రబాబే ఒప్పుకుంటున్నాడు.
- వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు సీఎం ఎవరు? ప్రభుత్వం ఎవరిది? తప్పుడు రాతలతో విషం చిమ్మే బదులు.. వివేకా కుమార్తెను, భార్యను, అల్లుడిని.. ఊళ్లో ఉన్న ఆయన కుటుంబాన్ని ఎందుకు విచారించలేదు? అప్పుడున్నది మీ ప్రభుత్వమే కదా?
- ఎంపీ అవినాష్‌రెడ్డి ఆనవాళ్లు చెరిపించాడంటే నువ్వు, నీ డీజీపీ, ఏబీ వెంకటేశ్వరరావు, పోలీసులు ఏం చేశారు? ఆ రోజు వివేకానందరెడ్డి కుమార్తె వాంగ్మూలం ఎందుకు తీసుకోలేదు. అప్పుడు నీది చేత కాని ప్రభుత్వమా? లేక తప్పుడు ప్రభుత్వమా?

నీ సంస్కారం ఇదేనా?

- నీ ఇంట్లో వారే ఆడవాళ్లా. ఇతర కుటుంబాల్లోని ఆడవాళ్లకు ఆత్మాభిమానం, పరువు ప్రతిష్టలు ఉండవా? వైఎస్ భారతమ్మ ఫొటో పుస్తకంలో ప్రచురిస్తావా? ఏం నీచపు బుద్ధి నీది? 23 మంది ఎమ్మెల్యేలను కొన్నా, జగన్‌మోహన్‌రెడ్డిని మానసికంగా కుంగదీయలేకపోయావు. నీ వల్ల కాక బీజేపీ నాయకులు, నువ్వు దత్తత తీసుకున్న వారితో అవాకులు చవాకులు మాట్లాడిస్తున్నావు.
- ఎక్కడో యూట్యూబ్‌లో నీ భార్యను ఎవరో ఏదో అన్నారంటూ.. ఒకటే ఏడ్పులు. ఇంత వయసొచ్చిన నీ సంస్కారం ఇదేనా? ఇంత నీచ, కిరాతక, హేయమైన రాజకీయ నాయకుడితో పోటీగా రాజకీయాలు చేయాల్సి రావడం మా దురదృష్టకరం. తెలుగుకు తెగులు పట్టిస్తున్న చదువు సంధ్యలు లేని నీ కొడుకు లోకేశ్‌ను ఊరి మీదికి వదిలి కామెడీ చేయిస్తున్నావు.

ఎన్టీఆర్, కోడెలపై పుస్తకం ఎందుకు వేయలేదు?

- ఎన్టీఆర్ మృతిపై భార్య లక్ష్మీపార్వతి, ఆయన కుమారుడు హరికృష్ణ సీబీఐ దర్యాప్తు కోరితే సీఎంగా ఉన్న నువ్వు కనీసం సీబీసీఐడీ దర్యాప్తు అయినా చేయించావా? మరి అప్పుడిలా పుస్తకం ఎందుకు వేయించలేదు? ఎన్టీఆర్ పతనం, కుట్ర, కుతంత్రం, వెన్నుపోటు, వీటన్నింటిపై పుస్తకం వేయాలి. సీబీఐ దర్యాప్తు జరగాలి.
- అవినాష్ రెడ్డి సీబీఐకి ఇచ్చారని నువ్వు చెబుతున్న వాంగ్మూలం నీకు ఎక్కడి నుంచి వచ్చింది? అంటే సీబీఐ బాబు ఆదేశానుసారం నడుస్తోందని భావించాలా.. ఆ స్టేట్‌మెంట్ నువ్వు అచ్చేయగలిగావంటే నీ మార్గనిర్దేశకత్వంలో సీబీఐ నడుస్తోందనుకోవాలి.
- నీ పార్టీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు బలవన్మరణంపై పుస్తకం ఎందుకు వేయలేదు? ఆ మరణం వెనుక నీ ప్రమేయం లేకపోతే కోడెల ఫోన్‌ను తెలంగాణ పోలీసులకు ఎందుకివ్వలేదు? ఆ ఫోన్‌ను ఎందుకు ధ్వంసం చేయించావు? నీ పాపాలు బయటకు వస్తాయనే కదా! ఎన్టీఆర్ కుమార్తె మరణంపైనా సీబీఐ దర్యాప్తు వేయాలి కదా?

పారదర్శకంగా కానిస్టేబుల్ నియామకాలు

- ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక
- ఉద్యోగాలు ఇప్పిస్తామనే వారి మాటలతో మోసపోవద్దు: హోంమంత్రి తానేటి వనిత



సాక్షి, అమరావతి: కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని, ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాటలు విని మోసపోవద్దని అభ్యర్థులను ఆమె హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, అభ్యర్థులు వారి తెలివితేటలు, మెరిట్ ఆధారంగానే ఉద్యోగం పొందుతారని శనివారం ఒక ప్రకటనలో హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి పారదర్శకంగా, సజావుగా జరిగాయని.. అదే విధంగా తుది అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఇప్పుడూ అదే విధానాన్ని అవలంబిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మాయమాటలు చెప్పేవారిని నమ్మి మోసపోవద్దని అభ్యర్థులను హోంమంత్రి హెచ్చరించారు.

డీఐఏ అధ్యక్షుడిగా మామిడి సుదర్శన్

సాక్షి, అమరావతి: దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ (డీఐఏ) అధ్యక్షుడిగా మామిడి సుదర్శన్ 8వసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ సమీపంలోని పోరంకిలో ఆ సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా గాదె అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్కెపోగు జయరాజు, తెలంగాణ అధ్యక్షుడిగా రాయపాటి అలెగ్జాండర్ ఎన్నికయ్యారు. సుదర్శన్ మాట్లాడుతూ దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ యువతను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు.

ఆ 'హత్య' కేసులో పోలీసులను నిందితులుగా చేర్చండి

హైకోర్టులో నిందితుల పిటిషన్లు.. కొట్టివేసిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తండ్రి, ఇద్దరు కుమారుల హత్య కేసులో సాక్షులుగా ఉన్న కొందరు పోలీసులను నిందితులుగా చేర్చి తమతో పాటు వారినీ విచారించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆ కేసులో నిందితులు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో పోలీసులను నిందితులుగా చేర్చేందుకు తగిన ఆధారాలు ఏవీ కనిపించడం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. పోలీసులను నిందితులుగా చేర్చేందుకు నిరాకరిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు శుక్రవారం తీర్పు చెప్పారు. 2014 సెప్టెంబర్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని పినకడిమి గ్రామానికి చెందిన తండ్రి కొడుకులైన గంధం నాగేశ్వరరావు, మారయ్య, పగిడి మారయ్యలను తుపాకీతో కాల్చి హత్య చేశారు. ఈ హత్యలపై పోలీసులు విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేసి 49 మందిని నిందితులుగా చేర్చారు. దీనిపై విజయవాడ ఏడో అదనపు జిల్లా కోర్టులో విచారణ జరుగుతోంది. అప్పట్లో ఏలూరులో కానిస్టేబుళ్లుగా పనిచేసిన ముగ్గురితో పాటు అప్పటి 1వ టౌన్ ఎస్ఐ తదితరులను సాక్షులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో సాక్షులుగా పేర్కొన్న పోలీసులను నిందితులుగా చేర్చి విచారించాలంటూ నిందితులు ప్రతాప్ సింగ్ మరికొందరు విజయవాడ కోర్టులో పిటిషన్ వేయగా దాన్ని కోర్టు కొట్టేసింది. దాన్ని సవాలు చేస్తూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపి పై విధంగా తీర్పుచెప్పారు.

లోక్ అదాలత్‌లో 1,51,261 కేసుల పరిష్కారం

- రాష్ట్రవ్యాప్తంగా 411 లోక్ అదాలత్ బెంచ్‌లు
- హైకోర్టులో 201 కేసుల పరిష్కారం

సాక్షి, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం 1,51,261 కేసులను పరిష్కరించి, రూ.42.86 కోట్ల పరిహారం అందచేశారు. ఈ 1,51,261 కేసుల్లో 1,25,733 పెండింగ్ కేసులు కాగా, 25,528 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లో ఉన్న అన్ని న్యాయస్థానాల్లో 411 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు బెంచ్‌లను నిర్వహించారు. మొత్తం 201 కేసులు పరిష్కరించారు. రూ.5.26 కోట్లు పరిహారంగా అందజేశారు. ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, ఏపీ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఏవీ శేషసాయి ఆదేశాలు, మార్గదర్శకత్వంలో లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించామని న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం.గురునాథ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులకు, కక్షిదారులకు, ఇతర అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ

మార్చి 1 నుంచి టీఎస్‌సెట్ హాల్‌టికెట్ల జారీ

- నేడు, రేపు ఎడిట్ ఆప్షన్స్
- పరీక్షకు హాజరుకానున్న 50,237 మంది అభ్యర్థులు

హైదరాబాద్: టీఎస్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 10న ముగిసింది. దరఖాస్తుల్లో తప్పులను ఆది, సోమవారాల్లో సరిచేసుకోవాలని టీఎస్‌సెట్ సభ్య కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణ తెలిపారు. మార్చి 13, 14, 15 తేదీలలో 29 సబ్జెక్టులకు జరిగే పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మార్చి 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తెలంగాణతో పాటు ఏపీలో 4 కేంద్రాలలో జరిగే టీఎస్‌సెట్‌కు 50,237 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గత టీఎస్‌సెట్ కంటే ఈ సారి 8 వేల మంది అభ్యర్థులు అధికంగా దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.



తక్కువలోనే అతి ఎక్కువ సంతృప్తిని పొందే వ్యక్తి లోకంలోనే అత్యంత సంపన్నుడు.

– బౌద్ధ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.సప్తమి తె.5.12 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి అష్టమి, నక్షత్రం: స్వాతి రా.10.34 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: తె.4.08 నుండి 5.43 వరకు (తెల్లవారితే సోమవారం), దుర్ముహూర్తం: సా.4.25 నుండి 5.11 వరకు, అమృతఘడియలు: ప.1.43 నుండి 3.23 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

బిల్ గేట్స్ (బిజినెస్ మాగ్నెట్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మిస్ పాలా నవ్వారు.

ఆమె నవ్వు సియాటిల్ నగరంలా అందంగా ఉంది. నన్ను అర్థం చేసుకున్న సిటీ సియాటిల్. అక్కడే నేను పుట్టాను. పర్వతాల అరణ్య జ్వాలలపై నాకు ప్రేమ కలిగిందీ అక్కడే.

"ఏంటి నవ్వుతున్నారు మిస్ పాలా?" అని అడిగాను.

సియాటిల్‌లోని మొత్తం ఏడు లక్షల యాభై వేల మంది జనాభాకు కాస్త దూరంగా ఉండే కాఫీ షాప్‌లో ఇద్దరం పక్కపక్కన కూర్చొని ఉన్నాం. నేను ఆమె వైపు జరిగి కూర్చుంటే ఆమె నావైపు ఒరిగి కూర్చున్నారు.

"మన గురించి ఏవో రాస్తున్నారు.." అన్నారు పాలా.. నవ్వుతూనే.

నేనూ నవ్వాను.

"మీరెందుకు నవ్వుతున్నారు బిల్!" అన్నారామె.

"ఏవో రాస్తున్నారు కానీ, ఏవేవో రాయడం లేదు. నయం కదా.." అన్నాను.

ఇద్దరం కాసేపు మౌనంగా ఉండి పోయాం. మా భుజాలు వాటి కబుర్లలో అవి



ఉండిపోయాయి.

"మీ నవ్వు పొయెట్రీలా ఉంటుంది బిల్.." అన్నారు పాలా హఠాత్తుగా!

67 ఏళ్ల వయసులో ఆమె కారణంగా సియాటిల్ నగరాన్ని నేను, 60 ఏళ్ల వయసులో నా కారణంగా పొయెట్రీని ఆమె ఇష్టపడుతున్నామా? అయినా నా నవ్వు పొయెట్రీలా ఉంటుందని ఆమె అన్నారే గానీ పొయెట్రీని తను ఇష్టపడతానని అన్లేదుగా!!

"పొయెట్రీ అంటే మీకు ఇష్టమా?" అని అడిగాను.

ఆమె నవ్వి, "ఎవరికుండదూ..!" అన్నారు.

"బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేసిన వాళ్లక్కూడానా?" అన్నాను.

"ఓయ్.." అంటూ తన భుజంతో నా భుజాన్ని నెట్టేశారు పాలా.

ఆమెలో ఏదో మాయ ఉంది. యాన్ విన్‌బ్లాడ్‌లో ఉన్నట్లు, జిల్ బెనెట్‌లో ఉన్నట్లు, మెలిండాలో ఉన్నట్లు! అసలు ఆడవాళ్లలోనే ఈ మాయ ఉంటుందా?!

మెలిండా నాకు విడాకులు ఇవ్వడానికి విన్‌బ్లాడ్ కానీ, జిల్ బెనెట్ గానీ కారణం కాదు. పాలాకు నేను దగ్గరవ్వడానికి మెలిండా కానీ మరొకరు కానీ కారణం కాదు. ప్రేమ, స్నేహం.. ఇవి మాత్రమే నడిపిస్తాయి జీవితాన్ని.

జెఫ్రీ ఎప్‌స్టైన్ నా స్నేహితుడు. అతడితో మాట్లాడవద్దంటుంది మెలిండా. అతడి మీద కేసులు ఉన్నాయని, అతడు జైలుకు వెళ్లాడని, అతడితో స్నేహం వదిలేయమని అంటుంది. "ఎలా వదిలిపెట్టడం మెలిండా?" అంటే.. "పోనీ నన్నొదిలేయ్" అంటుంది!! జైల్లో జెఫ్రీ ఆత్మహత్య చేసుకుని చనిపోయాక కూడా మెలిండా మనసు కరగలేదు. ఎందుకుండాలి ఒక మనిషి పట్ల మరొక మనిషి అంత కఠినంగా!! మెలిండాతో ఆ మాటే అన్నాను. కోపంతో నన్ను వదిలి వెళ్లింది. కానీ ప్రేమ, టెన్నిస్ ఎవర్నీ ఒంటరిగా ఉండనివ్వవు. నా జీవితంలోకి పాలా ప్రవేశించారు.

నాలానే పాలా టెన్నిస్ అభిమాని. మొదటి సారి కలిసినప్పుడు.. "మీ..రూ.." అంటూ నన్నలా చూస్తూ ఉండిపోయారు పాలా. రెండోసారి మేము కలుసుకున్నప్పుడు "మీ..రూ.." అంటూ తనను అలా చూస్తూ ఉండిపోయాన్నేను.

మనసుకు నచ్చిన వాళ్లతో కలిసి కూర్చోడానికి టెన్నిస్ టోర్నమెంట్‌ల తర్వాత కాఫీ షాపులు బాగుంటాయి. అయితే ఒక్కటే నిరాశను కలిగిస్తుంది. కాఫీ షాపులలో ఎన్ని గంటలు కూర్చున్నా డ్యూటీకి వెళ్లడం కోసమైతే ల్యాప్‌టాప్‌ని తగిలించుకుని పైకి లేవవల సిందే. పాలా ఈవెంట్ ఆర్గనైజర్.

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు బిల్.." అన్నారు పాలా తన భుజంతో మళ్లీ నా భుజాన్ని నెట్టేస్తూ.

మా ముందున్న టేబుల్ మీద ఆవేళ్టి ట్యాబ్లాయిడ్స్ ఉన్నాయి. 'బిల్ గేట్స్‌కి మళ్లీ ప్రేమ దొరికింది'.. అన్నిటిపైనా ముఖ్యాంశం ఒకటే!

'అవునా! బిల్ గేట్స్‌కి ప్రేమ దొరికిందా?!' అంటూ నా కళ్లలోకి చూసి నవ్వారు పాలా.

అధికారం కోసం ఎంతకైనా తెగించడం... ఎవరితోనైనా చేతులు కలపటం చంద్రబాబు నైజం. సొంత మామ ఎన్‌టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినపుడు గానీ... ఆగర్భ శత్రువైన కాంగ్రెస్‌తో గత ఎన్నికల్లో జతకట్టడం కానీ ఈ నైజానికి ఓ రెండు మేలిమి ఉదాహరణలు మాత్రమే. వంగవీటి రంగాను పట్టపగలు నడిరోడ్డుపై హతమార్చిన నారాసుర రక్త చరిత్ర ఎవరికి తెలియదని? టీడీపీలో ఈయనకు పోటీగా ఎదిగిన ప్రతి నాయకుడూ... రోడ్డు ప్రమాదంలోనో, నక్సల్స్ చేతుల్లోనో ప్రాణాలు కోల్పోయారంటే ఆ రక్తపు మరకలకు కారకులెవరో తెలియదా?

అలాంటి చంద్రబాబు... మాటకు కట్టుబడే... మనుషులకు అత్యంత విలువిచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సైతం తన రక్తపు చేతులు అంటించే ప్రయత్నం చేస్తున్నారు. వివేకా హత్యకేసుకు సంబంధించి 'జగనాసుర రక్త చరిత్ర' అంటూ తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన పుస్తకం ఈ కోవలోనిదే!!. మొదటి నుంచీ సీబీఐ దర్యాప్తు ఎలా సాగాలో తన రాతలతో చెబుతున్న ఎల్లో మీడియా... షరా మామూలుగా ఈ టీడీపీ కరపత్రాన్ని కూడా పతాక శీర్షికల్లో అచ్చేసింది. కానీ ఈ కేసులో చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలానే ఉన్నాయి. మరి ఆయన గానీ... ఆయన తరపున రామోజీరావు గానీ వాటికి సమాధానం చెబుతారా?

- వివేకా పీఏ కృష్ణారెడ్డికి అక్కడో లేఖ దొరికింది. డ్రైవర్ తనను తీవ్రంగా కొట్టాడంటూ వివేకా రాసిన లేఖను, ఆయన ఫోన్‌ను... కృష్ణారెడ్డి ఎవ్వరికీ ఇవ్వ లేదు. వివేక కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర రెడ్డి ఆదేశాలతోనే లేఖను దాచిపెట్టారు. ముందే లేఖ ఇస్తే అది సహజ మరణం కాదని తెలిసి ఎవ్వరూ మృత దేహాన్ని తాకేవారే కాదు. ఆ లేఖ తన తండ్రి రాసిందేనని సాక్షాత్తూ డీఐజీకి సునీత చెప్పారు. ఆ లేఖను ముందే ఇవ్వకపోవటంపై గానీ... వాట్సాప్ మెసేజీలతో సహా ఫోన్లో సగం డేటాను డిలీట్ చేయటంపై గానీ ఎందుకు ప్రశ్నించటం లేదు? ఆ లేఖను దాచిపెట్టిన కృష్ణారెడ్డిని సిట్ అరెస్ట్ చేసింది. కానీ ఆ లేఖ దాచిపెట్టమన్న వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదు?
- వైఎస్ వివేకాను గొడ్డలితో నరికి హత్య చేశానని నిందితుడు దస్తగిరి అంగీకరించాడు. కానీ తనను ఈ కేసులో అప్రూవర్‌గా చేసుకుని... తనచేత వేరేవాళ్ల పేర్లు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారెందుకు? దస్తగిరి బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించకపోవడమేంటి? హత్య చేసిన వ్యక్తి జైల్లో కాకుండా... దర్జాగా బయట తిరుగుతున్నాడెందుకు?

బాబూ.. జవాబుందా?

- అవినాశ్ ఫోన్ కాల్స్‌పై ఎందుకీ అభూత కల్పనలు?
- అర్ధరాత్రి ఫోన్ చేసినట్లు రుజువులు చూపించగలరా?
- అప్పట్లో మీరే సీఎం... పోనీ కాల్ డేటా బయటపెట్టండి?
- సీబీఐ సైతం చెప్పని అంశాలతో ఎందుకీ రాజకీయ దిగజారుడు?
- ఆ రోజు చంద్రబాబు– ఏబీ వెంకటేశ్వరరావు మధ్య ఏం జరిగింది?
- స్థానిక పోలీసులతో నిరంతరం టచ్‌లో ఉంటూ ఏబీ చేసిందేంటి?
- వివేకాకు ఎమ్మెల్సీగా జగన్ అవకాశమిస్తే కుట్రపన్ని ఓడించింది టీడీపీయే
- స్థానిక నేతల్ని ప్రలోభపెట్టి వివేకాపై గెలిచింది బీటెక్ రవి
- అలాంటి బీటెక్ రవితో హత్య జరిగినప్పటి నుంచీ వివేకా కుమార్తె, అల్లుడికి సాన్నిహిత్యం
- నరికి చంపింది నేనే... అని చెప్పిన నిందితుడు దస్తగిరి దర్జాగా బయట
- అప్రూవర్‌గా మార్చుకుని, వేరే వాళ్ల పేర్లు చెప్పించేందుకు సీబీఐ ప్రయత్నం
- వివేకా ఫోన్లో కావాల్సిన సమాచారాన్ని డిలీట్ చేసి... కొంతే ఉంచిన తీరు
- మరణించే ముందు లేఖ రాసిన వివేకా... దాన్ని ధ్రువీకరించిన సునీత
- తామొచ్చే వరకూ ఆ లేఖను ఎవరికీ ఇవ్వవద్దని పీఏ కృష్ణారెడ్డికి చెప్పిన సునీత
- ఈ విషయాన్ని ఆమె డీఐజీకి చెప్పినట్లు స్వయంగా వెల్లడించిన ఎస్పీ
- ఈ కోణాలన్నీ వదిలి... ముఖ్యమంత్రిని అప్రదిష్ట పాలు చేసేందుకు బాబు కుట్ర

ఈ కేసులో దర్యాప్తును మొదటి నుంచీ నడిపిస్తున్నది ఎల్లో మీడియానే. పోలీసులు, సీబీఐ ఏం చేయాలో కూడా ఎల్లో మీడియానే చెబుతోంది. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉంది కాబట్టి... వివేకా అనుచరులే డబ్బు లావాదేవీల్లో భాగంగా ఆయన్ను హతమార్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేసింది 'ఈనాడు'. ఇప్పుడు చంద్రబాబు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి ప్లేటు ఫిరాయించింది. బాబుకు లబ్ధి కలిగేలా ఎంపీ అవినాశ్‌ను టార్గెట్ చేస్తూ కథనాలు వండి వారుస్తోంది. వీరి వల్ల ఈ కేసులో దర్యాప్తు ఎలా పక్కదోవ పడుతోందో వివరించే కొన్ని అంశాలివిగో...

ఏది నిజం?

హత్య జరిగిన రోజు నిరంతరం స్థానిక పోలీసులతో నాటి ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఏం మాట్లాడారు? నిమిష నిమిషానికీ చంద్రబాబుతో ఏం చెప్పారు? ఈ కోణంలో చంద్రబాబును విచారించ లేదెందుకు?

1 ? అవినాశ్ రెడ్డికి వివేకా మృతి గురించి తెలిసిందెప్పుడు? ఉదయం 6.30 ప్రాంతంలో... అది కూడా వివేకానందరెడ్డి బావమరిది శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెబితేనే!!. దీంతో జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికి వెళుతూ అవినాశ్ తిరిగి వెనక్కొచ్చారు. అప్పటికే అక్కడ జనం పోగయి ఉన్నారు. వచ్చాక విషయం తెలుసుకుని ఆయన తొలుత సీఐ శంకరయ్యకి, తరవాత కొందరు బంధువులకు ఫోన్లు చేశారు. ఏ ఫోన్ అయినా 6.30 తరవాతే. కానీ అర్ధరాత్రే ఫోన్ చేసినట్లు నిరాధార ఆరోపణలెందుకు చేస్తున్నారు? జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి... మార్చి 10నే ఎన్నికల షెడ్యూలు రావటంతో హత్యకు ముందురోజు రాత్రి కూడా (మార్చి 15) ఎంపీ అవినాశ్ కోసం ప్రచారం చేశారు కదా? ఇందులో అవినాశ్–వివేకా మధ్య రాజకీయ వైరుధ్యాలకు అవకాశమెక్కడుంది? మృతి గురించి శివప్రకాశ్‌రెడ్డే తనకూ చెప్పారన్నది జమ్మలమడుగు టీడీపీ నేత ఆదినారాయణ రెడ్డి మాట. గుండెపోటుతో మృతి చెందారని, సిగరెట్లు ఎక్కువ తాగటం వల్ల కావచ్చునని చెప్పినట్లు ఆదినారాయణ రెడ్డి వెల్లడించారు. మరి అందరికీ శివప్రకాశ్ రెడ్డే చెప్పినపుడు అవినాశ్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నట్టు?

2 ? అవినాశ్‌రెడ్డి వెళ్లేసరికే అక్కడ వివేకా పీఏ కృష్ణారెడ్డితో సహా అంతా ఉన్నారు. రక్తపు మరకలతో ఉన్న లేఖ కూడా కృష్ణారెడ్డి దగ్గరుంది. లేఖ, వివేకా ఫోన్ గురించి ఆయన కుమార్తె సునీతకు కృష్ణా రెడ్డి చెప్పారు. వాటిని వెంటనే పోలీసులకు ఇవ్వాలని చెప్పాల్సిన సునీత... తాము వచ్చేవరకూ ఎవరికీ ఇవ్వవద్దని ఎందుకు చెప్పారు? లేఖలో డ్రైవర్ తనను కొట్టాడని వివేకా స్వయంగా రాసిన విషయాన్ని ముందే బహిర్గతం చేస్తే ఎవ్వరూ మృతదేహం వద్దకు వెళ్లి ఉండే వారు కాదుగా? ఆ లేఖ తన తండ్రి రాసిందేనని సునీత కూడా సాక్షాత్తూ డీఐజీ దగ్గర ధ్రువీకరించారు. మరి ఆ లేఖలోని కోణాన్ని ఎందుకు విచారించటం లేదు? పైపెచ్చు ఫోన్లోని డేటా కూడా ఎడిటెడ్ వర్షన్ మాదిరిగా కొంత డిలీట్ అయి ఉంది. దీన్నెందుకు సీబీఐ ప్రశ్నించటం లేదు?

3 ? నవీన్ అనే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంట్లో అటెండర్. ఇంట్లో ఎవరైనా ఫోన్ తీయనప్పుడు ఆ ఇంట్లో ఉండే డ్రైవర్‌కో, అటెండర్‌కో ఫోన్‌చేసి... మెసేజీ చెప్పమనటం ఎవరైనా చేసేదే. అవినాశ్‌రెడ్డి ఓఎస్‌డీకి ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు. దీంతో నవీన్‌కు ఫోన్ చేసి మెసేజీ సమాచారం అందించమనటాన్ని సీబీఐ ఎందుకు భూతద్దంలో చూపిస్తోంది? టీడీపీ ఎందుకు దీన్ని రాజకీయం చేస్తోంది? ఉద్దేశాలు స్పష్టం కావటం లేదా?

4 ? వైఎస్ వివేకా కుమార్తెకు, ఆయన రెండో భార్యకు మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. వాళ్లిద్దరి మధ్య ఫోన్లో నడిచిన దారుణమైన మెసేజీలే ఇందుకు సాక్ష్యం. మరి వాటిని పూర్తిగా బయటపెట్టకుండా ఫోన్లో కొన్ని ఉంచి–కొన్ని సందేశాలను మాత్రమే ఎందుకు డిలీట్ చేశారు? ఆ విషయంపై ఎందుకు సీబీఐ ప్రశ్నించటం లేదు? వివేకానందరెడ్డికి ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరి అత్యంత సన్నిహితులు కదా? వీరికి వివేకా అల్లుడితోనూ అత్యంత సన్నిహిత సంబంధాలున్నపుడు వాళ్లనెందుకు అనుమానించడం లేదు? వాళ్లలో ఒకరిని అప్రూవర్‌గా చేసుకుని తనచేత కావాల్సిన వాళ్ల పేర్లు చెప్పించటం ఎంత దుర్మార్గం? దర్యాప్తు ఎంత పక్షపాతంతో వెళుతోందో చెప్పటానికి ఇది చాలదా?

5 ? బీటెక్ రవితో వివేకా అల్లుడు కమ్ బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఎందుకంత సాన్నిహిత్యం? కడప జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డిని కుట్రపూరితంగా ఓడించింది చంద్రబాబే కదా!. వైఎస్సార్ మరణానంతరం భార్య, కుమార్తె ఒత్తిడితో వివేకానందరెడ్డి మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలోనే ఉండిపోయారు. వైఎస్ విజయమ్మపై పులివెందులలో పోటీ చేశారు కూడా. అయినా సరే అనంతర పరిణామాల్లో పార్టీలోకి వస్తానంటే గౌరవాభిమానాలతో చిన్నాన్నకు స్వాగతం పలికారు వైఎస్ జగన్. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. అక్కడ గెలిచే బలం వైఎస్సార్‌సీపీకే ఉంది. కానీ నాటి సీఎం చంద్రబాబు వైఎస్సార్ సీపీ ఎమ్పీటీసీ, జెడ్పీటీసీలను ప్రలోభానికి గురి చేసి వివేకాను ఓడించారు. బీటెక్ రవిని గెలిపించారు. మరి అలాంటి రవితో సునీత, నర్రెడ్డి నిరంతరం టచ్‌లో ఉండటాన్ని ఏమనుకోవాలి? బాబును ప్రశ్నించరెందుకు?

6 ? హత్య జరిగిన రోజున నిమిష నిమిషానికీ చంద్రబాబుకు సమాచారం చేరవేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు పది నిమిషాల వ్యవధిలో రెండుసార్లు చంద్రబాబుకు ఫోన్లు చేసి పరిస్థితిని వివరించాల్సిన అవసరం ఏమొచ్చింది? మరి చంద్రబాబును ఎందుకు విచారించకూడదు? బాబు కాల్ రికార్డులు, ఏబీవీ కాల్ రికార్డులు పరిశీలించి దర్యాప్తు చేయాలి కదా? చంద్రబాబు నాయుడు కుట్ర పన్ని... ఒక పద్ధతి ప్రకారం ఇదంతా చేయించారని స్పష్టం కావటం లేదా? మరి వాళ్లనెందుకు విచారించటం లేదు?

7 ? ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్ పై సందిగ్ధత ఉందనే అభూత కల్పనలతో... ప్రజలను పక్కదారి పట్టించేందుకు టీడీపీ నానా పాట్లూ పడుతోంది. కానీ వాస్తవం ఏమిటన్నదీ అందరికీ తెలుసు. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందే ఖరారు చేశారు. కడప లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా అవినాశ్‌ను, జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా వైఎస్ వివేకానంద రెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకా అప్పటికే ప్రచారం ప్రారంభించారు. వివేకాందరెడ్డి హత్య తరువాత ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలో కూడా చెప్పారు. ఎంపీ టికెట్‌పై ఇంత స్పష్టత ఉన్న తరువాత కూడా అదేదో ఎంపీ టికెట్ కోసం వైఎస్ కుటుంబంలో పోటీ నెలకొందని అవాస్తవాలను టీడీపీ ప్రచారం చేస్తుండటాన్ని ఏమనుకోవాలి?

8 ? ఈ కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబడుతూ కోర్టులో ఓ పిటిషన్ వేశారు. వివేకాను ఎవరు హత్య చేసి ఉంటారో సహేతుక ఆధారాలతో ఆమె నివేదించారు. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు... రెండో భార్య కుమారుడికి ఆస్తిలో వాటా ఇస్తానని ఆయన చెప్పడంతో మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత విభేదించడాన్ని బయటపెట్టారు. అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివప్రకాశ్ రెడ్డి పాల్పడిన కుట్రలనూ వివరించారు. పులివెందులలో రాజకీయ ఆధిపత్యంపై కన్నేసిన టీడీపీ నేత బీటెక్ రవి అందుకు అడ్డుగా ఉన్న వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకోవడాన్ని బయటపెట్టారు. వివేకాపై ఆర్థిక విభేదాలతో అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి... రాజకీయ విభేదాలతో తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి ఎలా కక్ష పెంచుకున్నారో వివరించారు. వీరందరి పాత్రపై దర్యాప్తు జరపాలని కోరారు. కానీ ఎల్లో మీడియా పర్యవేక్షణలో సాగుతున్న సీబీఐ దర్యాప్తు ఈ కీలకాంశాల దిశగా మాత్రం సాగటమే లేదు!!.



చంద్రబాబూ నిరాధార ఆరోపణలు కట్టిపెట్టు... ఇవిగో నిజాలు...

అవాస్తవ ఆరోపణలతో టీడీపీ విడుదల చేసిన పుస్తకం పూర్తిగా కట్టుకథల పుట్టని ఇట్టే తేలిపోయింది. ఆ పుస్తకంలో టీడీపీ చేసిన నిరాధార ఆరోపణలకు సమాధానాలు ఇవిగో...

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును విచారిస్తోంది సీబీఐనా...!? చంద్రబాబా..!?

వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన రాత్రి 3గంటలకు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వైఎస్ భారతి పీఏ నవీన్‌కు ఎందుకు ఫోన్ చేశారని టీడీపీ ఓ అవాస్తవ విషయాన్ని ప్రచారంలోకి తేవడం విడ్డూరంగా ఉంది. అసలు ఆ రోజు రాత్రి 3గంటలకు ఎంపీ అవినాశ్ రెడ్డి నవీన్‌కు ఫోన్ చేశారని ఎవరు చెప్పారు చంద్రబాబూ...? ఎంపీ అవినాశ్ రెడ్డి కాల్ డేటా మీ దగ్గర ఉందా... ఉంటే మీ పుస్తకంలో ఎందుకు ప్రచురించలేదు? ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన అర్ధ రాత్రి 3గంటల సమయంలో వైఎస్ అవినాశ్‌రెడ్డి ఎవరికీ ఫోన్ చేయనే లేదు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకు గురైనప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది టీడీపీ ప్రభుత్వం. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, అప్పటి రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావే ఈ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించారు. మరి అప్పుడు ఏబీ వెంకటేశ్వరరావు ఆ కేసు రికార్డులన్నీ కూడా కరకట్ట మీదున్న చంద్రబాబు నివాసానికి తరలించారా...?ఈ కేసులో టీడీపీ నేతల పాత్రను కప్పిపుచ్చేందుకే అలా చేశారా?

మతి భ్రమించిందా చంద్రబాబూ...!

అధికారం కోల్పోవడంతో చంద్రబాబుకు మతిభ్రమించినట్టు ఉంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి ముందు రోజు రాత్రే తెలిసినా వైఎస్ జగన్ పులివెందులకు సాయంత్రం వరకు ఎందుకు వెళ్లలేదంటూ టీడీపీ ప్రశ్నించడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. 2019 మార్చి 15 ఉదయం 6.10గంటలు అయినా సరే వివేకానందరెడ్డి నిద్ర లేవకపోవడంతో పీఏ కృష్ణారెడ్డి చాలాసేపు బయటే వేచి ఉన్నారు. ఆ తరువాత వాచ్‌మ్యాన్ రంగన్న, వంటమనిషి కుమారుడు ప్రకాశ్‌లతో కలసి వెనక ద్వారం నుంచి వెళ్లి చూడగా బాత్రూమ్‌లో వివేకానందరెడ్డి మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. ఆ వెంటనే హైదరాబాద్‌లో ఉన్న వివేకానందరెడ్డి భార్య, కుమార్తె, అల్లుడికి సమాచారం అందించారు. వారు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో పులివెందుల వచ్చే సరికి మధ్యాహ్నం 1గంట అయ్యింది. హైదరాబాద్‌లో ఉన్న అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన భద్రతా సిబ్బంది అనుమతించిన తరువాత రోడ్డు మార్గంలో బయలుదేరి సాయంత్రంలోపు పులివెందుల చేరుకున్నారు. కానీ ఈ అంశానికి కూడా మసిపూసి మారేడు కాయ చేయాలని చూడటం చంద్రబాబు రాజకీయ నైచ్యమే..

సీబీఐ అధికారులపై కేసు పేరిట మరో అబద్ధం

అంతఃపుర ఆదేశాలతోనే అంటే ముఖ్యమంత్రి నివాసం నుంచి వచ్చిన ఆదేశాలతోనే సీబీఐ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేశారని టీడీపీ మరో నిరాధారణ ఆరోపణ చేసింది. సీబీఐ అధికారులపై పోలీసులు తమకు తాముగా కేసు నమోదు చేయలేదు. ఉదయ్‌కుమార్ అనే వ్యక్తిని సీబీఐ అధికారులు విచారణ పేరిట పదే పదే పిలిచి తీవ్రంగా కొడుతుండడంతో ఫిర్యాదుచేసినా పోలీసులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీబీఐ అధికారులను ఒక్క రోజు కూడా విచారణకు పిలవనే లేదు. సీబీఐ అధికారులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ కేసులో స్టే మంజూరైంది. ఇక ఈ కేసు విషయంలో ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం ఎక్కడ ఉంది?..

సీబీఐ విచారణకు సహకరిస్తున్న ప్రభుత్వం

ప్రతిపక్ష నేతగా సీబీఐ విచారణ కోరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను సీఎం అయ్యాక ఎందుకు వద్దనుకున్నారని టీడీపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఆనాడు చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం లేకే వైఎస్ జగన్ సీబీఐ విచారణను కోరారు. తాను ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వాధినేతగా తమ పోలీసు శాఖపై ముఖ్యమంత్రి నమ్మకం ఉంచారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చి కేసు దర్యాప్తును వేగవంతం చేశారు.దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చాక రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా పూర్తి సహకారం అందిస్తోంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో సీబీఐని నిషేధించారు.అలాంటి చంద్రబాబు అధికారం కోల్పోగానే మళ్లీ సీబీఐపై నమ్మకం ప్రదర్శిస్తుండటం రాజకీయ అవకాశవాదమే. వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు సీబీఐ చేపట్టకూడదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించి ఉంటే ఆయన కూడా సీబీఐకి రాష్ట్రంలో నిషేధించి ఉండేవారు కదా. ఆయన అలా చేయలేదు. అంటే వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేసినా తనకు అభ్యంతరంలేదని చెప్పినట్టే కదా.

ఎంపీ టికెట్ అవినాశ్‌కే ఖరారు చేశారు బాబూ

వైఎస్ అవినాశ్ రెడ్డి ఎంపీ టికెట్ కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయించినట్టు సీబీఐ సందేహం వ్యక్తం చేస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిందని ఆరోపించడం టీడీపీ కుతంత్రాలకు పరాకాష్ట. సీబీఐ అఫిడవిట్ మీరు చూశారా చంద్రబాబు..! అసలు 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే ఖరారు చేశారు. కడప లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అప్పటికే ప్రచారం ప్రారంభించారు కూడా. వివేకాందరెడ్డి హత్య తరువాత కూడా ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలో చెప్పారు కూడా.

చార్జ్‌షీట్‌కు సీబీఐ 17 నెలల సమయం ఎందుకు తీసుకుంది?

ఈ కేసులో ఏ–1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ ఎందుకు వచ్చింది... పోలీసులు ఆయనపై చార్జ్‌షీట్ ఎందుకు వేయలేదని టీడీపీ సంధించిన ప్రశ్న హాస్యాస్పదంగా ఉంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైనప్పటి నుంచి 75రోజులపాటు చంద్రబాబే అధికారంలో ఉన్నారు. మరి అప్పుడు ఎందుకు చార్జ్‌షీట్‌వేయలేదు? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. నిందితులను గుజరాత్‌లోని నార్కో అనాలిసిస్ ల్యాబరేటరీకి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించింది. కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతుండగానే న్యాయస్థానం ఆదేశాలతో ఈ కేసు దర్యాప్తును 2020, జూలై 9న సీబీఐకి అప్పగించింది. సీబీఐ 2021, అక్టోబరు 26న తొలి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తొలి చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సీబీఐ 17 నెలల సమయం తీసుకుంది. చార్జ్‌షీట్ దాఖలకు 17 నెలల సమయం తీసుకున్న సీబీఐనిగానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీనిగానీ టీడీపీ ఎందుకు ప్రశ్నించడం లేదు?

వ్యక్తిగత కారణాలతోనే డిప్యుటేషన్‌పై వెళ్లిన అభిషేక్ మహంతి

చంద్రబాబు గాలిపోగేసి చేసిన మరో ఆరోపణ... ఈ కేసులో గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిని అప్పటి కడప ఎస్పీ అభిషేక్ మహంతి విచారణకు తీసుకువెళ్తుంటే హఠాత్తుగా నవీన్ నుంచి ఫోన్ వచ్చింది...దాంతో ఆయన్ని విచారించకుండా విడిచిపెట్టారని అవాస్తవ ఆరోపణలు చేశారు. పైగా అభిషేక్ మహంతి సుదీర్ఘ సెలవుపై ఎందుకు వెళ్లారని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఏమయ్యా చంద్రబాబూ... ఎస్పీ అభిషేక్ మహంతికి నవీన్ నుంచి ఫోన్ రావడం నువ్వు చూశావా...? పోనీ ఆయన కాల్ డేటా నీ దగ్గర ఉందా? ఇక అభిషేక్ మహంతి తన కుటుంబపరమైన కారణాలతోనే ఆయన తెలంగాణకు డిప్యుటేషన్ కోరుకునివెళ్లారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదన్నది రెండు రాష్ట్రాల్లోని పోలీసు శాఖలకు తెలుసు.

ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ అంశంపై టీడీపీ అసత్య ఆరోపణలు చేసింది. ఎర్రగంగిరెడ్డి వైఎస్ వివేకానందరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు అత్యంత సన్నిహితుడు. ఎర్ర గంగిరెడ్డి జైలులో ఉన్నప్పుడు కూడా వివేకానంద రెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తరచూ ఆయన్ని కలిసేవారు. ఎర్ర గంగిరెడ్డికి న్యాయవాదులను కూడా సునీతే ఏర్పాటు చేశారు. ఆయనకు బెయిల్ రావాలని సునీత, ఆమె భర్త ఎన్.రాజశేఖరరెడ్డి కోరుకున్నారు. తీరా ఇప్పుడు ఆయనకు బెయిల్ రావడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హస్తముందని టీడీపీ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది.

రెండేళ్ల ఐదు నెలలు సస్పెన్షన్‌లోనే సీఐ శంకరయ్య

సీఐ శంకరయ్య వాంగ్మూలం ఇచ్చి వెనక్కితగ్గారని ... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసిందని టీడీపీ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడాన్ని శంకరయ్య తప్పుబట్టారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన మర్నాడే శంకరయ్య సస్పెండ్ అయ్యారు. 2019 మేలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత కూడా రెండేళ్ల ఐదు నెలలపాటు శంకరయ్య సస్పెన్షన్‌లోనే ఉన్నారు. కుటుంబ పోషణ కోసం తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శంకరయ్యపై అభియోగాలు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగానే ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చారు. ఆయనకు ఏమీ ప్రాధాన్యమున్న పోస్టింగ్ ఇవ్వ లేదు. దాంతో కేసు దర్యాప్తు ప్రభావితమయ్యేది ఏముంది? టీడీపీ తప్పుబట్టాల్సింది ఏముంది...?

తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని గంగాధర్‌రెడ్డిపై టీడీపీ నేతల ఒత్తిడి

వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు కె.శ్రీనివాసరెడ్డి, గంగాధర్ రెడ్డి అనుమానాస్పదంగా మృతిచెందారంటూ వక్రీకరిస్తూ టీడీపీ ఆరోపణలు చేయడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఈ కేసులో కె.శ్రీనివాసరెడ్డి అసలు సాక్షి కాదు. ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టడానికి ముందే శ్రీనివాసరెడ్డి మృతి చెందారు. ఆయన సోదరుడు పరమేశ్వరరెడ్డి ఈ కేసులో అనుమానితుడు. అతను టీడీపీ నేత బీటెక్ రవికి సన్నిహితుడు కూడా. వివేకానందరెడ్డి హత్యకు ముందు పరమేశ్వరరెడ్డి తనకు ఎలాంటి అనారోగ్యం లేనప్పటికీ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో ఉన్న అతను బయటకు వచ్చి టీడీపీ నేత బీటెక్ రవితో సమావేశమయ్యారు. వివేకానందరెడ్డి ఉన్నంతవరకు తాను పులివెందులలో పట్టు సాధించలేనని బీటెక్ రవికి తెలుసు. తాను ఎంపీగా గెలవలేనని ఆదినారాయణ రెడ్డికి తెలుసు. ఇక పరమేశ్వరెడ్డికి వివేకానందరెడ్డితో ఆర్థిక వివాదాలు ఉన్నాయి. అందుకు బీ.టెక్ రవి, ఆదినారాయణరెడ్డి, పరమేశ్వరరెడ్డి కలసి వివేకానందరెడ్డి హత్యకు కుట్రపన్ని ఉండొచ్చని వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి చెబుతోంది. ఈ విషయాలన్నీ శ్రీనివాసరెడ్డికి తెలుసు. అతను జీవించి ఉంటే బీ.టెక్ రవి, ఆదినారాయణ రెడ్డిలకే ముప్పు. అందుకే అతన్ని అంతం చేసే అవకాశం వారికే ఉంది. ఇప్పటికైనా సీబీఐ వారిని విచారించాలి. అలానే గంగాధర్ రెడ్డి మృతి విషయంలోనూ టీడీపీ అసత్య ఆరోపణలతో కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని వైఎస్ సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, టీడీపీ నేతలు బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి, సీబీఐ అధికారులు తనను వేధిస్తున్నారని గంగాధర్ రెడ్డి ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదుచేశారు కూడా. ఆ తరువాత అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందారు. గంగాధర్‌రెడ్డి వైఎస్ అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నారు. ఆయన వాంగ్మూలం టీడీపీ నేతలకు వ్యతిరేకంగా ఉంది. మరి ఆయన అనుమానాస్పదంగా మృతిచెందితే...అందుకు టీడీపీ నేతలనే శంకించాల్సి ఉంటుంది కదా.

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,702 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,482 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.43 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

'కమ్యూనిటీ పోలీసింగ్' విజేత చింతపల్లి ఏఎస్పీ



చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆలిండియా ప్రధాన మంత్రి సిల్వర్ కప్ వ్యాస రచన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచారు చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్. హైదరాబాద్ సర్దార్ వల్లభాయ్ నేషనల్ అకాడమీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా చేతుల మీదుగా కప్‌ను శనివారం స్వీకరించారు. గతేడాది నిర్వహించిన పోటీల్లో 'కమ్యూనిటీ పోలీసింగ్'పై ఆయన సమర్పించిన వ్యాసం ప్రథమ బహుమతికి ఎంపికైంది.

రైతుకు మేలు చేసే స్మార్ట్ ఆవిష్కరణలు రావాలి

- అగ్రిథాన్– 2023 సదస్సులో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు(తిరుపతి జిల్లా): రైతన్నలకు మేలుచేసే స్మార్ట్ ఆవిష్కరణలు తయారు చేయాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో నవ విష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద గెయిన్ సంస్థ సహకారంతో అగ్రిథాన్-2023 కార్యక్రమం ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 116 మంది విద్యార్థులు, ఔత్సాహికులు హాజరయ్యారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి నూతన ఆవిష్కరణలు తయారు చేయనున్నారు. ఈ సదస్సులో డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి.. వారికి ఉపయోగపడే సాంకేతిక పరికరాలను ఆవిష్కరించాలని సూచించారు. పొజిషనింగ్, ప్రెసిషన్ టెక్నాలజీ అందిపుచ్చుకుని వ్యవసాయ రంగంలో సమస్యలపై మరింత లోతుగా వెళ్లి శోధించి పరిష్కరించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ద గెయిన్ సీఈవో వరదరాజన్ కృష్ణన్, ఐఐటీ టీఎన్ఐఎఫ్ (ఐఐటీ తిరుపతి నవ విష్కార్ ఐ హబ్ ఫౌండేషన్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవత్సవ్, హబ్ సీఈవో బండా శ్రీనివాసమూర్తి, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీగిరి ఆలయంలో ఆగమశాస్త్రానుసారం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు బ్రహ్మోత్సవాలకు నాయకత్వం వహించే చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి బ్రహ్మోత్సవ క్రతువుకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం ధ్వజారోహణ, భేరిపూజ కార్యక్రమాలు నిర్వహించి ధ్వజాపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వార్లు భృంగివాహన సేవ ఉంటుంది.

జ్యోతిర్ముడి భక్తులకు 15 వరకే స్పర్శదర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివమాల ధరించి జ్యోతిర్ముడితో వచ్చిన వారికి మాత్రమే ఈ నెల 15 వరకు మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు దేవస్థాన ఈవో ఎస్.లవన్న తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భక్తులందరికీ మల్లికార్జున స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

వెంకన్న సేవలో 'గిరి' ఉత్పత్తులు

- జీసీసీ తేనెకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఏడుకొండల వాడు
- ఇప్పటి వరకూ 5 టన్నుల స్వచ్ఛమైన తేనె సరఫరా
- 4 టన్నుల సేంద్రియ పసుపు అందజేత



ఏడుకొండల వెంకన్నకు జరిగే కైంకర్యంలో అభిషేకానికి చాలా ప్రాధాన్యముంది. అందుకే శ్రీవారిని అభిషేక ప్రియుడిగా పిలుస్తారు. స్వచ్ఛమైన, సేంద్రియమైన ఉత్పత్తులతోనే నిత్యాభిషేకాలు నిర్వహిస్తారు. ఆ అభిషేకాల్లో గిరి పుత్రులు సేకరించిన తేనె కూడా చేరింది. జీసీసీ తేనెకు బ్రాండ్ అంబాసిడర్‌గా తిరుమల వేంకటేశ్వరుడు నిలిచాడు. స్వామివారికి అభిషేకాల్లో జీసీసీ (గిరిజన సహకార సంస్థ) తేనె.. ముస్తాబుకు జీసీసీ పసుపును వినియోగిస్తున్నారు. తిరుమలలో విగ్రహాలు, సామగ్రి పరిశుభ్రతకు కూడా జీసీసీ ఉత్పత్తులని టీటీడీ వినియోగిస్తుండటం విశేషం.

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని అడవుల నుంచి గిరిజనులు సేకరించే ఉత్పత్తులు శ్రీనివాసుడి కైంకర్యానికి వినియోగిస్తున్నారు. తిరుమలేశుణ్ణి అభిషేకించేందుకు గిరిజన తేనెని టీటీడీ వినియోగిస్తోంది. జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి పలుమార్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో సంప్రదింపులు జరిపారు. స్వామివారికి అభిషేకం నిర్వహించేందుకు జీసీసీ తేనెని వినియోగించాలని కోరడంతో టీటీడీ ల్యాబ్‌లలో నాణ్యత పరీక్షలు నిర్వహించారు. నాణ్యత అద్భుతంగా ఉండటంతో.. అభిషేకానికి జీసీసీ తేనెని ఉపయోగిస్తామని టీటీడీ ప్రకటించింది. దీంతో గతేడాది నుంచి తిరుమలేశుడికి గిరిజన తేనెతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తొలివిడతగా 900 కిలోల తేనెను పంపించారు. అప్పటి నుంచి గిరి తేనెని అభిషేక ప్రియుడికి వినియోగిస్తున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 5,000 కిలోల తేనెని జీసీసీ టీటీడీకి విక్రయించింది.

పసుపుతో ముస్తాబవుతున్న దేవదేవుడు

శ్రీనివాసుడి అందానికి, అభిషేకానికి కూడా జీసీసీ పసుపునే వినియోగిస్తున్నారు. శ్రీవారి నిత్యకైంకర్యాలకు, నైవేద్యానికి వాడే పసుపుని కూడా జీసీసీ నుంచి కొనుగోలు చేస్తోంది. విశాఖ ఏజెన్సీలో గిరిజనుల నుంచి సేకరిస్తున్న పసుపు మంచి నాణ్యతతో ఉంటుంది. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న గిరిజన పసుపుని టీటీడీ ల్యాబ్‌లో నాణ్యతా పరీక్షలు నిర్వహించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటి వరకూ 4000 కిలోల సేంద్రియ పసుపును టీటీడీకి పంపించారు. మరో 20,000 కిలోల వరకూ సేంద్రియ పసుపు కోసం టీటీడీ టెండర్లు పిలిచింది. ఈ అవకాశం కూడా జీసీసీకి అందించాలని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి టీటీడీ అధికారులను కోరారు. త్వరలోనే టీటీడీ మార్కెటింగ్ విభాగం దీనికి కూడా గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది.

కాఫీ.. కుంకుడు పొడి కూడా..

వీలైనంత ఎక్కువగా గిరిజన ఉత్పత్తులను టీటీడీకి అందించేందుకు జీసీసీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే ఇన్‌స్టెంట్ కాఫీ పొడితో పాటు కుంకుడు పొడి కూడా కొనుగోలు చేస్తోంది. 3000 టన్నుల కుంకుడు పొడిని టీటీడీ కొనుగోలు చేసింది. ఈ పొడిని దేవస్థానంలో ఉన్న విగ్రహాలు, స్వామివారి నైవేద్యం తయారు చేసే పాత్రలు, పోటులో వినియోగించే పాత్రలను శుభ్రం చేసేందుకు ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా టీటీటీ అభివృద్ధి చేసిన ఇతర దేవాలయాలకు కూడా ఈ పొడిని పంపిణీ చేస్తున్నారు. 500 కిలోల ఇన్‌స్టెంట్ కాఫీ పొడి కావాలని టీటీడీ మార్కెటింగ్ విభాగం జీసీసీని సంప్రదించింది. 5, 10 కిలోల ప్యాకెట్ల రూపంలో ఇన్‌స్టెంట్ కాఫీని పంపించేందుకు జీసీసీ సమాయత్తమవుతోంది. మొత్తంగా గిరిజన ఉత్పత్తులు శ్రీవారి సన్నిధికి చేరుతుండటం జీసీసీ బ్రాండ్‌కు విశ్వఖ్యాతి లభించడంతో పాటు, గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూడా ఉపయోగపడుతోంది.

నాణ్యతలో నంబర్‌వన్



గిరిజనులు సేకరిస్తున్న అన్ని ఉత్పత్తులు నాణ్యతలో నంబర్‌వన్‌గా ఉన్నాయి. టీటీడీకి జీసీసీ ఉత్పత్తులు అందిస్తుండటం శుభపరిణామం. తిరుమలలో వినియోగిస్తుండటం వల్ల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. గిరిజనులకు మరింత మేలు కలుగుతోంది. తేనె, పసుపు, కుంకుడు పొడితో పాటు ఇన్‌స్టెంట్ కాఫీని కొనుగోలు చేస్తోంది. వీటితో పాటు దేవస్థానానికి అవసరమైన మరిన్ని ఉత్పత్తులు కొనుగోలు చేయాలని టీటీడీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

పేలిన బాయిలర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఏడుగురికి స్వల్ప గాయాలు
- శ్రీశైల మహాక్షేత్రంలోని అన్నదాన భవనంలో ఘటన

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలోని అన్నపూర్ణ భవనం వంటశాల వెనుకభాగంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్టీమ్ బాయిలర్ పేలింది. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా, ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో ఓ చిన్నారి కూడా ఉండటం గమనార్హం. గాయపడిన వారిని దేవస్థానం వైద్యశాలకు తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేశారు. విజయలక్ష్మి(55), లక్ష్మీబాయి(40)లను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే దేవస్థానం చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థానం ఈవో ఎస్.లవన్న ఆస్పత్రికి చేరుకొని గాయపడ్డ వారిని పరామర్శించారు. కాగా, బాయిలర్లలో ఎప్పటికప్పుడు స్టీమ్ ఎంత ఉంది? వాటర్ లెవెల్స్? ఇతరత్రా విషయాలను గమనించే సాంకేతిక నిపుణుడు శనివారం అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

పేదల ఎదుగుదలను ఓర్వలేని చంద్రబాబు

- 867వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాధికులుగా ఎదగడం ఓర్వలేకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను బాబు అండ్ కో అడ్డుకుంటూ తప్పుడు కేసులు వేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 867వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం విద్యకు ఖర్చు చేయని విధంగా ఏపీలో సీఎం జగన్ ప్రభుత్వం రూ.56 వేల కోట్లు ప్రభుత్వ పాఠశాలలకు ఖర్చుచేసి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. పేదలకు జాగా కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు రాష్ట్రంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలలో చేస్తున్న వసతులు చూసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న ఓ సామాజిక వర్గానికి గుండెల్లో దడ పుడుతుందన్నారు. అధికారమే పరమావధిగా చంద్రబాబు కనుసన్నల్లో ఆయన సుపుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు ప్యాకేజీపవన్ కళ్యాణ్ యాత్రలన్నీ అట్టర్ ఫ్లాప్ షోలుగా మిగిలిపోతాయని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

లాల్ నీల్ ఐక్యతే ఆయుధంగా ఉద్యమించాలి

- అరసం 19వ రాష్ట్ర మహాసభలో డాక్టర్ కత్తి పద్మారావు



మాట్లాడుతున్న డాక్టర్ కత్తి పద్మారావు. వేదికపై చంద్రశేఖరరెడ్డి, సుఖదేవ్‌సింగ్ సిర్సా తదితరులు

తెనాలి: హిందూ సామ్రాజ్యవాదం, కార్పొరేట్ శక్తులు కలిసి సాగుతున్న రోజుల్లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని సుప్రసిద్ధ అభ్యుదయ కవి, సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు అభిప్రాయపడ్డారు. సామాజిక భావనలను, లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ, మనుస్మృతిని పునస్థాపితం చేస్తున్న దశలో ఆ శక్తులకు వ్యతిరేకంగా లాల్ నీల్ ఐక్యత ఆయుధంగా ఉద్యమించాలని కోరారు. ప్రతి ఒకరిని సభ్యులుగా చేసుకుని, అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించాలని, సెక్యులర్ సమాజం సృష్టికి కలంధారులై గళం విప్పాలని పిలుపునిచ్చారు. అరసం 19వ రాష్ట్ర మహాసభలు, 80వ వార్షికోత్సవాలు ఆ సంస్థ ఆవిర్భవించిన గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోకత్తి పద్మారావు మాట్లాడుతూ కారల్ మార్క్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు జ్యోతిబా పూలేను కూడా ఆదర్శంగా తీసుకుని అభ్యుదయ, విప్లవ, సామాజిక మహోజ్వల విప్లవంగా అరసం ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖదేవ్‌సింగ్ సిర్సా మాట్లాడుతూ అభ్యుదయం గురించి ఎలుగెత్తిన గొంతులను అర్బన్ నక్సలైట్ పేరుతో నొక్కివేసే ప్రయత్నం దేశంలో జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా తన ప్రసంగంలో యువతరం రచనలను అరసం ప్రచురిస్తుందన్న భరోసానివ్వాలని కోరారు. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పాలకులు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ, జాతీయ కార్యదర్శి వినీత్ తివారి, ఏపీ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు పి.చంద్రానాయక్, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తదితరులున్నారు.

ఇసుక నేలల్లో సిరుల పంట

తీరం రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం

- ఉచిత విద్యుత్‌తో పంటల సాగుకు భరోసా
- ఏడాదికి మూడు పంటలు
- విస్తృతంగా వేరుశనగ, మిర్చి, కూరగాయల సాగు
- గతంలో ఎకరం రూ.30 వేలు
- నేడు రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్లు పైనే




సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం తిమ్మారెడ్డిపాలెంకు చెందిన కౌలు రైతు అట్ల రవిశంకర్‌రెడ్డి 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. రెండు రోజులకొకమారు పంటను నీటితో తడపాలి. మోటార్‌తో రోజంతా శ్రమిస్తే కానీ పంటను తడపడం వీలు కాదు. ఎంత విద్యుత్ ఖర్చు అవుతుందో తెలీదు. అంత మేర చార్జీలు చెల్లించి ఇలాంటి ఇసుక నేలల్లో వ్యవసాయం చేయాలంటే మామూలు విషయం కాదు. అయితే ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్లే చక్కగా పంటలు పండించుకుంటున్నామని, ఇదంతా దివంగత వైఎస్, ఆయన తనయుడు సీఎం జగనన్న చలువేనని ఆనందంగా చెబుతున్నాడు. ఇదే మండలంలోని బోలాయపాలెంకు చెందిన నల్లమోలు సూరిబాబుకు ప్రధాన రహదారి పక్కనే 6 ఎకరాల పొలం ఉంది. గతంలో ఈ ఇసుక నేలలో పంటలు పండించలేక బీడు పెట్టాడు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఇప్పుడు వేరుశనగ, మిరప, కూరగాయలు పండిస్తున్నాడు. దీంతో ఇప్పుడు ఆ భూముల విలువ బాగా పెరిగిపోయింది. ఎకరం రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల ధర పలుకుతోందని చెబుతున్నాడు.

నాడు బీడు.. నేడు సాగు

అవన్నీ సముద్ర తీర ప్రాంతంలో ఇసుక దిబ్బలు. వ్యవసాయానికి అందుబాటులోకి రాని భూములు. సాగు చేద్దామంటే నీటి సౌకర్యం అందించలేని పరిస్థితి. 2004కు ముందు కొందరు రైతులు గత్యంతరం లేక ఇసుకలో దొరువులు తవ్వి బుంగలతో నీరు తెచ్చి పంటలపై చల్లి అరకొరగా కూరగాయ పంటలు సాగు చేసేవారు. బోరుబావులు తవ్వి భూములను సాగులోకి తెద్దామంటే విద్యుత్ ఖర్చు తడిసి మోపెడయ్యేది. కొందరు సొంతంగా బోర్లు వేసి కిరోసిన్ ఇంజన్లు పెట్టి పంటలు సాగు చేసినా.. ఆర్థిక ఇబ్బందులతో నీరు సక్రమంగా పెట్టలేక పోయారు. దీంతో పైరు ఎదిగేది కాదు. వచ్చే దిగుబడి పెట్టుబడి ఖర్చుల్లో సగం కూడా చేతికందేది కాదు. ఈ ఇబ్బందులన్నీ ఎందుకని వేలాది మంది రైతులు ఈ ప్రాంతంలో ఈ ఇసుక భూములను బీళ్లుగా వదిలేసేవారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే పరిస్థితి మారిపోయింది. రాష్ట్రంలో అవకాశమున్న మేర ప్రతి ఎకరాను సాగులోకి తేవాలని సంకల్పించారు. తక్షణమే రాష్ట్రంలో నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతంలోని ఇసుక భూములున్న రైతులకు వ్యవసాయ సర్వీసులు మంజూరు చేశారు. ఉచిత విద్యుత్ అందించారు. దీంతో వేలాది మంది రైతులు బోరుబావులు తవ్వి, ఇసుక దిబ్బలను చదును చేసి పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వైఎస్ జగన్ పాలనలో తీర ప్రాంత రైతులకు ఉచిత విద్యుత్ స్కీమును మరింత విస్తృతం చేశారు. నెల్లూరు జిల్లా మొదలుకొని ప్రకాశం, బాపట్ల, కృష్ణాతోపాటు తీరంలోని అన్ని జిల్లాల్లో ఇసుక భూములున్న రైతులకు వ్యవసాయ, కిచెన్ గార్డెన్స్ కింద కొత్తగా సర్వీసులు మంజూరు చేసి ఉచిత విద్యుత్ అందిస్తున్నారు.

బంగారం పండుతోంది..

- బాపట్ల నియోజకవర్గం పిట్టలవారిపాలెం మండలంలోని భవనంవారి పాలెం, చందోలు, ఖాజీపాలెం, మంతెనవారిపాలెం, కొత్తపాలెం, అల్లూరు గ్రామాల పరిధిలో 380 విద్యుత్ సర్వీసులుండగా 2 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది.
- కర్లపాలెం మండలంలోని దనవారి పాలెం, దిండివారిపాలెం, గణపవరం, కర్లపాలెం, యాజిలి, నల్ల మోతువారిపాలెం తదితర గ్రామాల్లో 272 వ్యవసాయ సర్వీసులు, 1,144 కిచెన్ గార్డెన్ సర్వీసులు ఉన్నాయి. దాదాపు 5 వేల ఎకరాలు సాగులో ఉంది.
- బాపట్ల మండలం దరివాదకొత్తపాలెం, మహాత్మాజీపురం, వెదుళ్లపల్లి, బేతపూడి తదితర గ్రామాల పరిధిలో 2,200 ఎకరాలు సాగు చేస్తున్నారు. వీటికి 450కి పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. రేపల్లె, నిజాంపట్నం, నగరం, భట్టిప్రోలు, చెరుకుపల్లి, వేటపాలెం, చీరాల, చినగంజాం, ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం, టంగుటూరు, శింగరాయకొండ, నెల్లూరు జిల్లా పరిధిలోని ఉలవపాడు, తదితర మండలాలతోపాటు అన్ని జిల్లాల్లోని తీర ప్రాంత రైతులకు ఉచిత విద్యుత్ అందుతోంది. దీంతో పెద్ద ఎత్తున ఇసుక భూములు బంగారం పండే పంట పొలాలుగా మారాయి.
- ఒకప్పుడు బీడుగా ఉన్న ఇసుక భూముల్లో నేడు ఏడాదికి మూడు పంటలు (వేరుశనగ, కూరగాయలు, మిరప) పండుతున్నాయి. దీంతో ఒకప్పుడు రూ.30 వేలు కూడా పలకని ఎకరం.. ఇప్పుడు రూ.30 లక్షల నుంచి రూ.రెండు కోట్ల ధర పలుకుతోంది.



వైభవంగా ముగిసిన మేరీ మాత ఉత్సవాలు





దైవ సందేశాన్ని అందిస్తున్న హైదరాబాద్ ఆర్చి బిషప్ కార్డినల్ పూల అంతోని, హాజరైన భక్తులు

గుణదల(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్రసిద్ధ క్రైస్తవ పుణ్యక్షేత్రం గుణదలలో మూడు రోజుల పాటు జరిగిన మేరీ మాత ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. తిరునాళ్ల చివరి రోజు కావడంతో యాత్రికులు లక్షలాదిగా పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. ప్రధానాలయం వద్ద నుంచి కొండ శిఖరాగ్రం వరకు భక్తులతో కిక్కిరిసింది. ఏలూరు రోడ్డు, బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణం, బీఆర్టీఎస్ రోడ్డు, ఈఎస్ఐ రోడ్డు యాత్రికులతో కిటకిటలాడాయి. కొండపై మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్న భక్తులు అమ్మను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. బిషప్ గ్రాసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై పుణ్యక్షేత్ర గురువులు తుది సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ కార్డినల్ పూల అంతోని భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు స్రత్సాదాన్ని అందజేశారు. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఆస్ట్రియా దేశానికి చెందిన బిషప్ మార్కెటిజ్, పలువురు గురువులు, మఠకన్యలు పాల్గొన్నారు.

తెలంగాణ

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు నేటితో తెర

- బడ్జెట్ పద్దులపై ముగిసిన మూడు రోజుల చర్చ
- వివిధ విభాగాలకు చెందిన 37 పద్దులు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వార్షిక బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన ఎనిమిదో రోజు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పద్దులపై చర్చ జరిగింది. ఈ నెల 9న శాఖల వారీగా ప్రభుత్వ పద్దులపై చర్చ ప్రారంభం కాగా, మొత్తం 37 పద్దులను ఆమోదించారు. నీటిపారుదల, గవర్నర్, మంత్రిమండలి, సాధారణ పాలన, వాణిజ్య పన్నుల నిర్వహణ, వైద్య ఆరోగ్యం, పశు, మత్స్య పరిశ్రమ, హోం, జైళ్లు, వ్యవసాయ, సహకార, పంచాయతీరాజ్, గ్రామీణ శాఖలకు సంబంధించిన పద్దులను శాసనసభ ఆమోదించింది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శాసనసభ నేరుగా ప్రశ్నోత్తరాలను చేపట్టింది. '2023 ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లుతో పాటు పంచాయతీరాజ్ సవరణ బిల్లును ఆమోదించింది. విరామం అనంతరం తిరిగి సమావేశమైన శాసనసభ రాత్రి వరకు కొనసాగింది. కాగా ఆదివారం వార్షిక బడ్జెట్ 2023–24 ద్రవ్య వినిమయ బిల్లు ఉభయ సభల్లో చర్చకు రానున్నది. ఈ బిల్లును ఉభయ సభలు ఆమోదించిన తర్వాత నిరవధికంగా వాయిదా పడనుంది. ఆదివారం ఉదయం శాసనసభలో ద్రవ్య వినిమియ బిల్లుపై జరిగే చర్చకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం ఇచ్చే అవకాశముంది. ఈ బిల్లును శాసనసభ ఆమోదించిన తర్వాత శాసన మండలికి పంపుతారు. శాసనమండలిలోనూ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత వాయిదా పడుతుంది.

యాదాద్రి జిల్లాలో శిలాయుగపు చిత్ర కళ

- ప్యారారం గ్రామంలో ఆదిమానవుల వర్ణచిత్రాలు
- 8వేల సంవత్సరాల నాటివిగా గుర్తింపు

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో ఆదిమానవుడు గీసిన వర్ణ చిత్రాలు బయటపడ్డాయి. మండలంలోని ప్యారారం గ్రామంలోని చిత్తారిగుట్టపైన ఆదిమానవుడి రంగుల కాన్వాస్‌ను కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీరుద్దీన్, కొరవి గోపాల్, మహమ్మద్ అన్వర్ పాషాలతో కలిసి విశ్రాంత పురావస్తు అధికారి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి శనివారం పరిశీలించారు. చిత్తారిగుట్ట అని పిలువబడే ఒక రాతి ఆవాసపు గోడ, కప్పు భాగంలో మధ్య రాతియుగం, కొత్తరాతి యుగపు మూపురం ఉన్న ఆరు ఎద్దు బొమ్మలు, ఒక అడవి పంది, రెండు జింకలు, ఇద్దరు మనుషుల బొమ్మలను గుర్తించారు. ఎర్రజాజు రంగుతో రేఖా చిత్ర రీతిలో గీచిన ఈ బొమ్మలు ఆనాటి మానవుల చిత్ర కళా నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయన్నారు. చిత్తారిగుట్ట దిగువన సూక్ష్మ రాతి పనిముట్లు, సూక్ష్మ రాతి పరికరాలు, ఒక కొత్తరాతి యుగపు రాతి గొడ్డలి, గొడ్డళ్లను అరగదీసిన గుంటలను కనుగొన్నారు. ఈ ఆధారాల వల్ల ఈ వర్ణ చిత్రాలు క్రీస్తు పూర్వము 8 వేల సంవత్సరాల కిందటివని తెలుస్తుందని శివనాగిరెడ్డి వెల్లడించారు. అదే రాతి ఆవాసంపైన పూర్తిగా రంగుతో నింపిన తొలియుగపు స్త్రీ బొమ్మ, మధ్య యుగాలనాటి శృంగార భంగిమలో గల రెండు జంటల చిత్రాలు కూడా ఉన్నాయన్నారు.

క్లుప్తంగా...

జమ్మూకశ్మీర్ లిథియం నిల్వలు అత్యుత్తమ రకం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో బయటపడిన లిథియం నిల్వలు అత్యుత్తమ రకానికి చెందినవని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో సుమారు 59 లక్షల టన్నుల లిథియం నిల్వలు ఉన్నట్లు భారత భూగర్భ పరిశోధన సంస్థ (జీఎస్ఐ)కనుగొన్న విషయం తెలిసిందే. ''లిథియం కీలకమైన ఖనిజ వనరు. ఇది గతంలో దేశంలో అందుబాటులో లేదు. నూటికి నూరు శాతం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. సాధారణంగా లిథియం నాణ్యత 220 పీపీఎం(పార్ట్స్ పర్ మిలియన్)గా ఉంటుంది. అయితే, కశ్మీర్‌లో కనుగొన్న లిథియం నాణ్యత 500 పీపీఎం ప్లస్‌గా ఉంది. లిథియం లభ్యతలో మన దేశం చైనాను మించిపోతుంది'' అని కశ్మీర్ గనుల శాఖ కార్యదర్శి అమిత్ శర్మ చెప్పారు.

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేకు నేడు ప్రధాని ప్రారంభం

న్యూఢిల్లీ: ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేలో భాగమైన 246 కిలోమీటర్ల ఢిల్లీ-దౌసా-లాల్‌సోత్ మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించనున్నారు. దీన్ని రూ.12,150 కోట్లతో నిర్మించారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ఢిల్లీ-జైపూర్ మధ్య ప్రయాణ సమయం 5 గంటల నుంచి మూడున్నర గంటలకు తగ్గనుందని ప్రధాని కార్యాలయం తెలిపింది.

అనుమానిత ఉగ్రవాది బెంగళూరులో అరెస్టు


సాక్షి, బెంగళూరు: అంతర్జాతీయ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న ఓ వ్యక్తి బెంగళూరులో అరెస్టయ్యాడు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), బెంగళూరు పోలీసులు కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో థణిసంద్రలోని ఓ ఇంట్లో ఉన్న ఇతడిని అరెస్ట్ చేశారు. ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆరీఫ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రెండేళ్లుగా ఉగ్ర సంస్థ అల్‌ఖైదాతో టెలీగ్రాం, డార్క్‌నెట్ ద్వారా సంబంధాలు నెరుపుతున్నట్లు తెలిసింది. ఇతడి కదలికలపై ఎన్ఐఏ కొన్ని రోజులుగా నిఘా ఉంచింది. సిరియా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న ఆరీఫ్‌ను పట్టుకుని, ఒక లాప్‌టాప్, రెండు హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకుంది. ఈ నెల 13న బెంగళూరులోని ఇంటిని ఖాళీ చేసి యూపీకి వెళ్తున్నట్టు ఇతడు ఇంటి యజమానికి చెప్పాడని పోలీసులు వివరించారు. గత నవంబర్‌లో శివమొగ్గలో ఐఎస్ ప్రేరేపిత ఉగ్ర మాడ్యూల్‌ను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

సౌర కిరీటం!

ఉత్తర ధ్రువ ప్రాంతంలో వింత వెలుగుల వలయం

నాసా శాస్త్రవేత్తలు ఈ మధ్య ఓ అద్భుతాన్ని చూశారు!
సూర్యుడిపై కార్యకలాపాల వీడియో ఒకటి చూస్తుండగా
ధ్రువ ప్రాంతంలోంచి ప్లాస్మా పోగు ఒకటి బయటకొచ్చింది!
కుతకుత ఉడుకుతూండే ఈ పోగు చూస్తుండగానే విడిపోయింది!
అది అలా అలా ఎగురుతూ ఓ రింగు ఆకారాన్ని సంతరించుకుంది!
సూర్యుడి ఉత్తర ధ్రువ ప్రాంతంలో గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది!!

సూర్యుడి నుంచి ఓ ప్లాస్మా పోగు విడిపోవడమేమిటి, ధ్రువ ప్రాంతంలో రింగులా చక్కర్లు కొట్టడమేమిటని ఆశ్చర్యపోతున్నారా? నాసా శాస్త్రవేత్తలూ కాసేపు ఇలాగే ఆశ్చర్యపోయారు. ఇలా జరగడం ఇదే తొలిసారని అంటున్నారు కూడా! సూర్యుడి అయస్కాంత క్షేత్రం రివర్స్ అవుతూండటం ఒక కారణం కావచ్చునని అంచనా వేస్తున్నారు... సూర్యుడు భగభగ మండే అగ్ని గోళమని మనందరికీ తెలుసు. హైడ్రోజన్, హీలియం మూలకాలు ఒకదాంట్లో ఒకటి లయమైపోతూ విపరీతమైన శక్తిని ఉత్పత్తి చేస్తూంటాయి. ఈ క్రమంలో అక్కడి పదార్థం ప్లాస్మా స్థితిలో ఉంటుంది. ఆవేశంతో కూడిన వాయువన్నమాట. అప్పుడప్పుడు సూర్యుడి ఉపరితలంపై పెద్ద ఎత్తున పేలుళ్లు జరగడం, ఫలితంగా కొన్ని కిలోమీటర్ల ఎత్తుకు ఈ ప్లాస్మా పోగులు ఎగసిపడటం మామూలే. వీటిల్లో కొన్ని సూర్యుడి నుంచి విడిపోతూంటాయి కూడా. అయితే ఏ ప్లాస్మా పోగు కూడా ఇప్పటిదాకా ఇలా రింగులా మారి తిరగడం చూడలేదని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పోగు సూర్యుడి 55 డిగ్రీల అక్షాంశం వద్ద మొదలై ధ్రువ ప్రాంతాల వైపునకు ప్రయాణిస్తూంటుందని అమెరికాలో కొలరాడో రాష్ట్రంలోని బౌల్డర్‌లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫరిక్ రీసెర్చ్ డైరెక్టర్ స్కాట్ మాకింతోష్ వివరించారు. ''పదకొండేళ్లకోసారి ఇలా జరగడం, పోగు కచ్చితంగా ఒకే ప్రాంతం నుంచి మొదలై ధ్రువం వైపు ప్రయాణించడాన్ని పరిశీలించాం. ఈ పోగు పదకొండేళ్ల సోలార్ సైకిల్‌లో ఒకే చోట ఎందుకు పుడుతోంది? కచ్చితంగా ధ్రువాలవైపే ఎందుకు ప్రయాణిస్తోంది? ఉన్నట్టుండి మాయమైపోయి, మూడు నాలుగేళ్ల తరువాత అకస్మాత్తుగా అదే ప్రాంతంలో మళ్లీ ఎలా ప్రత్యక్షమవుతోంది? ఇవన్నీ ఎంతో ఆసక్తి రేపే విషయాలు'' అని వివరించారు.



కారణాలు మిస్టరీయే!

సూర్యుడి నుంచి ప్లాస్మా పోగులు విడిపోవడాన్ని శాస్త్రవేత్తలు గతంలోనూ గుర్తించారు. 2015లో కొద్ది వ్యవధిలోనే రెండు భారీ పోగులు విడిపోయాయి. మొదటిది సూర్యుడి ఉత్తర భాగంలో సంభవించింది. ప్లాస్మా కిలోమీటర్ల ఎత్తుకు ఎగసింది. తరువాత కింది భాగంలోకి కలిసిపోయింది. రెండు గంటల తరువాత మరో పోగు విడిపోయింది. అయితే రెండు సందర్భాల్లోనూ ప్లాస్మా పోగు రింగులా మారడం, చక్కర్లు కొట్టడం జరగలేదు. తాజాగా మాత్రమే అలా జరగడానికి కారణాలేమిటో శాస్త్రవేత్తలు నిర్ధారించాల్సి ఉంది. ఇటీవలి కాలంలో సూర్యుడిపై కార్యకలాపాలు చాలా చురుకుగా సాగుతున్నాయని.. పదకొండేళ్ల సోలార్ సైకిల్‌లో కీలకదశకు ఇది నిదర్శనమని వారంటున్నారు. ''ఈ సోలార్ సైకిల్ 2024లో పతాక స్థాయికి చేరుతుంది. అప్పుడు సూర్యుని ఉత్తర, దక్షిణ ధ్రువాలు తారుమారవుతాయి. బహుశా ఆ క్రమంలోనే ఉత్తర ధ్రువ ప్రాంతంలో ప్లాస్మా రింగ్ ఏర్పడి ఉండవచ్చు'' అని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ సోలార్ సైకిల్?

సూర్యుడు విద్యుదావేశంతో కూడిన భారీ వాయుగోళం. ఈ విద్యుదావేశపు వాయువు కదలికల వల్ల సూర్యుడి చుట్టూ శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. దీని ఉత్తర, దక్షిణ ధ్రువాలు పదకొండేళ్లకోసారి తారుమారవుతూంటాయి. ఇదే సోలార్ సైకిల్. దీని ప్రభావం సూర్యుడి ఉపరితలంపై జరిగే కార్యకలాపాలపైనా ఉంటుంది. సూర్యుడిపై జరిగే పేలుళ్ల ఫలితంగా నల్లటి మచ్చల్లాంటివి (సన్ స్పాట్స్) కనిపిస్తూంటాయి. ఒక ఏడాదిలో వీటి సంఖ్యను బట్టి సూర్యుడిపై కార్యకలాపాల తీవ్రత తెలుస్తూంటుంది. సన్‌స్పాట్స్ ఎక్కువ అవుతున్నాయంటే పదకొండేళ్ల సోలార్ సైకిల్ పతాక స్థాయికి చేరుతోందని అర్థం. ఆ తర్వాత ఏటా ఇవి తగ్గుతూ దాదాపుగా శూన్యమవుతాయి. తర్వాత మళ్లీ ఇంకో సోలార్ సైకిల్ ప్రారంభానికి సూచికగా క్రమంగా పెరుగుతాయి. సూర్యుడిపై నుంచి పదార్థం అంతరిక్షంలోకి ఎగసిపడే తీవ్రత కూడా సోలార్ సైకిల్‌కు అనుగుణంగానే హెచ్చుతగ్గులకు గురవుతూంటుంది. వీటి ప్రభావం అంతరిక్షంలోని ఉపగ్రహాల ఎల్రక్టానిక్ పరికరాలను నాశనం చేసేంత తీవ్రంగా ఉంటుంది.

మధ్య వయస్సులోకి ఆదిత్యుడు...

సూర్యుడిప్పుడు మధ్య వయసులోకి అడుగుపెట్టాడు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ శాస్త్రవేత్త గియా అంతరిక్ష నౌకతో చేసిన ప్రయోగాల ద్వారా ఈ అంచనాకు వచ్చారు. ప్రస్తుతం సూర్యుడి వయసు 457 కోట్ల సంవత్సరాలని, ఇంకో 500 కోట్ల ఏళ్ల తర్వాత నశించిపోతుందని గత ఆగస్టులో శాస్త్రవేత్తలు ప్రకటించారు. చివరి దశలో సూర్యుని సైజు విపరీతంగా పెరుగుతుందని, రెడ్‌జెయింట్‌గా మారి భూమితో పాటు ఇతర గ్రహాలనూ మాడ్చి మసి చేసేస్తుందని అంచనా. ఆ తర్వాత వేడి తగ్గిపోయి మరుగుజ్జు నక్షత్రంగా మారిపోతుందట.



టర్కీలోని అంటాక్యా సిటీలో ఓ బాలుడిని ఐదు రోజుల తర్వాత భవన శిథిలాల నుంచి సజీవంగా బయటకు తీసుకొచ్చి అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఆశలు సమాధి?

తుర్కియే, సిరియాల్లో 26 వేలు దాటిన మృతుల సంఖ్య

ఆచూకీ లేని వారు బతకడం కష్టమే!

అంటాక్యా: తుర్కియే, సిరియాలో భూకంపం వచ్చి అయిదు రోజులు దాటిపోవడంతో కనిపించకుండా ఉన్న తమ సన్నిహితులు క్షేమంగా తిరిగి వస్తారన్న విశ్వాసం అందరిలోనూ సన్నిగిల్లుతోంది. ఇప్పటివరకు 26 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ శవాల గుట్టలు బయటకు వస్తూనే ఉన్నాయి. తుర్కియేలో హతే ప్రావిన్స్‌కు వెళ్లి ఫుట్‌బాల్ బృందంలో ఉన్న వారందరి మృతదేహాలు బయటకు వచ్చాయి. ఇప్పటివరకు తుర్కియేలో మాత్రమే 80 వేల మంది గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉంటే, 10 లక్షల మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఆ శవాల మధ్య జీవచ్ఛవాలుగా మారిన కొందరు కొన ఊపిరితో ఉన్న ప్రాణాలతో బయటపడుతున్నారు. 80 ఏళ్ల ముదుసలి నుంచి పది రోజుల బాలుడు వరకు దాదాపుగా 120 గంటల సేపు శిథిలాల కింద కూరుకుపోయిన వారు ఇప్పటివరకు 12 మంది ప్రాణాలతో బయటపడ్డారు.

ఉత్తరాఖండ్ వాసి మృతి

భూకంపం వచ్చిన రోజు నుంచి కనిపించకుండా పోయిన భారతీయుడు, ఉత్తరాఖండ్‌కు చెందిన విజయ్‌కుమార్ గౌడ్ మరణించాడు. అతను బస చేసిన హోటల్ శిథిలాల నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. ఉత్తరాఖండ్‌లోని పౌరి జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ గౌడ్ బెంగళూరు కంపెనీలో పని చేస్తున్నారు. ఆఫీసు పని మీద తుర్కియే వెళ్లారు. అప్పుడే కుదిపేసిన భూకంపం ఆయన నిండు ప్రాణాలను తీసేసింది. అతని చేతి మీద ఉన్న ఓం అన్న టాటూ సాయంతో గౌడ్ మృతదేహాన్ని గుర్తుపట్టినట్టుగా భారత రాయబార కార్యాలయం వెల్లడించింది.

ఒకే కుటుంబంలో ఐదుగురు క్షేమం

గజియాంటెప్ ప్రావిన్స్ నర్దాగ్‌లో ఒక ఇల్లు కుప్పకూలిపోయి, ఆ ఇంట్లో శిథిలాల కింద చిక్కిన ఉన్న ఐదుగురు కుటుంబసభ్యులను సహాయ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. మొదట తండ్రి హసన్ అస్లాన్‌ను శిథిలాల కింద నుంచి బయటకు తీయాలని అనుకుంటే , ఆయన తన కొడుకు, కూతుళ్లని మొదట బయటకు తీయండని మొరపెట్టుకున్నాడు. మొత్తమ్మీద అందరినీ కాపాడిన సహాయ సిబ్బంది గాడ్ ఈజ్ గ్రేట్ అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

పదిరోజుల పసికందు మృత్యుంజయుడు



గడ్డ కట్టించే చలి, భవనం శిథిలాల మధ్య, నీళ్లు, పాలు లేకుండా భూకంపం పది రోజుల వయసున్న బాలుడు 90 గంటల సేపు పోరాటం చేశాడు. చివరికి గెలిచి మృత్యుంజయుడై తిరిగి వచ్చాడు. తుర్కియేలో భూకంప ప్రభావం అధికంగా ఉన్న హతే ప్రావిన్స్‌లో శిథిలాల కింద తల్లి, తన పదేళ్ల బాలుడు యాగిజ్ ఉలాస్‌తో నాలుగు రోజులు అలాగే ఉండిపోయింది. సహాయ సిబ్బంది సిమెంట్ శ్లాబుల తొలగిస్తూ ఉండగా ఆ పసికందు మూలుగు వినిపించింది. జాగ్రత్తగా శిథిలాల నుంచి తొలగించి ప్రాణాలతో ఉన్న ఆ బాలుడిని థర్మల్ బ్లాంకెట్‌లో చుట్టి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మిరాకిల్ బాయ్ చురుగ్గా ఉన్నప్పటికీ తల్లి బాగా నీరసించిపోయే దశలో ఉంది.

'జోడో'ను మూడు రోజులకే ముగిద్దామనుకున్నారు!

తిరువనంతపురం: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రమైన మోకాలి నొప్పి కారణంగా భారత్ జోడో యాత్రను మూడు రోజులకే ఆపేయాలనుకున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. రాహుల్‌కు అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న వేణు గోపాల్ శనివారం కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మోకాలి నొప్పితో ఇబ్బందిపడిన రాహుల్..యాత్రలో తన బదులుగా మరొకరిని పెట్టాలనుకున్నారని కూడా ఆయన చెప్పారు. తన స్థానంలో సీనియర్ నేతలెవరికైనా ఆ బాధ్యతలను అప్పగించాలని సోదరి ప్రియాంకా గాంధీకి చెప్పారన్నారు. కన్యాకుమారి నుంచి యాత్ర మొదలైన మూడు రోజులకే రాహుల్ మోకాలి నొప్పి తీవ్రమైందన్నారు. అయితే, దేవుడి దయతో ఆ తర్వాత నొప్పి తగ్గిపోయిందని చెప్పారు. రాహుల్ నేతృత్వంలో గత ఏడాది సెప్టెంబర్ 7న మొదలైన భారత్ జోడో యాత్ర జనవరి 30న జమ్మూలో ముగిసిన విషయం తెలిసిందే.





జమ్మూకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఇగ్లూ కేఫ్ (ఇన్‌సెట్‌లో) ఆతిథ్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

కేరళలో కుస్తీ.. త్రిపురలో దోస్తీ

- కాంగ్రెస్, సీపీఎంలది ద్వంద్వ నీతి
- త్రిపుర ప్రచారంలో ప్రధాని మోదీ విమర్శలు

రాధాకిషోర్‌పూర్/అంబాసా(త్రిపుర): త్రిపుర రాష్ట్రంలో కాంగ్రెస్-సీపీఎం పార్టీల కూటమిని ప్రధాని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. ఓట్ల కోసం కేరళలో పోటాపోటీగా కుస్తీ పడుతూ, అవే పార్టీలు ఉమ్మడిగా ఓటర్లను మోసంచేసేందుకు త్రిపురలో దోస్తీ చేస్తున్నాయని మోదీ విమర్శించారు. టిప్రా మోతాకి మోదీ పరోక్షంగా చురకలంటించారు. 'ఈ విపక్ష కూటమికి ఇంకొన్ని ఇతర పార్టీలు బయటి నుంచి మద్దతు తెలుపుతున్నాయి. ఈ కూటమికి పడే ప్రతీ ఓటు త్రిపురను కొన్నేళ్లు వెనుకడుగు వేసేలా చేస్తుంది' అని అన్నారు. శనివారం గోమతి జిల్లాలోని రాధాకిషోర్‌పూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ' గతంలో అధ్వానంగా పాలించిన పార్టీలు మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం బయల్దేరాయి. అవి కేరళలో కుస్తీ పడతాయి. త్రిపురలో దోస్తీ కడతాయి' అని అన్నారు. ' ఓట్లు చీల్చేందుకు విపక్షం యత్నిస్తోంది. ఇంకొన్ని చిన్న 'ఓట్లు చీల్చే' పార్టీలుంటాయి. విజయవంతంగా ఓట్లు చీలిస్తే ఫలితాలొచ్చాక అందుకు 'ప్రతిఫలం' పొందుతాయి. ఇంకొందరు తమకు తామే గెలుపుగుర్రాలుగా భావించి గెలిచాక ఇంట్లోనే గడియపెట్టుకుని కూర్చుంటారు' అని మోదీ విమర్శించారు.

రెండంచుల కత్తితో జాగ్రత్త

'గత లెఫ్ట్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనులను విభజించి పాలించాయి. మేం మాత్రం మిజోరం నుంచి వలసవచ్చిన వేలాది బ్రూస్ కుటుంబాలుసహా అన్ని గిరిజన తెగల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. గిరిజన భాష కోక్‌బోరోక్‌ను మా ప్రభుత్వమే ఉన్నత విద్యలో ప్రవేశపెట్టింది. కేంద్ర బడ్జెట్‌లోనూ గిరిజనప్రాంతాల అభివృద్ధికి రూ.1 లక్ష కోట్లు కేటాయించాం' అని అన్నారు. ' కాంగ్రెస్-సీపీఎం డబుల్ ఎడ్జ్(రెండు అంచుల) కత్తి విషయంలో జాగ్రత్తగా ఉండండి. డబుల్ ఎడ్జ్ ప్రభుత్వమొస్తే ప్రజలకు లబ్ధిచేకూరే అన్ని పథకాలను తెగ్గోసి పడేస్తుంది. మా డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి ఈ ఈశాన్య రాష్ట్రంలో అభివృద్ధి గతిని సుస్థిరం చేయండి' అని ఓటర్లకు పిలుపునిచ్చారు. ధలాయ్ జిల్లాలోని అంబాసాలోనూ మోదీ ప్రచార సభలో ప్రసంగించారు.



అంబాసాలో మోదీని దీవిస్తున్న గిరిజన మహిళ

దక్షిణాసియా ముఖద్వారంగా త్రిపుర

'ఈ రెండు పార్టీలు పేదప్రజల కష్టాలు తీరుస్తామని అలుపెరగకుండా వాగ్దానాలు చేస్తారుగానీ పేదల బాధ, కష్టాలను ఎప్పటికీ అర్థంచేసుకోరు. రాష్ట్రంలో తొలి దంతవైద్య కళాశాల బీజేపీ హయాంలోనే సాకారమైంది. గతంలో పోలీస్‌స్టేషన్లపై సీపీఎం శ్రేణులు ఆధిపత్యానికి దుస్సాహసం చేసేవి. మేమొచ్చాక శాంతిభద్రతలు నెలకొల్పాం. గతంలో రాష్ట్రంలోని యువత జీవనోపాధి కోసం వేరే రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. మా హయాంలో ఉద్యోగావకాశాలు పెరిగాయి. యాక్ట్ ఈస్ట్ విధానంతో రాష్ట్రం పురోగమిస్తోంది. త్వరలోనే అభివృద్ధి ఆసియా ముఖద్వారంగా త్రిపుర మారనుంది' అని మోదీ అభిలషించారు.

ఢిల్లీ మద్యం కేసులో మరొకరి అరెస్ట్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం అవకతవకల కేసులో ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవను ఈడీ అరెస్ట్ చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. మనీ లాండరింగ్ చట్టం కింద శుక్రవారం సాయంత్రం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి 10 రోజుల పాటు కస్టడీకి తీసుకుంది. ఈ కేసులో ఈడీ ఇప్పటిదాకా 9 మందిని అరెస్ట్‌చేసింది. ఈ వారంలో ఇది మూడో అరెస్ట్. సీబీఐ అరెస్ట్ చేసిన సీఏ గోరంట్ల బుచ్చిబాబును ప్రత్యేక కోర్టు 14 రోజుల రిమాండ్‌కు అప్పగించింది.

టీషర్ట్స్, జీన్స్, మేకప్, ఫంకీ హెయిర్ స్టైల్ ఇక బంద్ హరియాణా ప్రభుత్వాస్పత్రుల్లో డ్రెస్ కోడ్

చండీగఢ్: హరియాణా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బందికి త్వరలో డ్రెస్ కోడ్‌అమలు చేయనున్నట్లు ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ చెప్పారు. 'ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ యూనిఫాంలోనే కనిపిస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం సిబ్బందిని, రోగిని పోల్చుకోవడం కూడా కష్టమే. క్రమశిక్షణ కోసమే ఈ డ్రెస్ కోడ్. మేకప్, భారీగా నగలు, అలంకరణలు, గోళ్లు పెంచుకోవడం, ఫంకీ హెయిర్ స్టయిల్, టీ షర్టులు, డెనిమ్స్, స్కర్టులపై నిషేధం విధిస్తాం. వైద్య, వైద్యేతర సిబ్బందికి ఇవి వర్తిస్తాయి'' అని చెప్పారు.

దేశంలో వాక్ స్వాతంత్ర్యం కరవు: ఖర్గే

రాంచీ: మోదీ సర్కారుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. దేశంలో వాక్ స్వాతంత్ర్యం లేనే లేదని ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రం సాహెబ్ గంజ్ జిల్లా పాకుర్‌లో శనివారం ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''పార్లమెంట్ లోపల, వెలుపల వాక్ స్వాతంత్ర్యం లేదు. ఎవరైనా నిజం మాట్లాడినా, రాసినా కటకటాల్లోకి పంపుతారు'' అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'మోదీకి స్నేహితుడైన అదానీ ఆస్తులు 2019లో రూ.లక్ష కోట్లుండగా నేడు రూ.13 లక్షల కోట్లకు పెరిగాయి. అదానీ కోసమే తప్ప పేదల కోసం మోదీ పనిచేయడం లేదు' అని అన్నారు. ప్రభుత్వాలను కూలదోయడంలో నిష్ణాతులైన మోదీ, అమిత్ షాలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు.

పెళ్లి బరాత్‌పై దూసుకెళ్లిన కారు

హరిద్వార్: నృత్యాలు, నవ్వులు, పాటలతో హుషారుగా సాగుతున్న పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఊరేగింపుగా వెళ్తుండగా స్కార్పియో శరవేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఒకరు చనిపోగా 31 మంది గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లో హరిద్వార్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ దుర్ఘటన జరిగింది. కారు డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరికొన్నేళ్లు సాగొచ్చు

వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెని అంచనా

కీవ్: ఏడాది క్రితం మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరికొన్నేళ్లు సాగే అవకాశాలున్నాయని ప్రైవేట్ మిలటరీ కాంట్రాక్టర్, వాగ్నర్ గ్రూప్ యజమాని యెవ్‌గెనీ ప్రిగోజిన్ అంటున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ప్రిగోజిన్‌కు చెందిన ప్రైవేట్ సైన్యం రష్యా మిలటరీతో కలిసి ఉక్రెయిన్‌లో యుద్ధం చేస్తోంది. శుక్రవారం ఓ వీడియో ఇంటర్వ్యూలో ప్రిగోజిన్.. కీలక పారిశ్రామిక ప్రాంతం డోన్‌బాస్‌పై పూర్తి స్థాయి ఆధిపత్యం సాధించేందుకు రష్యాకు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకు పట్టొచ్చని అంచనా వేశారు. నీపర్ నదికి తూర్పు వైపునున్న విస్తార ప్రాంతంపై పట్టు సాధించాలంటే మాత్రం రష్యాకు మూడేళ్ల వరకు సమయం తీసుకుంటుందని అన్నారు. కంచుకోటలాంటి డొనెట్స్క్‌లోని బఖ్ముత్‌లో ఉక్రెయిన్ దళాలతో తమ గ్రూప్ శ్రేణులు భీకర పోరాటం సాగిస్తున్నాయని చెప్పారు. తమ 'స్పెషల్ మిలటరీ ఆపరేషన్'అనుకున్న లక్ష్యాలను సాధించే వరకు కొనసాగుతుందని రష్యా కూడా చెబుతుండటం గమనార్హం. రష్యా అధ్యక్ష భవనమైన క్రెమ్లిన్ కేటరింగ్ కాంట్రాక్టులు చేసే ప్రిగోజిన్‌కు 'పుతిన్ వంటమనిషి'గా పేరుంది. శనివారం ఒడెసాలో వ్యూహాత్మక రైల్వే వంతెనను రష్యాకు చెందిన సీ డ్రోన్ దాడితో పేల్చేస్తున్న వీడియో ఒకటి రష్యా మిలటరీ బ్లాగర్లు విడుదల చేశారు. దీనిని ఇరు దేశాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

దుమ్ము రేపిన చాట్‌జీపీటీ

- అత్యంత కఠినమైన యూఎస్ఎంఎల్ పరీక్షను అలవోకగా పాసైంది
- చాట్‌జీపీటీకి ఇది కీలక మైలురాయి
- అధ్యయన సంస్థ అన్సిబుల్‌హెల్త్

లాస్‌ఏంజెలెస్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీ మరో ఘనత సాధించింది. అత్యంత కఠినమైన యూఎస్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జాం (యూఎస్ఎంఎల్ఈ) పాసైంది. 1, 2సీకే, 3 అనే మూడు సిరీస్‌లుగా ఉండే ఈ పరీక్షల్లో దాదాపుగా 60 శాతం మార్కులు స్కోరు చేసి ఔరా అనిపించింది. వైద్య విద్యార్థులు, శిక్షణలో ఉన్న వైద్యులు రాసే యూఎస్ఎంఎల్ఈలో బయోకెమిస్ట్రీ, డయాగ్నస్టిక్ రీజనింగ్, బయోఎథిక్స్ వంటి పలు అంశాలపై లోతుగా ప్రశ్నలుంటాయి. కాలిఫోర్నియాలోని అన్సిబుల్‌హెల్త్ సంస్థ ఈ అధ్యయనం జరిపింది. ఇందులో భాగంగా 2022 జూన్ నాటి పరీక్షలో ఇమేజ్ ఆధారిత ప్రశ్నలు మినహా మిగతా 350 ప్రశ్నలను చాట్‌జీపీటీకి సంధించారు. మూడు పరీక్షల్లో అది 52.4 నుంచి 75 శాతం మధ్యలో స్కోరు చేసిందట. పాసయ్యేందుకు సగటున 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ అధ్యయన వివరాలను పీఎల్ఓఎస్ డిజిటల్ హెల్త్ జర్నల్లో ప్రచురించారు. ''అత్యంత కఠినమైన ఈ పరీక్షను మానవ ప్రమేయం అనలే లేకుండా పాసవడం చాలా గొప్ప విషయం. ఈ ఘనత సాధించడం ద్వారా చాట్‌జీపీటీ కీలక మైలురాయిని అధిగమించింది'' అని పేర్కొన్నారు. అన్సిబుల్‌హెల్త్ సంస్థ ఇప్పటికే సంక్లిష్టమైన వైద్య పరిభాషతో కూడిన రిపోర్టులను రోగులు సులువుగా అర్థం చేసుకునేందుకు వీలైన భాషలో రాసేందుకు చాట్‌జీపీటీని ఉపయోగించుకుంటోంది.



మన రాజ్యాంగం 'పక్కా లోకల్'

స్వపరిపాలనకు అత్యుత్తమ కరదీపిక: సీజేఐ



ముంబై: ''భారత రాజ్యాంగం అతి గొప్ప స్వదేశీ రూపకల్పన. ఆత్మగౌరవం, స్వతంత్రం, స్వపరిపాలనకు అత్యుత్తమ కరదీపిక'' అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కొనియాడారు. ''కానీ కొందరు దాని విజయాలను అతిగా కొనియాడుతుంటే మరికొందరు పూర్తిగా పెదవి విరుస్తుంటారు. ఇది నిజంగా బాధాకరం. మన రాజ్యాంగం ఎన్నో గొప్ప ఘనతలు సాధించిందన్నది నిస్సందేహం. అయితే సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ముఖ్యంగా భారత సమాజంలో లోతుగా వేళ్లూనుకుపోయిన అసమానతలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి'' అని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం పూర్తిస్థాయిలో అందిపుచ్చుకున్నప్పుడే ఈ అసమానతలు పోతాయన్నారు. శనివారం నాగపూర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ తొలి కాన్వకేషన్‌లో సీజేఐ పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్దేశిత విలువలకు కట్టుబడితే రాణిస్తారంటూ యువ న్యాయ పట్టభద్రులకు ఈ సందర్భంగా ఉద్బోధించారు. ''నేడు మనం అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులు, పరిహారాలకు అంబేడ్కర్‌కు రుణపడి ఉండాలి. ఎన్నో అడ్డంకులను అధిగమించి ఆయన ప్రపంచంలోనే అతి గొప్ప సామాజిక సంస్కర్తగా ఎదిగారు'' అంటూ కొనియాడారు.

అమెరికా గగనతలంలో మరో బెలూన్ కలకలం

నేలకూల్చిన యుద్ధవిమానం

వాషింగ్టన్: చైనా భారీ నిఘా బెలూన్‌ను అమెరికా కూల్చేసిన ఘటన మరువకముందే అగ్రరాజ్యంలో మరో గగనతల ఉల్లంఘన ఉదంతం చోటుచేసుకుంది. అలాస్కాలో కారు పరిమాణంలో అత్యంత ఎత్తులో ఎగురుతున్న ఒక వస్తువును కూల్చేశామని వైట్‌హౌస్ తెలిపింది. 'పౌర విమానాల రాకపోకలకు కాస్తంత విఘాతం కల్గించేదిగా ఉన్న వస్తువును కూల్చేశాం. శిథిలాలను వెతికే పనిలో ఉన్నాం' అని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ బ్రిగేడియర్ జనరల్ ప్యాట్ రైడర్ చెప్పారు. ' 40వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న వస్తువును 24 గంటలపాటు నిశితంగా పరిశీలించాక అధ్యక్షుడు బైడెన్ ఆదేశాలమేరకు యుద్ధవిమానం కూల్చేసింది. అది గడ్డ కట్టిన అమెరికా సముద్రజలాల్లో పడింది' అని అమెరికా జాతీయ భద్రతా మండలి కోఆర్డినేటర్ (వ్యూహాత్మక కమ్యూనికేషన్స్) జాన్ కిర్బీ మీడియాతో చెప్పారు. ''ఇటీవల కూల్చేసిన చైనా నిఘా బెలూన్‌కు స్వయం నియంత్రణ, గమన వ్యవస్థ ఉన్నాయి. సున్నిత సైనిక స్థావరాలపై నిఘా పెట్టింది. కానీ ఈ వస్తువు ఏం చేసిందనేది ఇంకా తెలియదు'' అని ఆయన అన్నారు.



పసిఫిక్ ప్యాకెట్ రకం చిట్టెలుక ఇది. వయసు 9 సంవత్సరాల 209 రోజులు. అత్యంత ఎక్కువకాలం జీవించిన ఎలుకగా గిన్నిస్ రికార్డుకెక్కింది. ఇవి 3 నుంచి ఐదేళ్లే బతుకుతాయి. అమెరికాలోని శాన్ డీగో జూ అంతరించిపోతున్న ఈ రకం ఎలుకలను పెంచుతోంది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



వినువీధి సంబరం

శనివారం బెంగళూరు యెలహంక వైమానిక స్థావరంలో లోహ విహంగాల రిహార్సల్స్. 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఏరో ఇండియా ప్రదర్శనకు సాధన అలరించింది



న్యూస్‌రీల్

అంబులెన్స్‌లో ప్రసవం

- పురిటిబిడ్డ మృతి

దొడ్డబళ్లాపురం: అంబులెన్స్‌లో మహిళ పురుడు పోసుకోగా పురిటిబిడ్డ మృతి చెందిన ఘటన నెలమంగల సమీపంలోని బిల్లినకోటె గ్రామం వద్ద చోటుచేసుకుంది. తుమకూరు జిల్లా శిరా తాలూకా హుణసెకట్టె గ్రామానికి చెందిన గర్భిణి అర్పితను తుమకూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే కాన్పు కష్టం కావడంతో అంబులెన్స్‌లో బెంగళూరులోని వాణి విలాస్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నెలమంగల తాలూకా బిల్లినకోటె వద్ద అర్పిత మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే దురదృష్టవశాత్తు పురిట్లోనే బిడ్డ మృతి చెందింది. తీవ్ర రక్తస్రావం జరిగి అర్పిత ఆరోగ్యం కూడా విషమించడంతో తక్షణం ఆమెను నెలమంగల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. తల్లి, ఆమె కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గృహలక్ష్మీ అభియాన్

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిచ్చే బృహత్ జ్యోతి, ప్రతి కుటుంబ యజమానికి రూ.2 వేలు ఇచ్చే గృహలక్ష్మీ పథకం గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ అందజేసే అభియాన్‌ను కేపీసీసీ ఆరంభించింది. శనివారం కేపీసీసీ కార్యాలయంలో ఈ కార్డులను మీడియా ముందు ప్రదర్శించిన కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, బృహత్ జ్యోతి, గృహలక్ష్మీ పథకం కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు ఇంటింటికీ చేరుతాయన్నారు. ప్రతి బ్లాక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కేపీసీసీ కార్యాలయంలో ఈ కార్డులు పొంది ప్రతి బూత్‌లో ఇంటింటికీ చేరుస్తారని తెలిపారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా గెలిపించాలి: డీకే

మండ్య: ఇంకా మగపిల్లగాడివి కాలేదు, అప్పుడే టికెట్ కోసం నిలబడుతున్నావా? అని కేపీసీసీ అధ్యక్షుడు డి.కే.శివకుమార్ నాయకులను ప్రశ్నించారు. శనివారం మండ్య జిల్లా మద్దూరులో ప్రజాధ్వని సమావేశం జరిగింది. స్థానిక నాయకుడు గురుచరణ్ వేదిక పైన వచ్చి డీకే వెనుక అభ్యర్థిలా పోజిస్తూ నిలబడంతో ఆయన ముఖం చూసిన డీకే.. ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు, ఎవరికి వారు ప్రకటించుకుంటే పద్ధతి కాదని అన్నారు. పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా అందరూ కలిసి పనిచేసి గెలిపించాలని నేతలకు సూచించారు. ఈ సందర్భంగా అధికార బీజేపీపై ఆయన విమర్శలతో మండిపడ్డారు.

అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమేనా?



ఓటర్లలో జాగృతి పెంచేలా స్వీప్ ప్రచారోత్సవాలను ముమ్మరం చేయనున్నారు



ఎక్కువమంది ఓటు వేసేలా కసరత్తు (ఫైల్)

రాష్ట్రంలో మూడు కేంద్ర బృందాల పర్యటన

- ఓటర్లలో జాగృతి, పోలింగ్ పెంపుపై సూచనలు

శివాజీనగర: మరో రెండు మూడు నెలల్లో జరగబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు సన్నాహాలను ప్రారంభించాయి. జిల్లాల స్థాయిలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన కోసం కేంద్ర ఎన్నికల సంఘం మూడు బృందాలను పంపింది. ఇప్పటికి 5కు పైగా జిల్లాల్లో అధికారులతో సమావేశం జరిపి ఏర్పాట్లను పరిశీలించారు. యాదగిరి జిల్లాకు వెళ్లిన బృందం ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రాథమిక దశ పరిశీలన జరిపారు. ఓటర్ల జాగృతి కోసం స్వీప్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ప్రారంభించి, అలాగే కల్బుర్గి జోన్ జిల్లాధికారులతో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై సభ జరిపారు.

ముమ్మరంగా వీడియో కాన్ఫరెన్స్‌లు

మరోవైపు చామరాజనగర జిల్లాలో ఇదే రీతిలో ఏర్పాట్లను పరిశీలించారు. మైసూరు జోన్ జిల్లాధికారులతో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై సభ జరిపారు. ఓటర్లను జాగృతి చేసే స్వీప్ ప్రచారోత్సవాల గురించి సమావేశాలు జరిపారు. ఫిబ్రవరి 7న రాష్ట్రానికి బృందాలు చేరుకున్నాయి. మూడో బృందం బెంగళూరు జోన్, జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. పోలింగ్ బూత్‌లతో పాటు ముందస్తు ఏర్పాట్లను వీక్షించారు. మూడు బృందాల అధికారులు బెంగళూరులో సమావేశం జరిపి అనంతరం బెళగావి జోన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను తెలుసుకున్నారు. బెంగళూరు జోన్ కలెక్టర్లు, అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.

తక్కువ పోలింగ్ సమస్యకు పరిష్కారాలు

గత శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ బూత్‌లను గుర్తించడం, తక్కువ పోలింగ్‌కు కారణాలను తెలుసుకొని పరిష్కారాలను కనిపెట్టడం, ఓటు హక్కుపై జాగృతి ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచడం, కొత్త పోలింగ్ బూత్‌లను గుర్తించడం, వసతులు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై దృష్టి సారించారు. సోషల్ మీడియా ద్వారా యువ ఓటర్లకు చేరువ కావాలని సూచించారు.

ఆ రెండు పార్టీలు కుమ్మక్కు



ర్యాలీగా సభాస్థలికి వస్తున్న అమిత్ షా తదితరులు.



ప్రసంగిస్తున్న అమిత్ షా

- జేడీఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లే
- పుత్తూరు సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధ్వజం

సాక్షి, బెంగళూరు: పీఎఫ్ఐని నిషేధించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశద్రోహులకు గట్టి జవాబు ఇచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. సురక్షిత, ప్రశాంత కర్ణాటక కావాలంటే బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని చెప్పారు. శనివారం దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరులోని వివేకానంద ఉన్నత పాఠశాల మైదానంలో క్యాంప్కో సువర్ణ మహోత్సవాలను అమిత్ షా ప్రారంభించి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పీఎఫ్ఐ మీద ఉన్న క్రిమినల్ కేసులను రద్దు చేసి సమాజంలో హింస రాజకీయాలకు తెరదీశారని అమిత్ షా ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకూడదని, జేడీఎస్, కాంగ్రెస్ పార్టీలో లోపాయికారిగా కలసి పని చేస్తున్నాయని విమర్శించారు. జేడీఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్ పార్టీకి వేసినట్లేనన్నారు. టిప్పును ఆరాధించే వారికి ఓటు వేయొద్దని, రాణి అబ్బక్కను అభిమానించే బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని మనవి చేశారు. కరావళి వైవిధ్యమైన ప్రాంతమని, ఇక్కడ సాగు చేసే ప్రత్యేక వక్కల ద్వారా గుజరాత్‌లోని వ్యాపారులు లాభం పొందుతున్నారని ఆయన చెప్పారు. తాను ఇటీవల కాంతార సినిమా చూశానని, ఈ సినిమా ద్వారా ఇక్కడి విశిష్టతను తెలుసుకునేందుకు అవకాశం కలిగిందన్నారు.

హనుమగిరిలో పూజలు

అంతకుముందు కేరళ కణ్ణూరుకు ప్రత్యేక విమానంలో చేరుకున్న అమిత్ షా అక్కడి నుంచి దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరుకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. పుత్తూరు హనుమగిరిలో గజానన పాఠశాల ఆవరణకు హెలికాప్టర్ చేరుకుంది. దగ్గరిలోని హనుమగిరి దేవస్థానానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్ జరిమానా వసూళ్లు రూ.85 కోట్లు

శివాజీనగర: ట్రాఫిక్ జరిమానాలపై భారీ రాయితీలు ప్రకటించడంతో వాహనదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 31 లక్షల కేసుల్లో రూ.85 కోట్లకు పైగా జరిమానా వసూలైంది. ఇక ఆఖరి రోజు శనివారం కూడా జరిమానా చెల్లించడానికి వాహనదారులు భారీగా వచ్చారు. దాదాపు రూ.100 కోట్ల వరకు వసూలు అయ్యే అవకాశం ఉంది.

రాయితీ ప్రకటించిన తొలిరోజే రూ.5 కోట్లు

బెంగళూరు నగర ట్రాఫిక్ పరిధిలో జరిమానాలపై రాయితీ ప్రకటించిన మొదటి రోజే రూ.5 కోట్ల వరకు జరిమానా వసూలైంది. బెంగళూరుకు మాత్రమే కాకుండా ఈ రాయితీ రాష్ట్రమంతటికి ప్రకటిస్తే పెండింగ్ జరిమానాలు భారీగా వసూళ్లయ్యే అవకాశం ఉందని, ఈ రాయితీ నెల రోజులు విస్తరించాలని సీఎం బొమ్మైకు ఆప్ నాయకులు విన్నవించారు.



ఫ్రేజర్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం చలానాలు కట్టేందుకు తరలివచ్చిన జనం

భార్యకు బీమా పత్రాలు, డెత్‌నోట్ పంపి..

- బెంగళూరులో ఐటీ అధికారి ఆత్మహత్య!

యశవంతపుర: ఇంటికి ఆలస్యంగా వస్తానని భార్యకు చెప్పాడు, తరువాత బీమా పత్రాలను, డెత్‌నోట్‌ను వాట్సప్ చేసి నడుస్తున్న రైలు కిందకు దూకి కేంద్ర ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ ఇన్‌స్పెక్టర్ ఒకరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర దూబె 10 ఏళ్ల నుంచి బెంగళూరులో ఐటీ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన యశవంతపురలోని బీడీఏ ఆఫీసు వద్ద నడుస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. సుమారు 10 రోజుల కిందటే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని చెప్పారు. దూబె చివరిసారిగా యూపీలో ఉంటున్న తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి తరువాత బెంగళూరులో భార్య ఆరతి మాళవికి కాల్ చేసి మాట్లాడి, ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పాడు. కొంతసేపటికి తన ఇన్సూరెన్స్ పత్రాల కాపీలను, సూసైడ్ నోట్‌ను భార్యకు వాట్సాప్ చేశాడు. నా మరణానికి నాదే బాధ్యత అని డెత్‌నోటులో రాశాడు. తన భర్త కనిపించడం లేదంటూ భార్య యశవంతపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు గాలించగా రైలు పట్టాల వద్ద మృతదేహం కనిపించింది. మృతిపై పలు అనుమానాలు వ్యక్తం కావటంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుండు గీసి ఊరేగింపు

- విజయపుర జిల్లాలో అత్యాచార యత్నం నిందితులకు గ్రామస్తుల శిక్ష

సాక్షి, బళ్లారి: మహిళపై అత్యాచారయత్నం చేసిన ఇద్దరు యువకులకు గుండు గీసి, దేహశుద్ధి చేసి, చెప్పులతో ఊరేగించిన వీడియో వైరల్ అయింది. రెండు రోజుల క్రితం విజయపుర జిల్లా విజయపుర తాలూకా హెగడిహాళ్ తాండాలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన తేజ చౌహాన్, రాజు చౌహాన్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఓ యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడంతో గ్రామస్తులంతా కలిసికట్టుగా శిక్ష విధించారు. యువకులను ఇద్దరిని పట్టుకుని ముందుగా దేహశుద్ధి చేసి, తరువాత గుండు గీసి, పాత చెప్పుల హారం వేసి గ్రామ వీధుల గుండా అర్ధనగ్నంగా ఊరేగించారు. ఈ ఘటన విజయపుర జిల్లాలో కలకలం సృష్టించింది.

అత్యాచారయత్నం చేసిన ఘటనపై ఇప్పటి వరకు కేసు నమోదు కాకపోవడం గమనార్హం. ఎవరిపై అత్యాచారయత్నం జరిగిందో బయట ప్రపంచానికి తెలియకుండా ఉండడానికి ఫిర్యాదు చేయలేదని, తమ గ్రామంలో చేసిన తప్పునకు మరొకరికి గుణపాఠంలా ఉండేలా తామే శిక్ష వేస్తున్నామని చెబుతున్నారు. కాగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని యువకులను శిక్షించిన గ్రామస్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడితో పాటు అనిల్ లమాణి, మంగేష్, హేము, రమేష్, రాజు, రామసింగ్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.



వినూత్న సత్కారం అందుకున్న నిందితులు

టెక్కీ దంపతుల దుర్మరణం

- తుమకూరు జిల్లాలో కారును ఢీకొన్న లారీ

తుమకూరు: లారీ– కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో టెక్కీ దంపతులు ప్రాణాలు కోల్పోయిన సంఘటన జిల్లాలోని చిక్కనాయకనహళ్లి తాలూకాలోని హులియూరు గేట్ వద్ద చోటుచేసుకుంది. రఘు (35) అతని భార్య అనూష (28) మృతులు.

వివరాలు.. హాసన్ జిల్లాలోని అరసికెరెకు చెందిన రఘు, తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకాలోని తిగడనహళ్లికి చెందిన అనూషతో యేడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వారు బెంగళూరులో ఐటీ ఇంజనీర్లుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. బళ్లారిలో బంధువుల పెళ్లి ఉండడంతో చిక్కనాయకనహళ్లి నుంచి కారులో వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీ వారి కారును ఢీకొట్టగా కారు నుజ్జయింది. దంపతులు తీవ్ర గాయాలతో కన్నుమూశారు. కారు డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానిక పోలీసులు చేరుకుని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.



టెక్కీ దంపతులు అనూష- రఘు (ఫైల్),



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

వరాలస్వామికి అడ్డపల్లకీ ఉత్సవం

పావగడ: తుమకూరు జిల్లా పావగడలోని ప్రఖ్యాత స్థానిక శనీశ్వరుని దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా వెండి అడ్డ పల్లకి ఉత్సవం శనివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారి రథానికి టెంకాయలు కొట్టి ఘనంగా పూజలు నిర్వహించారు. జ్యేష్ఠాదేవి సమేత శనైశ్చర స్వామి వెండి పల్లకీలో కనుల పండువగా ఊరేగారు.



అడ్డ పల్లకి మహోత్సవం

ధర ఎక్కువన్నందుకు తీవ్రంగా దాడి

దొడ్డబళ్లాపురం: ధరల విషయంలో వాగ్వాదం చోటుచేసుకుని కస్టమర్‌పై దుకాణం యజమాని దాడి చేసిన సంఘటన దొడ్డ పట్టణంలో జరిగింది. దొడ్డ తాలూకా తూబుగెరె గ్రామ పంచాయతీ కార్యాలయంలో గతంలో పీడీఓగా విధులు నిర్వహించిన కృష్ణయ్య తన భార్యతో కలిసి శనివారం ఉదయం పట్టణంలోని ఎస్‌కేఎస్ దుకాణానికి వెళ్లారు. అయితే దుకాణం యజమాని ధరలు ఎక్కువ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. దుకాణం యజమాని, ముగ్గురు పనివాళ్లతో కలిసి కృష్ణయ్యపై దాడి చేసారు. అప్పుడే వచ్చిన పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ కృష్ణయ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి రాజీ కుదుర్చడానికి ప్రయత్నించాడు. ఇదేమని ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపైనా హెడ్ కానిస్టేబుల్ మీకు సంబంధం లేదంటూ దబాయించడం గమనార్హం.

జాతరకు వెళ్లి కానరాని లోకాలకు

- బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ముగ్గురు యువకుల మృతి

యశవంతపుర: దావణగెరె జాతీయ రహదారి- 48లో శుక్రవారం రాత్రి లారీ బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృత్యువు పాలయ్యారు. దావణగెరెకు చెందిన సందేశ్ (23), పరశురామ్ (24), శివు (26) మృతులు. వీరు సమీపంలోని ఒక కర్మాగారంలో కార్మికులుగా పని చేస్తున్నారు. దగ్గరిలోని కాటిహళ్లిలో జరిగిన జాతరకు వెళ్లి బంధువుల ఇంటిలో భోజనం చేసి ఇళ్లకు తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ముగ్గురూ అక్కడే కన్నుమూశారు.

కుటుంబాలు కన్నీరుమున్నీరు

కుటుంబానికి ఆసరాగా ఉంటారనుకున్న యువకులు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. పరశురామ్‌కు ఏడాదిన్నర క్రితం వివాహం కాగా భార్య 7 నెలల గర్భవతి. దేవుడా మాకు ఎంత కష్టం తెచ్చి పెట్టావంటూ తల్లి రోదించింది. తల్లిదండ్రులు లేని శివు అవ్వ వద్ద పెరిగాడు. ఇళ్లలో పని చేస్తూ శివును సాకుతున్నట్లు అవ్వ కన్నీరు మున్నీరైంది, మనవడిని వదిలిపెట్టి తనను తీసుకెళ్లి ఉండినా బాగుండేదని బోరుమంది. శనివారం ఉదయం మృతదేహాలకు దావణగెరె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.



ప్రమాదంలో మృతి చెందిన యువకులు (ఫైల్)

బైక్‌పై దూసుకెళ్తూ మొబైల్ దొంగ దుర్మరణం!

శివాజీనగర: ప్రజల నుంచి మొబైల్‌ఫోన్లు లాక్కెళ్తూ వేగంగా దూసుకెళ్లిన బైకర్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రోడ్డు డివైడర్‌కు బైక్ ఢీకొనడంతో ఒకరు అక్కడే మృతి చెందగా అతని వద్ద 8 మొబైల్‌ఫోన్లు చిక్కడం గమనార్హం. శుక్రవారం అర్ధరాత్రి సిటీ మార్కెట్ పై వంతెన మీద ఈ ఘటన జరిగింది. మృతుడు కబీర్ పాషా. అతి వేగంగా పై వంతెన మీద వెళుతుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పడడంతో తలకు గాయాలై చనిపోయాడు. ద్విచక్ర వాహనంలో ఎనిమిది మొబైల్‌లు లభించడం పలు అనుమానాలకు కారణమైంది. కేపీసీసీ కార్యాలయం వద్ద ఓ మహిళ మొబైల్ ఫోన్‌ను లాక్కొని పరారైంది ఇతడేనని అనుమానం ఉంది. సెల్ చోరీలకు పాల్పడి ఉడాయించాలనే తొందరలో ప్రమాదానికి గురైనట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటనలో మరో వ్యక్తి గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

మత్తు సూది తీసుకుని నర్సు ఆత్మహత్య

మైసూరు: మత్తుమందు ఇంజెక్షన్ తీసుకుని ప్రైవేటు నర్స్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసూరు నగరంలో జరిగింది. ఆత్మహత్య చేసుకున్న నర్స్ శైలజ (23). ఆమె చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలుకాలణి బెట్టదపుర గ్రామవాసి. మైసూరు నగరంలోని మహ్మద్‌సేట్ బ్లాక్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో 5 సంవత్సరాల నుంచి నర్స్‌గా పని చేస్తూ, ఆస్పత్రి సమీపంలో ఉన్న మహిళా హాస్టల్‌లో నివాసం ఉంటున్నారు. పలు సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన శైలజ తన గదిలో మత్తు మందును ఇంజెక్షన్‌గా తీసుకుని ప్రాణాలు తీసుకుంది. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కూడా కారణం కావచ్చని అనుమానాలున్నాయి. లష్కర్ పోలీసులు పరిశీలన జరిపి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

కసాప సమ్మేళన లోగో విడుదల



పాల్గొన్న ఎమ్మెల్యే, కసాప సభ్యులు

గంగావతి: పరిషత్ కార్యాలయంలో శనివారం కన్నడ సాహిత్య పరిషత్(కసాప) సమ్మేళన లోగోను ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా సమ్మేళ నాన్ని ఘనంగా జరుపుతామన్నారు. కన్నడ భాష, నేల, జల వనరుల అభివృద్ధి కోసం ప్రజలంతా ఈ సమ్మేళనం ద్వారా చైతన్యులు కావాలని సూచించారు. మాతృభాషలోనే తమ పిల్లలకు చదువు చెప్పించాలన్నారు. కసాప జిల్లాధ్యక్షులు శరణేగౌడ పోలీస్ పాటిల్, సమ్మేళన అధ్యక్షులు సీహెచ్ నారినాళ్, తాలూకా అధ్యక్షులు, పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు బీమా చేయాలి

మైసూరు: రాష్ట్రంలో ఎవరైనా రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు కురుబూరు శాంత కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ చేశారు. శనివారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడుతు పలు రాష్ట్రాల్లో రైతులు ఆత్మ హత్య చేసుకున్నా, ప్రమాదంలో మరణించినా రూ. 5 లక్షల సహాయం చేస్తున్నారని, ఇక్కడ కూడా అలాగే అమలు చేయాలని కోరారు.

జీవనోపాధికి ఉద్యోగం ఊతం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.రఘుమూర్తి

చెళ్లకెరె రూరల్: జీవనోపాధికి ఉద్యోగం తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ ఉద్యోగ మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే టీ.రఘుమూర్తి తెలిపారు. ఆయన శనివారం ఐటీఐ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను ప్రారంభించి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేయడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. మహిళలు కూడా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు సుమ్మక్క, స్థాయి సమితి అధ్యక్షుడు ఎస్‌జే.రాఘవేంద్ర, సభ్యులు రమేష్‌గౌడ, ప్రిన్సిపాల్ టీఎం.బసన్న, వివిధ కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో ఉద్యోగ మేళా

శివాజీనగర: యువతలో ప్రతిభను పెంచేందుకు మల్లేశ్వరం నియోజకవర్గ వ్యాప్తిలో మరో 10 లాంగ్వేజ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు నైపుణ్యాభివృద్ధి మంత్రి సీ.ఎన్.అశ్వత్థనారాయణ తెలిపారు. మల్లేశ్వరం 18వ క్రాస్ రోడ్డులో ఉన్న పీయూ, డిగ్రీ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను ప్రారంభించారు. ఉద్యోగ మేళాలో 125 కంపెనీలు పాల్గొనగా, 28 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఎస్ఎస్ఎల్‌సీ నుండి ఇంజనీరింగ్ పట్టభద్రుల వరకూ పాల్గొనవచ్చని తెలిపారు.

చెన్నకేశవ కళ్యాణోత్సవం



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో చరిత్ర ప్రసిద్ధ శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శనివారం ఎంపీ మోహన్, కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి సన్నిధిలో వివిధ పూజలను నిర్వహించారు. చిక్కబళ్ళాపురం ఎంపీ బచ్చేగౌడ, హొసకోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చెగౌడ పాల్గొన్నారు.

నేడు మోకా మల్లేశ్వర స్వామి రథోత్సవం

బళ్లారిఅర్బన్: కర్ణాటక, ఆంధ్ర సరిహద్దుల్లోని మోకా క్షేత్రంలో వెలసిన మల్లేశ్వర స్వామి మహా రథోత్సవాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు పత్తార్ వెంకటేష్ తెలిపారు. రథోత్సవం సందర్భంగా దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేవస్థానం నుంచి ఎదురు బసవణ్ణ వరకు రథాన్ని పెద్ద సంఖ్యలో భక్తుల సమక్షంలో లాగి ఏటా మాదిరిగానే జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకారం

సిరుగుప్ప: నగర ఆరోగ్య కేంద్రం ముఖ్య వైద్యాధికారి డా.దేవరాజ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కూడ్లిగి ఆరోగ్య కేంద్రంలో పని చేసిన డా.గురునాథ్ శనివారం ఆరోగ్య కేంద్రం నూతన ముఖ్య వైద్యాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది డా.దేవరాజ్‌కు వీడ్కోలు పలికారు.

కారు ఢీకొని జింక మృతి

మైసూరు: బండీపుర పులుల అరణ్యంలో గుండా సాగే జాతీయ రహదారిలో వేగంగా వచ్చిన కారు ఢీకొని జింక పిల్ల మృతి చెందింది. మద్దూరు పరిధిలోని దారిపుర హల్లుగావలు వద్ద జరిగింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్. షబ్బీర్ అనే వ్యక్తి కేరళకు ఇన్నోవా కారులో వెళుతున్న సమయంలో రోడ్డు దాటుతున్న జింకను ఢీకొట్టడంతో అక్కడే మృత్యువాత పడింది. అటవీ సిబ్బంది వచ్చి కేసు నమోదు చేసుకుని షబ్బీర్‌ను అరెస్టు చేశారు. జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పరిశ్రమల్లో స్థానికులకే పెద్దపీట

- కన్నడిగులకు 80 శాతం ఉద్యోగాలు
- మంత్రి శ్రీరాములు



రమేష్‌గౌడ పాటిల్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: కన్నడ భాషను మరింతగా కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, రాష్ట్రంలోని పరిశ్రమల్లో కన్నడిగులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని రాఘవ కళామందిరంలో ఏర్పాటు చేసిన కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. కన్నడిగులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధికి రూ.400 కోట్ల మంజూరుకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. కర్ణాటక ఏకీకరణ కోసం ఎందరో మహానుభావులు త్యాగాలు చేశారని కొనియాడారు. పింజార్ రంజాన్ సాబ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.

కస్తూరి కన్నడే ముద్దు

ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ తనకు కస్తూరి కన్నడ భాష, నేల, నీరు అంటే ప్రాణమన్నారు. తన తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారైనా వారి ఉద్యోగ రీత్యా బళ్లారి జిల్లాలో స్థిరపడటంతో తాము ఇక్కడే పుట్టి పెరిగి, చదువుకుని ఉద్యోగం చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశామని గుర్తు చేశారు. తాను రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదగడానికి బళ్లారి వాసులు కారణమన్నారు. కన్నడిగుల రుణం తీర్చుకునేందుకు ఎన్ని జన్మలు ఎత్తినా చాలదన్నారు. కార్యక్రమంలో పలువురు కళాకారులను, ప్రముఖులను ఘనంగా సన్మానించారు. వేదికపై సమ్మేళనం అధ్యక్షుడు రమేష్‌గౌడ పాటిల్, రాఘవ కళామందిరం గౌరవ అధ్యక్షుడు చెన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వరరావు, జనతా బజార్ అధ్యక్షుడు నీలకంఠప్ప, కసాప జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికల నిర్వహణపై నిఘా

- గతంలో కంటే దొంగతనాలు, దోపిడీలు తగ్గుముఖం
- బళ్లారి రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.ఎస్.లోకేష్‌కుమార్



మాట్లాడుతున్న ఐజీ లోకేష్‌కుమార్, చిత్రంలో ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలున్నారు.

బళ్లారి రూరల్: రాబోయే ఎన్నికలు శాంతియుతంగా జరపడానికి ఇప్పటి నుంచే పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు బళ్లారి రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీపీ) బీ.ఎస్.లోకేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయ సభాంగణంలో బళ్లారి విలేకరుల సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి రేంజ్ పరిధిలో అఖండ బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాల్లోని మొత్తం 22 నియోజకవర్గాల్లో శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సర్వసన్నద్ధంగా ఉందన్నారు.

జనస్నేహి పోలీసులుగా మార్పునకు యత్నం

జనస్నేహి పోలీసులుగా వ్యవహరించే ప్రక్రియ పోలీసు శాఖలో జరుగుతోందన్నారు. ప్రతి 3వ శనివారం విక్టిమ్స్ డే, నాల్గో ఆదివారం దళిత దినాచరణ ఆచరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారుల కేసుల పురోగతి, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులపై సమాలోచన జరుగుతుందన్నారు. 2020, 21, 22వ ఏడాదిల్లో మూడేళ్లలో బళ్లారి రేంజ్‌లో మొత్తం 70 దొంగతనాలు, 23 దోపిడీలు, 134 అత్యాచారాలు, 538 ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు, 566 పోక్సో(పిల్లలపై వేధింపులు) కేసులు నమోదైనట్లు తెలిపారు. గతంలో కంటే దొంగతనాలు, దోపిడీలు తగ్గగా ప్రమాదాలు, పోక్సో కేసులు పెరిగినట్లు డీజీపీ తెలిపారు.

చోరీ సొత్తు సొంతదారులకు అందజేశాం

ఇళ్ల దొంగతనాలు, మోటారుసైకిళ్ల తదితర చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేసినట్లు తెలిపారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో భాగంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ నగరంలో భారీ వాహనాల సంచారాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ మద్యం అరికట్టడానికి అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్, ఏఎస్పీ నటరాజ్, డీఎస్పీ కె.బసవరాజు పాల్గొన్నారు.

పేదలకు హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలను అందించిన మంత్రి ఆనంద్‌సింగ్, అధికారులు

హొసపేటె: విజయనగర నియోజకవర్గంలో హొసపేటె, కమలాపురం వ్యాప్తిలో మొత్తం 12925 పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను పంపిణీ చేస్తామని మంత్రి ఆనంద్‌సింగ్ తెలిపారు. శనివారం నగరంలోని 21వ వార్డులో ఏర్పాటు చేసిన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరంలో మొత్తం 48 ప్రాంతాలను మురికివాడలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాధికారి వెంకటేష్, ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాన్ని కాపాడరూ



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్: నగరంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ ముందు ఉన్న ఉద్యానవనాన్ని కాపాడాలని 30వ వార్డు కౌన్సిలర్ సుచరిత సిరిగేరితో పాటు పలువురు స్థానిక మహిళలు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లికి విజ్ఞప్తి చేశారు. వారు శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. ఆకతాయిలు ఉద్యానవనాన్ని నాశనం చేస్తున్నారని, వెంటనే పార్కు చుట్టూ ప్రహరీని నిర్మించాలని కోరారు. జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి సంతోష్ కేలోజీ, నగరసభ సభ్యులు నవీన్ మాలిపాటిల్, వాసుదేవ నవలి, రమేష్ చౌడ్కి, పరశురామ మడ్డేర్, శరభోజి గాయక్వాడ్, ఉమేష్ సింగనాళ, వెంకటరమణ, నీలకంఠ కట్టిమని, అమర్ సింగ్, అమరేగౌడ, వెల్లంకి రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగాల భర్తీలో గోల్‌మాల్

- ఎంపికలో బరువు కోసం తూకం రాళ్లు వాడిన అభ్యర్థులు



వాడిన తూకం రాయి, ఓ అభ్యర్థి తొడలకు తూకం రాళ్లు కట్టుకున్న దృశ్యం

రాయచూరు రూరల్: కలబుర్గి ఆర్టీసీ డివిజన్‌లో కండక్టర్, డ్రైవర్ల నియామకంలో అభ్యర్థులు గోల్‌మాల్‌కు పాల్పడిన ఉదంతం వెలుగు చూసింది. కళ్యాణ కర్ణాటకలోని జిల్లాల్లో 1619 మంది కండక్టర్లు, డ్రైవర్ల నియామకాలకు 39 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో అభ్యర్థులు కనీసం 169 సెంటీమీటర్ల ఎత్తు, 55 కేజీల బరువు కలిగి ఉండాలి. గత నెల రోజులుగా ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. గత నెల రోజులుగా ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, విజయనగర, బళ్లారి జిల్లాల్లో ఆర్టీసీ అధికారులు ఇంటర్వ్యూల సమయంలో అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు, పరుగు ఇతరత్ర అంశాలను పరీక్షించారు. అయితే ఆ సమయంలో తక్కువ బరువున్న అభ్యర్థులు బరువును పెంచుకోవడానికి తాము వేసుకున్న దుస్తుల్లో తొడలు, నడుములకు ఇనుప చైన్లు, తూకం రాళ్లు, ఇనుప రాడ్లు కట్టుకొని వచ్చారు. జాగృత దళానికి అనుమానం రావడంతో నలుగురిని పరిశీలించగా అసలు విషయం బయటపడింది. దీంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. అక్రమాలకు పాల్పడిన వారిని ఇంటర్వ్యూల నుంచి తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేశామని కళ్యాణ కర్ణాటక ఆర్టీసీ ఎండీ రాచప్ప విలేకరులకు తెలిపారు.

త్రిచక్ర వాహనాల అందజేత



వాహనాలను అందిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: గ్రామాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. ఆయన శనివారం గిల్లేసూగూరులో నూతనంగా నిర్మించిన గురుకుల పాఠశాల, జీపీ కార్యాలయాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మంజూరైన సౌలభ్యాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు.

తుదిశ్వాస వరకు ఇక్కడే ఉంటా

- ప్రజా సేవకు అంకితం అవుతా
- ప్రచారసభలో గాలి జనార్దన్‌రెడ్డి



జనార్దన్‌రెడ్డిని గజమాలతో స్వాగతిస్తున్న దృశ్యం

గంగావతి: ఊపిరి ఉన్నంత వరకు గంగావతిలో నివాసం ఉండి ప్రజాసేవకు అంకితం అవుతానని కేఆర్‌పీపీ సంస్థాపకుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని 6, 7వ వార్డుల్లో ముమ్మర ప్రచారాన్ని చేపట్టి సభను ఉద్దేశించి మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మూడు నెలల్లో వారికి ఇళ్లస్థలాల హక్కు పత్రాలు అందిస్తామన్నారు. రూ.5 కోట్లతో కుట్టు శిక్షణా కేంద్రాన్ని తెరిచి మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తానన్నారు. తనను గెలిపిస్తే గంగావతిని వీడి బళ్లారికి వెళతానంటూ ప్రత్యర్థులు చెబుతున్న తప్పుడు మాటలను పట్టించుకోవద్దన్నారు. తాను గంగావతిలోనే స్థిరనివాసం ఉండేందుకు ఇంటిని కూడా కొనుగోలు చేశానన్నారు. ఇక్కడి నుంచే తమ పార్టీ కార్యకలాపాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామన్నారు. కేవలం అధికారం కోసం తాను పార్టీని స్థాపించలేదన్నారు. ప్రజాభివృద్ధి ఏంటో చేసి చూపుతానన్నారు. మెహపూజ్ అలీఖాన్, కేఆర్‌పీపీ జిల్లాధ్యక్షుడు మనోహర్ గౌడ, తాలూకా అధ్యక్షుడు వీరేష్ బలకుంది, జిలాన్‌బాషా, చౌడికి పాల్గొన్నారు. అంతకు ముందు యువకులు, ప్రజలు జేసీబీతో జనార్దన్‌రెడ్డికి గజమాలను సమర్పించి పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

అట్టహాసంగా కంప్లి ఉత్సవాలు షురూ



పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్ ఇతర ప్రముఖులు



ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు



ఊరేగింపులో పాల్గొన్న పగటివేషధారులు

కంప్లి: పట్టణంలో కంప్లి కళారతి, తుంగభద్ర ఆరతి ఉత్సవాలు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే గణేష్, వివిధ సంఘ సంస్థల ప్రముఖుల ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. వివిధ కళాకారుల బృందాలతో కోటె పంపాపతి ఆలయంలో పూజలు చేసి గండుగలి కుమారరామ కోటె ముఖ ద్వారం, మారెమ్మదేవి ఆలయం, నడివి మసీదు, అంబేడ్కర్ సర్కిల్ గుండా సోమేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న సోమప్ప చెరువులో తుంగభద్ర ఆరతివ్వడం ద్వారా సోమప్ప దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన వేదికకు ఊరేగింపు చేరింది.

క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం

క్రీడల్లో పాల్గొంటే మానసికోల్లాసంతో పాటు ఉత్తమ ఆరోగ్యం పొందవచ్చని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంప్లి ఉత్సవాల తొలిరోజున ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గెలుపు ఓటమి సహజం, ఓటమిని గెలుపునకు సోపానంగా భావించాలని సూచించారు. అనంతరం వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ గౌసియాబేగం, జిల్లా యువజన సేవా క్రీడా శాఖ సహాయక డైరెక్టర్ హరిసింగ్ రాథోడ్, తాలూకా పీఈటీ కే.ఎర్రిస్వామి, టీపీ ఈఓ కేఎస్.మల్లనగౌడ, మున్సిపల్ ముఖ్యాధికారి డాక్టర్.శివలింగప్ప, రామసాగర వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

వైభవంగా గరుడోత్సవం

కోలారు : అమ్మవారి పేటలోని వరదరాజస్వామి ఆలయంలో స్వామి కళ్యాణోత్సవం, గరుడోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి అర్చకులు మురళి రామానుజం, వరదరాజ్, పార్థసారధి తదితరులు విశేష పూజలు నెరవేర్చారు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణోత్సవం, గరుడోత్సవాన్ని వీక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

కోలారు : తాలూకాలోని కొండరాజనహళ్లి జీపీలోని విజయనగరలో రూ.10 లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు పనులను పర్యవేక్షించి నాణ్యతగా చేయించాలని సూచించారు. నాణ్యత లేకుంటే అధికారులదే బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, జీపీ అధ్యక్షురాలు కె నాగరత్న బాబు, సభ్యుడు విజయనగర మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం వెల్లడించని డాక్టర్‌కు రూ.11 లక్షల జరిమానా

హుబ్లీ: వైద్య పరీక్షల్లో అంగవైకల్యం ఉందని సదరు తల్లిదండ్రులకు తెలియజేయని డాక్టర్‌కు జిల్లా ఫోరం రూ.11.10 లక్షల జరిమానా విధించింది. వివరాలు.. ధార్వాడ శ్రీనగర బావికట్టి ప్లాట్ నివాసి పరుశురామ గాట్గే భార్య ప్రీతి గర్భిణిగా ఉన్న 3వ నెల నుంచి 9 నెలల వరకు ధార్వాడలోని మాలమడ్డి ప్రశాంత్ నర్సింగ్ హోంలో గైనకాలజిస్ట్ డాక్టర్.సౌభాగ్య కులకర్ణి వద్ద పరీక్షలు చేయించుకున్నారు. 2018 జూలై 12 నుంచి 2019 జనవరి 8 వరకు 5 సార్లు ఆమెకు స్కానింగ్ జరిపి కడుపులో బిడ్డ బాగా పెరుగుతోందని, ఆరోగ్యంగా ఉందని సదరు డాక్టర్ తెలిపారు. 9వ నెలలో వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు ఆపరేషన్ ద్వారా కాన్పు చేయించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ క్రమంలో పరశురామ 2019 జనవరి 31న ఎస్‌జీఎం ఆస్పత్రిలో భార్యకు ప్రసవం చేయించారు. అప్పుడు జన్మించిన ఆడ శిశువు రెండు కాళ్లు లేకుండా అంగవైకల్యంతో జన్మించింది. దీంతో సదరు డాక్టర్ సౌభాగ్యపై పరశురామ ఫోరంలో ఫిర్యాదు చేశారు. కేసు విచారణకు స్వీకరించిన ఫోరం అధ్యక్షులు ఈశ్వప్పబూతే, సభ్యులు విశాలాక్షి బోళశెట్టి, ప్రభు హిరేమఠ డాక్టర్ సౌభాగ్య విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని నిర్ధారిస్తూ పైమేరకు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కుమ్మరులు అన్నింటా రాణించాలి

కేజీఎఫ్: ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్న కుమ్మర సముదాయం ఆర్థికంగా, సామాజికంగా, విద్యా పరంగా రాజకీయ రంగాలలో రాణించాల్సి ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం బంగారుపేట పట్టణంలో తాలూకా కుంబార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి అవకాశాలను సముదాయం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కోలారు జిల్లాలో కుమ్మర సముదాయ ప్రజలు అతి తక్కువగా ఉన్నారు, ఉత్తర కర్ణాటక ప్రాంతంతో పోలిస్తే జిల్లాలో కుమ్మర సముదాయానికి చెందిన వారు ఎంతో అభివృద్ధిలో ఉన్నారు. అయితే ఇంకా సమగ్ర అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. న్యాయవాది శ్రీనివాస్, ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడి హత్య

కేజీఎఫ్ : పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం రాత్రి నగరంలోని రాబర్ట్‌సన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు..హతుడిని నగరంలోని ఉరిగాంపేట నివాసి రాజేష్‌కుమార్(32) అనే వ్యక్తిగా గుర్తించారు. ఫుట్‌బాల్ మైదానంలో గతంలో జరిగిన గొడవలే హత్యకు కారణమై ఉంటాయని రాజేష్‌కుమార్ తల్లి పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశారు. ఆమె అంబేడ్కర్ నగర్‌లో ఉంటుండగా రాజేష్‌కుమార్ ఉరిగాంపేటలో నివాసం ఉంటున్నాడు. ఘటనా స్థలానికి ఎస్పీ ధరణీదేవి సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల ఆచూకీని కనుగొని, త్వరలో అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. రాబర్ట్‌సన్ పేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్కాలర్‌షిప్‌ల రద్దు ఖండనీయం

గంగావతి రూరల్: 2022–23 విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐఓ) కర్ణాటక శాఖ ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ పీర్ తెలిపారు. ఆయన శనివారం నగరంలోని పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు వార్షిక ఉపకార వేతనం అందించడం ప్రభుత్వ ప్రాథమిక విధి అన్నారు. అందువల్ల విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలని పట్టుబట్టారు. జిల్లాధ్యక్షులు అబుబకర్ బెళగేరి, కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: నగరంలోని 17వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి భూమిపూజ చేశారు. శనివారం ఆయన కార్పొరేటర్ వన్నప్ప, అధికారులతో కలిసి ఆంజనేయ స్వామి నగర సమీపంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం మాట్లాడారు. నగరంలో అన్ని కాలనీల్లో దశల వారీగా సీసీ రోడ్లు వేస్తామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఆర్‌పీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయంలో పూజ చేస్తున్న గాలి లక్ష్మీ అరుణ తదితరులు

సాక్షి,బళ్లారి: కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) నూతన జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ నగర అసెంబ్లీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ శనివారం ప్రారంభించారు. ఆమె కుమారస్వామి గుడి సమీపంలోని వీరనగౌడ కాలనీలో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించించి మాట్లాడారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా గాలి జనార్దనరెడ్డి చేసిన జిల్లా అభివృద్ధిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఓఎంసీ డైరెక్టర్ బీ.వీ.శ్రీనివాసరెడ్డి, ప్రముఖులు పరమేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోనాళ్ రాజశేఖర గౌడ, నాయకులు దమ్మూరు శేఖర్, నరాల రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలి



స్కెచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: నగరంలో అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన శనివారం 34వ వార్డులో రూ.2.51 కోట్లతో సీసీ రోడ్లు, పాఠశాల గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు లలిత, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ సందర్శనతో మానసిక ప్రశాంతత

మాలూరు : ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. శనివారం తాలూకాలోని అరళేరిలో నూతనంగా నిర్మించిన యల్లమ్మ దేవి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, హోమం, హవన పూజల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రజల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించడం హర్షణీయమన్నారు. నిత్యం దేవతా కార్యక్రమాల్లో పాల్గొంటే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యుడు జీఈ రామేగౌడ, హూడి విజయకుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీతో ఎన్నికల లబ్ధికి కాంగ్రెస్ యత్నం

కోలారు : డీసీసీ బ్యాంకును కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకుంటోందని ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ డీసీసీబీ నుంచి మహిళా సంఘాలకు రుణాలిస్తూ ప్రలోభ పెడుతోందన్నారు. జిల్లాలో మూడు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఉన్నా రుణాల పంపిణీకి కేవలం కాంగ్రెస్ నాయకులనే డీసీసీబీ అధ్యక్షుడు గోవిందగౌడ ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమమైన రుణాల పంపిణీలో ప్రోటోకాల్‌ను పాటించడం లేదన్నారు. డీసీసీబీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డీసీసీబీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి డీసీసీబీపై చర్యలు తీసుకోవాలన్నారు. జేడీఎస్ నాయకులు సీఎంఆర్ శ్రీనాథ్, బాలాజీ చెన్నయ్య పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనను పెంపొందించాలి

శ్రీనివాసపురం : పిల్లల్లో సృజనశీలతను పెంచడానికి అభ్యసన పండుగలను తరచుగా నిర్వహించాలని డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం తాలూకాలోని మదనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి అభ్యసన పండుగ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యసన పండుగలు పిల్లల్లో ఆసక్తిని పెంచుతాయన్నారు. పాఠాలు నేర్చుకోవడానికి నిరాసక్తంగా ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తాయన్నారు. కౌశల్య అభివృద్ధికి కూడా దోహదపడతాయన్నారు. బీఈఓ కన్నయ్య, సమగ్ర శిక్షా అధికారి మోహన్‌బాబు, మధ్యాహ్న భోజన అధికారి తిమ్మరాయప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్యాక్టరీలో చోరీ.. నలుగురు అరెస్టు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా బాశెట్టిహళ్లి పారిశ్రామికవాడలోని ఆదిత్య ఆటో ప్రొడక్ట్ అండ్ ఇంజినీరింగ్‌ఫ్యాక్టరీలో తామ్రం బాక్సుల చోరీకి గురైన కేసులో దొడ్డ రూరల్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసారు. పట్టుబడ్డ నలుగురు నిందితులు దొడ్డ పట్టణ నివాసులని, ఇంకా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఈనెల 6న ఫ్యాక్టరీలో లక్షల విలువైన తామ్రం బాక్సులను అపహరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

చిన్నారి మృతి కేసులో మేల్ నర్స్ సస్పెండ్

మైసూరు: అంబులెన్స్‌లో సరైన చికిత్స అందక నాలుగు రోజుల చిన్నారి మృతి చెందిన ఘటనకు సంబంధించి మేల్‌నర్సును అధికారులు సస్పెండ్ చేశారు. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బుండనమాల గ్రామానికి చెందిన షీలా, మహాదేవ దంపతులు తమ నాలుగు రోజుల చిన్నారికి అనారోగ్యంగా ఉండటంతో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆలస్యంగా రావడంతో బైక్‌పై వెళ్తుండగా దారి మధ్యలో అంబులెన్స్‌లో ఎక్కారు. విధుల్లో ఉన్న మేల్ నర్సు మహేశ్ చిన్నారికి చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చేశారని, ఆక్సిజన్ ఉన్నా సకాలంలో అందివ్వ లేదనే ఆరోపణ ఉంది. దీంతో అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు

శివాజీనగర: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 9న ఈజీపుర ప్రధాన రోడ్డులో సంఘటన చోటు చేసుకుంది. వివరాలు... బిహార్‌కు చెందిన ఓ కుటుంబం వివేక నగర పరిధిలో నివాసం ఉంటోంది. ఆ కుటుంబానికి చెందిన 8 ఏళ్ల బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఓ మెకానిక్ షాప్‌లో పనిచేసే యువకుడు బాలికను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తప్పించుకుని వచ్చి విషయం తల్లికి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమెదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు.

అయ్యప్ప ఆలయానికి ఎమ్మెల్యే విరాళం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

చింతామణి: తాలూకాలోని సంతకల్లహళ్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి తన వంతు సాయంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి రూ. 2.50 లక్షల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. యువ జనతాదళ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో అన్నదానం



శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలోని సాగర పట్టణంలో మూడేళ్లకు ఒకసారి జరిగే మారికాంబ అమ్మవారి జాతర ఘనంగా సాగుతోంది. రోజూ వచ్చే వేలాది మంది భక్తులకు నిత్యాన్నదానం చేస్తున్నారు. శనివారం జాతరకు వచ్చిన భక్తులకు శ్రీ మారికాంబ జాతర సమితి ఆధ్వర్యంలో అన్న వితరణ చేశారు. సుమారు 8 నుంచి 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు.

కార్మికుడు దుర్మరణం

మైసూరు: బైక్ అదుపుతప్పి వంతెనకు ఢీకొనడంతో కార్మికుడు మృతి చెందిన ఘటన చామరాజ నగర జిల్లా హనూరు తాలూకా ఎల్లెమాళ గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడిని మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా చిదణ్ణ (30)గా గుర్తించారు. ఇతను హనూరు పట్టణంలో సీసీ రోడ్డు పనులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా వేగానికి అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న వంతెనను ఢీకొన్నాడు. బైక్ వెనుక కూర్చొన్న మరో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోషకాల ఖజానా దుంపలు




మేళాలో గెనుసుగడ్డల రకాలను ప్రదర్శిస్తున్న కలెక్టర్ రాజేంద్ర తదితరులు, భారీ దుంపలను ఆశ్చర్యంగా తిలకిస్తున్న సందర్శకులు, ప్రదర్శనలో ఔషధ మొక్కలు

- మైసూరులో గెనుసుగడ్డలు, కంద మేళా

మైసూరు: రాచనగరంలో రెండు రోజుల చిలగడ దుంపల, కంద దుంపల ప్రదర్శన శనివారం మొదలైంది. నంజరాజు బహద్దూరు భవనంలో ఏర్పాటైన మేళాను కలెక్టర్ కేవి రాజేంద్ర పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిలగడ దుంపలు, కంద దుంపలతో పాటు వివిధ రకాల దుంపలు ఈ మేళాలో అందుబాటులో ఉన్నాయని, ఇవి మన భూముల్లో నుంచి వచ్చిన అమూల్యమైన సంపద అని అన్నారు. ప్రకృతి విపత్తులు, కరువు సమయాల్లో ఈ దుంపలు ఆహారంగా మన జీవితాన్ని కాపాడే సంజీవని అని చెప్పారు. ఈ దుంప పంటలను సాగు చేసిన రైతులకు ఎప్పటికీ నష్టం రాకుండా లాభాలను ఇవ్వడం ప్రత్యేకత అని తెలిపారు.

మన సంస్కృతీ సంప్రదాయమైన ఈ ఆహార దుంపల గురించి మన ముందు తరాల వారికి తెలిసేలా చేయాలని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పలు రకాల గెనుసు, కందతో పాటు గడ్డ పంటలను ప్రదర్శనలో ఉంచారు. నోరూరించే చిరుతిండ్లు, ఔషధ మొక్కలు, పండ్ల రసాల విక్రయాలు కూడా నిర్వహించారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరు కావాలి

బొమ్మనహళ్లి: ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు బెంగళూరు దక్షిణ ఎంపీ, బీజేపీ జాతీయ యువమోర్చ అధ్యక్షుడు తేజస్వీసూర్య సూచించారు. శనివారం నగరంలోని బొమ్మనహళ్లి అగర గ్రామంలో ఉన్న అగర ప్రభుత్వ పబ్లిక్ స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విద్యార్థులకు పరీక్షల ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆత్మస్థైర్యం పెంచడం కోసం బెంగళూరు దక్షిణ ఎడ్యుకేషన్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఉచితంగా గైడ్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో తాము చదువుకునే సమయంలో పరీక్షలు అంటే భయపడేవారమని, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, స్థానిక నాయకులు తిమ్మారెడ్డి, నరసింహమూర్తి, కృష్ణప్ప యాదవ్‌తో పాటు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు గైడ్లను అందజేసిన దృశ్యం

నాణ్యమైన వైద్యం అందివ్వాలి

- మంత్రి మాదుస్వామి

తుమకూరు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందజేయాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయకూడదని మంత్రి మాదుస్వామి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. శనివారం తుమకూరు నగరంలోని శ్రీ సిద్దార్థ మెడికల్ కళాశాలలో వైద్యుల 30వ రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోగులు వైద్యం కోసం వచ్చినప్పుడు సరైన వైద్యం చేయకుండా మరో చోటికి రెఫర్ చేయకూడదని, తప్పనిసరి పరిస్థితుల్లోనే తప్ప రోగిని మరోచోటకి పంపకూడదన్నారు. కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను తెగించి ఎంతో మందిని కాపాడారని వారు దేవుళ్లతో సమానమని అన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

యశవంతపుర: కారవార పట్టణంలోని రవీంద్రనాథ్ ఠాగూరు తీరంలో కోస్ట్‌గార్డ్‌కు చెందిన హెలికాప్టర్ శనివారం అత్యవసరంగా తీరం వద్ద దిగింది. దీంతో అక్కడే సేద తీరుతున్న పర్యాటకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంపై తక్కువ ఎత్తులో తిరిగి రవీంద్రనాథ్ ఠాగూరు తీరం వద్ద ఖాళీ ప్రదేశంలో ల్యాండైంది. కొద్దిసేపటి తరువాత అక్కడ నుంచి వెళ్లిపోయింది. కలెక్టర్ కార్యాలయంపై చక్కర్లు కొట్టడంతో భయపడిపోయారు. శిక్షణలో భాగంగా హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు కోస్ట్‌గార్డ్ సిబ్బంది తెలిపారు.

రాళ్లతో దాడి..

చేపలు పట్టడానికి వెళ్లిన మంగళూరు మత్స్యకారులపై తమిళనాడు మత్స్యకారులు రాళ్లతో దాడి చేశారు. మంగళూరుకు చెందిన మత్స్యకారులు ఎనిమిది బోట్లలో తమిళనాడు కన్యాకుమారి వద్దకు వెళ్లారు. తమిళ మత్స్యకారులు తమ పరిధిలోకి వచ్చారంటూ మంగళూరు బోటును అడ్డుకున్నారు. 10 బోట్లలో కర్ణాటక వారిని చుట్టు ముట్టి రాళ్లతో దాడి చేశారు. కొందరికి గాయాలైనట్లు మంగళూరుకు సమాచారం అందింది.

బార్‌లో వ్యక్తి దారుణ హత్య



కృష్ణరాజపురం: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి నగరంలోని వర్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అలసనహళ్లి మెయిన్ రోడ్డులో ఉన్న బార్‌లో ఈ ఘటన జరిగింది. మునియప్ప (45) హత్యకు గురైన వ్యక్తి, శ్రీధర్, మునియప్ప ఇద్దరు పరిచయస్తులే. శుక్రవారం రాత్రి ఇద్దరు మద్యం తాగడానికి బార్‌కు వచ్చారు. మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శ్రీధర్ వెంట తెచ్చుకున్న వేటకొడవలితో మునియప్పను నరికి పారిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

పాతకక్షలతో స్నేహితుడి...


హత్యకు గురైన శరత్

కృష్ణరాజపురం: పాతకక్షలతో స్నేహితుడిని చాకుతో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన నగరంలోని కోణనకుంటెలో చోటు చేసుకుంది. హతుడిని శరత్‌కుమార్ (25)గా గుర్తించారు. శరత్‌కుమార్, లోకేశ్ స్నేహితులు. ఇద్దరి మధ్య డబ్బులు లావాదేవీలు ఉన్నాయి. ఈ విషయంగా గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన లోకేశ్, శరత్‌కుమార్‌పై చాకుతో పొడిచి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అదాలత్‌లో మళ్లీ ఒక్కటైన 14 జంటలు

తుమకూరు: తుమకూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు విచారణ జరిపారు. విడాకుల కోసం వచ్చిన సుమారు 14 జంటలకు నచ్చజెప్పి ఒక్కటి చేశారు. భార్యభర్తల మధ్య ఉన్న గొడవలు, ఆర్థిక ఇబ్బందులు ఇలా అనేక సమస్యలతో ఈ జంటలు విడిపోయి విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. విడిపోతే వచ్చే కష్ట నష్టాలను వివరించి కలిసి జీవించాలని నచ్చజెప్పారు.

స్నాచర్లపై తిరగబడ్డ వృద్ధురాలు

దొడ్డబళ్లాపురం: తన మెడలో గొలుసు లాక్కెళ్లాలని ప్రయత్నించిన చైన్ స్నాచర్లపై వృద్ధురాలు తిరగబడ్డ సంఘటన దొడ్డ తాలూకా గుండంగెరె వద్ద చోటుచేసుకుంది. హొసకోటకు చెందిన లక్ష్మమ్మ (65) అనే వృద్ధురాలు గుండంగెరె గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లక్ష్మమ్మ మెడలో మాంగల్యం చైను లాక్కెళ్లడానికి ప్రయత్నించారు. అయితే లక్ష్మమ్మ తన మాంగల్యాన్ని కాపాడుకోవడానికి దుండగులతో పోరాడింది.

దీంతో రెచ్చిపోయిన దుండగులు లక్ష్మమ్మపై చెట్టుకొమ్మ తీసుకుని దాడిచేసి మాంగల్యం చైను లాక్కుని పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మమ్మను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. హొసహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎస్‌డీపీఐని నిషేధించలేరు

యశవంతపుర: ఎస్‌డీపీఐని నిషేధించటం బీజేపీకి సాధ్యంకాదని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఫ్సర్ కోడ్లిపేట తెలిపారు. బీజేపీ నాయకులను ప్రజలు కోతులుగా భావిస్తున్నారని చెప్పారు. అబద్ధాలు చెప్పి ప్రజలను దూరం చేయటం సాధ్యం కాదన్నారు. రానున్న ఎన్నికలు సావర్కర్, టిప్పుల మధ్య జరుగుతాయని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. బీజేపీ అధికారంలో జరిగిన అభివృద్ధిపై ఎన్నికలను ఎదుర్కోలేక పోతుందని ఆరోపించారు. ఆ ధైర్యం బీజేపీ నాయకులకు లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. సత్తా ఉంటే ఎస్‌డీపీఐని నిషేధించాలని సవాల్ విసిరారు.

లోక కల్యాణార్థం ఎమ్మెల్యే పూజలు

చింతామణి: లోక కల్యాణార్థం చింతామణి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దంపతులు బైపాస్ రోడ్డులోని జేకే భవనంలో శనివారం వేద పండితులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తాలూకాలోని వేలాది మందికి అన్నదానం చేశారు.

జోరుగా ఎద్దుల జాతర


ఎద్దులను తీసుకువచ్చిన రైతులు

తుమకూరు: తుమకూరు నగరంలోని సిద్ధగంగ జాతర మహోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఎద్దుల జాతర జోరుగా సాగుతోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి రైతులు ఎద్దులను పెద్ద ఎత్తున తీసుకుని వస్తున్నారు. పశువులకు చర్మ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో జాతర రద్దు చేశారు. అయినా కూడా రైతులు సంప్రదాయాలను విడిచి పెట్టేది లేదని పెద్ద సంఖ్యలో ఎద్దులను జాతరకు తీసుకు వచ్చారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్, ఇద్దరు దుర్మరణం


రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

తుమకూరు: టిప్పర్ లారీ బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం తుమకూరు జిల్లా శిర తాలూకా హులికుంటె సమీపంలోని దొడ్డబాణగారె, ఆంధ్రప్రదేశ్ హేమావతి మధ్య జరిగింది. మృతులను చిక్కహులికుంటె గ్రామానికి చెందిన అనిల్ (28), అమరాపుర గ్రామానికి చెందిన శ్రీధర్ (26)గా గుర్తించారు. చిరు వ్యాపారులైన వీరు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

హోసూరు వార్తలు..

ట్రాక్టర్ ఢీకొని బైకిస్టు మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో సేలం వ్యక్తి మృతి చెందిన ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు సేలం జిల్లా మల్లూరు గ్రామానికి చెందిన దిలీప్ (23), మిత్రుడు పెరుమాళ్ (22)లు కలిసి సొంతపనిపై ద్విచక్రవాహనంలో కావేరిపట్టణానికి వెళ్లారు. క్రిష్ణగిరి – ధర్మపురి జాతీయ రహదారి హనుముత్తన్ కొటాయ్ వద్ద ట్రాక్టర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన దిలీప్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పెరుమాళ్‌కు క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గర్భిణి ఆత్మహత్య

కెలమంగలం: అనారోగ్యంతో బాధపడుతూ గర్భిణి ఆత్మహత్య చేసుకొన్న ఘటన కెలమంగలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలకోడు సమీపంలోని వేడంబట్టి గ్రామానికి చెందిన అంజల (27)కి కెలమంగలం సమీపంలోని అగ్గొండపల్లికి చెందిన గోవిందరాజ్‌తో గత 9 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఆరునెలల కిందట ఆమె మళ్లీ గర్భం దాల్చింది. కొన్నిరోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఈమెను ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకొని ఇంటికి తిరిగి వచ్చారు. శుక్రవారం రాత్రి అంజల ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేశారు.

విషపూరిత గడ్డి తిని 25 గొర్రెలు మృతి

తుమకూరు: విషపూరిత గడ్డి తిని 25 గొర్రెలు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా హెమ్మరగహళ్లిలో చోటుచేసుకుంది. తుమకూరు జిల్లా శిర తాలూకా హొలికుంటె సమీపంలోని దొడ్డబాణగెరె గ్రామానికి చెందిన గీతమ్మ గొర్రెలను మేపడానికి మైసూరు జిల్లాకు వలసపోయింది. అక్కడ విషపూరిత గడ్డి తిని 25 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న శిరా ఎమ్మెల్యే రాజేశ్ గౌడ, హెచ్‌డీకోటె ఎమ్మెల్యే అనిల్‌కు ఫోన్ చేసి తక్షణం వైద్యం అందివ్వాలని కోరారు. బాధితురాలి పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గీతమ్మను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే రాజేశ్‌గౌడ తెలిపారు.

శిరలో వాహన తనిఖీలు

తుమకూరు: తుమకూరు జిల్లా శిర పట్టణంలో శనివారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణ సీఐ ప్రకాశ్ నేతృత్వంలో సిబ్బంది మధుగిరి, తుమకూరు రోడ్లలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వాహనాలను పట్టుకుని జరిమానా విధించారు. కళాశాల విద్యార్థుల బైక్‌ను సీజ్ చేశారు.

వీరగల్లుస్వామి కుంభాభిషేకం


స్వామి ఉత్సవమూర్తి

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితి జే. కారుపల్లి పంచాయతీలోని వెంకటాపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన వీరగల్లుస్వామి ఆలయ కుంభాభిషేకోత్సవం ఘనంగా జరిగింది. గత రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజలతో పాటు గణపతి హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించి మహా కుంభాభిషేకోత్సవం జరిపారు. బీజేపీ రాష్ట్ర ఎస్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి పాపణ్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో తీర్థ ప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు. వెంకటాపురం, జే.కారుపల్లి, కామనపాళ్యం, జాకీర్‌శ్రీరామపురం తదితర చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే


కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే వై. ప్రకాష్

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దీపక్ జేకప్‌ను శనివారం హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ కలిసి జ్ఞాపిక అందజేసి అభినందించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు కృషి చేయాలని కోరారు. హోసూరు ఎమ్మెల్యే వెంట బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్ ఉన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని హోటళ్లలో ఆహార భద్రతశాఖ అధికారులు శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారి ముత్తుమారియప్ప నేతృత్వంలో సిబ్బంది పలు హోటళ్లలో చెడిపోయిన చికెన్, ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వివిధ హోటళ్లలో ఆరు కిలోల చికెన్, చేపల కూర స్వాధీనం చేసుకున్నారు. ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హోటళ్ల యాజమాన్యాలను అధికారులు హెచ్చరించారు.

రియల్టర్ కిడ్నాప్

హోసూరు: రియల్టర్‌ను కిడ్నాప్ చేసిన ఘటన కందికుప్పం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా కందికుప్పం సమీపంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన బాబు (63) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇతనితో పాటు పాండిచ్చేరికి చెందిన శంకర్, శక్తివేల్ కూడా రియల్టర్లుగా పనిచేస్తున్నారు. వీరి వద్ద బాబు రూ. 5 లక్షలు అప్పుగా తీసుకొన్నాడు. తీసుకొన్న అప్పును తిరిగి చెల్లించకపోవడంతో శుక్రవారం సాయంత్రం కారులో కిడ్నాప్ చేశారు. కిడ్నాప్ విషయాన్ని బాబు భార్య రాజేశ్వరికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె భయపడి కందికుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

నీటి పథకం పనుల పరిశీలన

హోసూరు: జిల్లాలోని పెద్దదాళపల్లి, గంగలేరి, వేపనపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న సంయుక్త తాగునీటి పథక పనులను కలెక్టర్ దీపక్ జేకప్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రిష్ణగిరి జిల్లాలో రూ. 122 కోట్ల ఖర్చుతో పనులు జరుగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పనులు పూర్తైనట్లు తెలిపారు. హోసూరు తాలూకాలోని దేవసానపల్లి గ్రామపంచాయతీ, నాగొండపల్లి పంచాయతీ, కెలమంగలం సమితిలోని రాయకోట తదితర గ్రామపంచాయతీల్లో ఈ పథక పనులు జరుగుతున్నాయని, త్వరగా పూర్తిచేసి ఉపయోగంలోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వందనా కార్గ్, అరుళలగన్, రాజశేఖర్, శివమురుగన్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో రాణించాలి



బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి

కృష్ణరాజపురం: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని కేఆర్‌పురం ఎమ్మెల్యే, నగరాభివృద్ధి శాఖ మంత్రి బైరతి బసవరాజ్ అన్నారు. శనివారం నగరంలోని కృష్ణరాజపురం రామ్మూర్తి నగరలో ఎన్ఆర్ఐ లేఔట్‌లో ఉన్న జూబ్లీ పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ... స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో క్రీడాకారులు పాల్గొని సత్తా చాటాలన్నారు.

చుకుబుకు రైలు రాక


కే రామపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రైలు

పావగడ: 12 ఏళ్ళుగా లక్షలాది మంది వేయి ఎదురు చూస్తున్న రాయదుర్గం–తుమకూరు రైలు బండి ఎట్టకేలకు శనివారం పావగడకు వచ్చేసింది. పావగడ నుంచి కళ్యాణదుర్గానికి వెళ్ళే రహదారిలోని కే రామపురం గ్రామంలో నిర్మించిన రైల్వేస్టేషన్‌కు ప్యాసింజర్ రైలు కూత వేసుకుంటూ చేరుకుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రైల్వే అధికారులు రైలుకు స్వాగతం పలికారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది గ్రామ ప్రజలు రైలు చూడడానికి వచ్చారు. స్థానిక రైల్వే లైన్ పనులు కే.రాంపురం గ్రామం వరకు 80 శాతం పూర్తయ్యాయి. మడకశిర, మధుగిరి, కొరటగెరె రైల్వే పనులు మందకొడిగా సాగుతుండడంతో తుమకూరుకు చేరుకోడానికి మరింత ఆలస్యమయ్యే అవకాశముంది.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

తుమకూరు: తుమకూరు నగరంలోని శిర రోడ్డులో ఉన్న శ్రీదేవి మెడికల్ కళాశాల, పరిశోధన ఆస్పత్రి ఆవరణంలో వెలసిన శ్రీదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీదేవి విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్. హులినాయకర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

మధుమేహ బాధితులను ఆదుకోండి

మైసూరు: మైసూరులోని కృష్ణరాజ నియోజకవర్గంలో మధుమేహ వ్యాధితో ఎంతో మంది బాధపడుతున్నారని, వారికి సరైన వైద్యం అందివ్వాలని ఎమ్మెల్యే రామదాసు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మాండవియాకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఢిల్లీలో మాండవియాను కలిసి వినతిపత్రం అందజేశారు.

చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: చెరువులు, నీటికుంటల వల్ల భవిష్యత్‌లో నీటి సమస్య రాదని, నాడు చెరువుల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని లేక్ మ్యాన్ ఆనంద మల్లిగెవాడు తెలిపారు. శనివారం నగరంలోని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం పరిధిలోని హెబ్బగోడి నగరసభ పరిధిలో ఉన్న ఆనంతసాగరలో 45 ఎకరాల స్థలంలో చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడుతూ... నేడు అవసరాల కోసం చెరువులను కబ్జా చేస్తున్నారని, ఇది పెను ప్రమాదమన్నారు. చెరువులో నీటిని నింపి భూగర్భ జలాలను వృద్ధి చేసి నీటి సమస్య రాకుండా చేయడం జరుగుతుందన్నారు.

సజీవ వర్ణచిత్రాలు

బనశంకరి: ధారవాడకు చెందిన అమర్‌రాజు కాళే గీసిన పెయింటింగ్స్‌ను చూస్తే కళాప్రియులు మక్కువ చెందుతారు. వర్ణచిత్రాలు అంత సజీవంగా ఉట్టిపడుతూ ఉంటాయి. మెకానికల్ డిప్లొమా చదివిన అమర్‌రాజు కాళే చదువు ఒకటైతే ప్రవృత్తి మాత్రం మరొకటి. కళలపై ఆసక్తితో ధారవాడలో చిత్రకళలో మెళకువలను నేర్చుకుని ఆయిల్, యాక్రిలిక్, పోర్ట్రైట్‌లో అద్భుతమైన పెయింటింగ్స్‌ను గీయడంలో పేరు సంపాదించారు. అమరాజుకాళే గీసిన కళాకృతులకు దేశవిదేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది.రాధాకృష్ణులు, గణనాథుడు, ప్రముఖ వ్యక్తులు, భరతనాట్యం, ప్రకృతి దృశ్యాలను గీయడంలో సిద్ధహస్తుడు. ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అమర్‌రాజు కాళే ప్రతిభకు చోటు లభించింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేసింది.


చిత్రకారుడు అమర్‌రాజు కాళే




ఆకట్టుకుంటున్న రాధాకృష్ణుల పెయింటింగ్


బాపట్ల జిల్లా రెడ్లపాలెంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి


విజయనగరం జిల్లా కొత్తవలసలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గడప గడపకు మన ప్రభుత్వం


ఏలూరు జిల్లా పెదగొన్నూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు

చిట్టి రోబో.. - ద లాయర్

ట్రాఫిక్ చలానా కేసులను వాదించబోతున్న రోబో

- కృత్రిమ మేధస్సుతో రోబో లాయర్‌ను తయారు చేసిన 'డునాట్ పే' సంస్థ
- దీని వల్ల కేసులు త్వరగా పరిష్కారమయ్యే అవకాశముందని వెల్లడి
- సహేతుక కారణాలతో వస్తే ఉచితంగా వాదిస్తామని స్పష్టీకరణ
- ఈనెల 22న తొలి కేసు వాదించనున్న రోబో లాయర్

రోబోలు.. డ్యాన్సులు చేస్తున్నాయి.. ఫుట్‌బాల్ ఆడుతున్నాయి.. ఆకలిగా ఉందని హోటల్‌కు వెళ్తే నచ్చినవన్నీ వేడివేడిగా వడ్డించేస్తున్నాయి.. పాటలు పాడుతున్నాయి.. పాఠాలూ చెబుతున్నాయి.. చివరకు చైనాలో ఓ కంపెనీకి సీఈవోగా కూడా వ్యవహరిస్తున్నాయి. ఇదే క్రమంలో ఇప్పుడు 'వకీల్' అవతారంలో ప్రజల ముందుకు రాబోతోంది సరికొత్త రోబో. నిజమే.. యువరానర్.. నా క్లైయింట్ ఏ తప్పూ చేయలేదంటూ కోర్టులో వాదించబోతోంది. ఈ విషయాన్ని రోబో లాయర్ తయారీ సంస్థ డునాట్ పే ప్రకటించింది. ఎలాంటి రుసుం లేకుండా ట్రాఫిక్ చలానా కేసుల్ని వాదించేందుకు దీన్ని తయారు చేసినట్లు వెల్లడించింది. ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు అమెరికా కోర్టులో ఈ రోబో లాయర్ మొదటిసారిగా ప్రత్యక్షమవ్వనుంది.



కె.జి.రాఘవేంద్రారెడ్డి
(సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

మనుషులు తయారు చేసిన అద్భుత ఆవిష్కరణ రోబో. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ.. రోబోల వినియోగం విస్తృతమవుతోంది. అన్ని రంగాల్లోకి కృత్రిమ మేధస్సు కలిగిన రోబోలు అడుగుపెట్టేస్తున్నాయి. ఇప్పుడు న్యాయస్థానంలోనూ తనకు ఎదురు లేదని నిరూపించేందుకు రోబో సిద్ధమవుతోంది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఈ రోబో లాయర్‌ను అమెరికాకు చెందిన డునాట్ పే అనే స్టార్టప్ కంపెనీ ప్రపంచానికి పరిచయం చేస్తోంది. ట్రాఫిక్ చలానాలకు సంబంధించిన కేసులన్నీ వాదించేలా ఈ రోబో పట్టు సాధించిందని సంస్థ వ్యవస్థాపకుడు జోషువా బ్రౌడర్ ప్రకటించారు.

2015 నుంచి పరిశోధనలు...

జోషువా బ్రౌడర్ 2015లో 'డునాట్ పే' అనే లీగల్ సర్వీసెస్ చాట్‌బాట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి రోబో లాయర్ తయారీపై పరిశోధనలు



చేస్తూ.. ఎట్టకేలకు దాన్ని ఆవిష్కరించారు. దీనికి శిక్షణ ఇచ్చేందుకు చాలా సమయం పట్టిందని బ్రౌడర్ చెబుతున్నారు. పరిమితికి మించి వేగంగా వాహనాన్ని నడిపిన రెండు కేసులను ఈ రోబో లాయర్ తొలిసారిగా వాదించనుందని ప్రకటించారు. ఇది స్మార్ట్‌ఫోన్ సహాయంతో పనిచేస్తుందని చెప్పారు. కోర్టులో వాదన విన్న తర్వాత.. కౌంటర్‌గా వాదించాల్సిన అంశాలను 'ఇయర్ ఫోన్' ద్వారా సూచిస్తుందని.. కేవలం రోబో లాయర్ చెప్పిన విషయాలను మాత్రమే ప్రతివాది కోర్టుకు విన్నవిస్తారని స్పష్టం చేశారు. దీని వినియోగం వల్ల వేగంగా కేసులు పరిష్కారమయ్యే అవకాశముందని.. కోర్టు ఖర్చులు చాలా వరకు తగ్గుతాయని చెప్పారు. సహేతుక కారణాలు చూపించిన వారికి ఉచితంగా సేవలందించేందుకు సిద్ధమని ప్రకటించారు.

చట్టం ఒప్పకుంటుందా?

వాద, ప్రతివాదనలు జరుగుతున్నప్పుడు న్యాయస్థానాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించకూడదని యూఎస్ సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో రోబోను వినియోగించడం సాధ్యమా అనే అంశంపై అందరిలోనూ సందేహాలు నెలకొన్నాయి. దీనిపై జోషువా స్పందించారు. 'డునాట్ పే' అనేది లీగల్ సర్వీసులకు సంబంధించిన ఆన్‌లైన్ చాట్ బాట్ అని స్పష్టం చేశారు. అందువల్ల న్యాయపరంగా వివాదం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూఎస్ సుప్రీంకోర్టులో లాయర్ రోబో చెప్పిన విషయాలను అక్షరం తప్పు లేకుండా చెప్పిన వారికి కోటి డాలర్లు బహుమతిగా ఇస్తానని జోషువా సవాల్ కూడా విసిరారు. భారతదేశంలోని చట్టాల ప్రకారమైతే రోబో లాయర్లను అనుమతించే అవకాశమే లేదని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. ఇందుకు ప్రస్తుతమున్న చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. అడ్వకేట్ చట్టం-1961 ప్రకారం రోబో లాయర్లను అనుమతించే ప్రొవిజన్ లేదని న్యాయవాది నమిత్ సక్సేనా పేర్కొన్నారు. న్యాయవాదులు ఏఐ ద్వారా వారికి అవసరమైన సమాచారాన్ని తీసుకునే వీలుందని న్యాయనిపుణుల అభిప్రాయపడుతున్నారు.

• తెలంగాణ

సాంకేతికతపై పట్టు సాధించాలి

ఐపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: మారుతున్న పరిస్థితుల్లో పోలీసింగ్‌లోనూ అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సైబర్ నేరాలు, నార్కో టెర్రరిజం, సాంకేతికత ఆధారంగా పెరుగుతున్న ఇతర నేరాల కట్టడికి పోలీసులు కూడా సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. పోలీస్‌శాఖలోని కానిస్టేబుల్ నుంచి డీజీపీ ర్యాంకు వరకు అధికారులంతా సాంకేతికతపై అవగాహన పెంచుకోవడంతోనే ఇది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో నిర్వహించిన 74వ రెగ్యులర్ రిక్రూటీ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల దీక్షాంత్ పరేడ్‌కు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 195 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను అందజేశారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని కట్టడి చేయడం.. జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతల సమస్యలను సమర్థంగా ఎదుర్కొన్నామన్నారు. 2047లో భారత దేశం వందవ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోబోతోందని, ఈ అమృతకాలంలో విధుల్లోకి వస్తున్న యువ అధికారులంతా దేశాన్ని పటిష్టంగా తీర్చిదిద్దడంలో తమవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్‌భల్లా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ప్రారంభోత్సవం వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయ భవన సముదాయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసుకుంది. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనుమతుల విషయంలో సీఎస్ శాంతికుమారి కేంద్ర ఎన్నికల సంఘంతో సంప్రదింపులు జరిపారు. వారి నుంచి వచ్చిన ప్రతి స్పందన ఆశాజనకంగా లేకపోవడంతో ఇప్పటికే ప్రకటించిన రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రారంభోత్సవ తదుపరి తేదీని తిరిగి ప్రకటిస్తామని పేర్కొంది.

కాంగ్రెస్ ప్లీనరీ ముసాయిదా కమిటీ ఏర్పాటు

సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఆలిండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) 85వప్లీనరీ సమావేశాలకు ముసాయిదా కమిటీతో పాటు వివిధ అంశాల్లో ఉప కమిటీలను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముసాయిదా కమిటీ చైర్మన్‌గా జైరాం రమేశ్, కన్వీనర్‌గా పవన్ ఖేరాతోపాటు మరో 21 మంది సభ్యులు ఉన్నారు. కాగా, ఇందులో ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డితోపాటు సీనియర్ నేత కొప్పుల రాజుకు అవకాశం కల్పించారు. రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ వ్యవహారాలు, రైతులు-వ్యవసాయం, సామాజిక న్యాయం-సాధికారత, యువత-విద్య-నిరుద్యోగం అంశాలపై ఉపకమిటీలు ఏర్పాటు చేశారు.

• తెలంగాణ

తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్

మజ్లిస్-ఎ-షబ్జాదేగనస్ సొసైటీ ప్రకటన

సనత్‌నగర్ (హైదరాబాద్): ఆసఫ్ జాహీ వంశం తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్ ఎంపికయ్యారు. ఈ మేరకు మజ్లిస్-ఎ-షబ్జాదేగన్ సొసైటీ ప్రతినిధులు శనివారం ప్రకటించారు. ఎనిమిదో నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ మృతి అనంతరం తమ కుటుంబ సంప్రదాయాల ప్రకారం తొమ్మిదో నిజాంను ఎంపిక చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు షెహజాదా మీర్ ముజ్తాబా అలీఖాన్, ఉపాధ్యక్షుడు మీర్ నిజాముద్దీన్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొయిజుద్దీన్ ఖాన్ వివరాలను వెల్లడించారు. 4,500 మంది నిజాం కుటుంబ సభ్యులతో కూడిన సొసైటీ పక్షాన తమ సమస్యలను ప్రభుత్వానికి సమర్థవంతంగా నివేదించగలరన్న పూర్తి విశ్వాసంతో తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్‌ఖాన్‌ను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. విదేశాల్లో ఉంటున్న నిజాం వారసులకంటే స్థానికంగా ఉంటూ తమ ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తినే తమ కుటుంబ పెద్దగా తాము ప్రకటించుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆసఫ్ జాహీ వంశపారంపర్యంగా వస్తున్న వస్తువులను సమావేశంలో ప్రదర్శించారు. వీటిని తొమ్మిదో నిజాంగా బాధ్యతలు చేపట్టే సమయంలో నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్‌కు అందజేస్తారు.

రూ.లక్షల విలువచేసే చేతికర్రలు...

ఆసఫ్ జాహీల వంశపారంపర్యంగా వస్తున్న చేతికర్రల విలువ వింటే నోరెళ్లబెట్టాల్సిందే. ఆనాటి నుంచి ఇప్పటి వరకు మూడు చేతికర్రలను భద్రంగా ఉంచుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టే నిజాంకు అందిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో ఒకటి మొదటి నిజాం ప్రభువు ప్రత్యేకంగా తయారు చేసుకున్నారు. నాణ్యమైన చెక్కతో ఫిరోజ్-హుస్సేనీ డైమండ్ పొదగబడిన ఈ కర్ర విలువ అక్షరాలా రూ.30 లక్షలు. పైభాగంలో గుండ్రని నోబ్ కలిగి చుట్టూరా 5 బ్రాస్ లైన్లతో ఉంటుంది. మరొకటి టిప్పు సుల్తాన్ నుంచి నిజాం ప్రభువులు పొందారు. రోజ్‌వుడ్‌తో వివిధ రకాల డిజైన్లతో దీనిని రూపొందించారు. దీని విలువ కూడా 30 లక్షల వరకు ఉంటుంది. ఇంకో చేతికర్ర తాజ్‌మహల్ సృష్టికర్త షాజహాన్‌నుంచి అందుకున్నారు. ఇది ఏనుగు దంతంతో రూపొందించింది. దీని విలువ రూ.15 లక్షలు ఉంటుందని సొసైటీ ప్రతినిధులు వివరించారు.

విద్యా దీవెనపై లోకేశ్ విసుర్లు

- పనికిమాలిన పథకం అంటూ విమర్శ
- చాలీచాలని డబ్బులతో తల్లిదండ్రుల అవస్థలు పడుతున్నారంటూ ఆరోపణ

సాక్షి, చిత్తూరు/శ్రీరంగరాజపురం: 'విద్యా దీవెనతో తల్లులను జగన్ మోసం చేస్తున్నారు. ఇదొక పనికిమాలిన పథకం. గతంలో ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యానికి నేరుగా ఫీజులు చెల్లించేది. జగన్ దీన్ని తల్లిదండ్రులపైకి నెట్టాడు. చాలీ చాలని డబ్బులిచ్చి తల్లిదండ్రులపై విద్యా భారాన్ని పెంచాడు. దీనివల్ల అనేక మందికి పిల్లల్ని చదివించే పరిస్థితి లేదు' అని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 16వ రోజు శనివారం శ్రీరంగరాజపురం మండలంలో సాగింది. ఉదయం ఎస్ఆర్ పురం హనుమాన్ ఆలయం విడిది కేంద్రంలో యాదవ సామాజిక వర్గంతో, తర్వాత దిగువ మెడవడ ఎస్టీ కాలనీ వాసులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం పిళ్లారికుప్పం, వెంకటాపురం గ్రామాల మధ్య వెంట నడుస్తున్న వారిని ఉత్సాహ పరిచేందుకు కొంత దూరం పరుగెత్తారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ పూర్తి చేసినా, సర్టిఫికెట్లు చేతికందక యువత నిరుద్యోగులుగా ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. అవగాహన లేని ముఖ్యమంత్రి వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని ధ్వజమెత్తారు. వైసీపీ పథకాలన్నీ పేపర్లకే పరిమితమని విమర్శించారు. ఒక్క ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదని.. డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టులు ఇస్తానని మాట తప్పారన్నారు. బిహార్‌కు కూడా పెట్టుబడులు వస్తుంటే ఏపీకి మాత్రం రావడం లేదన్నారు. టీడీపీ హయాంలో బీసీలను అన్ని విధాలా ప్రోత్సహించామని చెప్పారు.

విశాఖ ఉక్కులో భారీ పేలుడు

9 మందికి తీవ్ర గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం
- నీటిలో ఒక్కసారిగా స్లాగ్ పడటంతో విస్ఫోటనం
- ఉలిక్కిపడ్డ ఉక్కు నగరం

ఉక్కు నగరం/గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం చోటుచేసుకున్న భారీ పేలుడుతో విశాఖ నగరం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఇనుము ఉత్పత్తిలో భాగంగా స్లాగ్ పాట్ వెళ్లే ట్రాక్‌లో అవాంతరాలు ఏర్పడ్డాయి. వాటిని తొలగిస్తుండగా దాని కిందనున్న నీటిలో వేడిగా ఉన్న స్లాగ్ (ఖనిజం నుంచి లోహాన్ని వేరు చేయగా మిగిలిన ద్రవం) పడింది. దీంతో భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ మేనేజర్ జె.జయకుమార్ (34), టెక్నీషియన్లు బి.ఈశ్వర్ నాయక్ (36), పండా సాహు (36), డిప్యూటీ జనరల్ మేనేజర్


క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు

థాయ్‌వాలా (55), కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.పోతయ్య (44), కె.శ్రీను (34), ఆర్.బంగారయ్య (34), ఆర్.సూరిబాబు (36), సీహెచ్.అప్పలరాజు (37) గాయపడ్డారు. శ్రీనుకు 90 శాతం, పోతయ్యకు 65 శాతం, డీజీఎం థాయ్‌వాలాకు 45 శాతం గాయాలైనట్టు వైద్యవర్గాలు తెలిపాయి. ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

ప్రమాదంలో గాయపడిన 9 మందిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పేలుడు సమాచారం అందుకున్న సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం సిబ్బంది క్షణాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్లాంట్ ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. డీసీపీ-2 ఆనంద్‌రెడ్డి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, స్టీల్ ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మహంతి తదితర ఉన్నతాధికారులు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. ఈ ఘటనతో ఉద్యోగ సంఘాల నాయకులు విస్మయానికి గురయ్యారు. ఉద్యోగులు పూర్తిగా కోలుకునేవరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కాగా, పేలుడు ధాటికి విభాగంలోని ఉత్పత్తి కొంతసేపు నిలిచిపోయింది. ప్రమాదం వల్ల మెషినరీ చాలావరకు దగ్ధమైంది. ఎలక్ట్రికల్ వస్తువులు కూడా కాలిపోయాయి. ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పరామర్శించారు.

న్యాయ వ్యవస్థకు బాబు క్షమాపణ చెప్పాలి

- గౌరవ పార్లమెంటు సభ్యులపైనా అనుచిత వ్యాఖ్యలా?
- చంద్రబాబు పనులు చూస్తే ఎవరు బ్రోకరో తెలుస్తుంది
- లోకేశ్ అడుగులు వేయలేకపోతున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత సుందర రామశర్మ



సాక్షి, అమరావతి: కోర్టులను కూడా మేనేజ్ చెయ్యొచ్చంటూ వ్యాఖ్యానించిన చంద్రబాబు న్యాయవ్యవస్థకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేత చుండూరు సుందర రామశర్మ డిమాండు చేశారు. టీడీపీ అధినేతకు శవ రాజకీయాలు చేయడం బాగా అలవాటని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయవ్యవస్థలో గౌరవప్రదమైన వ్యక్తి నిరంజన్‌రెడ్డి అని.. అలాంటి ఆయనపైనా చంద్రబాబు హేయంగా విమర్శలు చేశారన్నారు. కోర్టులను కూడా ప్రభావితం చేస్తారని చంద్రబాబు అంటున్నారంటే అది బాబుకు ఎంత అలవాటో తెలుస్తోందన్నారు. రామశర్మ ఇంకా ఏమన్నారంటే.. తీవ్ర నిరాశ, నిస్పృహలో బాబు మతితప్పి మాట్లాడుతున్నారు. గౌరవ పార్లమెంటు సభ్యులపైనా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఏ వ్యవస్థపైనా చంద్రబాబుకు గౌరవం లేదు. ఎంపీలపై చేసిన విమర్శలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలి. ఎంపీలు బ్రోకర్లా? ఏమిటా మాటలు? నిజానికి.. ఎన్టీఆర్ నుంచి సీఎం పదవిని, పార్టీని లాక్కున్న చంద్రబాబునాయుడు ఆ రోజు ఏ విధంగా వ్యవహరించాడో అందరూ చూశారు. ఆ తర్వాత ఓటుకు కోట్లు కేసు చూశాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో పూర్తిగా దిగజారి వ్యవహరించాడు. అసలు వ్యవస్థలను మేనేజ్ చేసి పబ్బం గడుపుకోవడమే ఆయనకు బాగా తెలుసు. పార్లమెంటు, అసెంబ్లీ దేవాలయాలు లాంటివి. వాటికి ఎన్నికయ్యే వారిని గౌరవించాలి. కానీ, రాజ్యసభకు ఎన్నికైన వారిని చంద్రబాబు బ్రోకర్లు అంటున్నారు. నిజానికి.. చంద్రబాబు ఇప్పటివరకు చేసిన పనులు చూస్తే అసలు బ్రోకర్ ఎవరో తెలుస్తుంది.

పాదయాత్ర ముగించాలన్న ఆలోచనలో ఉన్నారు

ఇక లోకేశ్‌ది పాదయాత్ర కాదు.. అది ఒక బూతుమాటల యాత్ర. తన తండ్రిపైనా, ఎల్లో మీడియాపైనా ఆక్రోశంగా ఉన్నారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌పై పిచ్చి విమర్శలు చేస్తున్నారు. లోకేశ్ అడుగులు వేయలేకపోతున్నారు. త్వరగా ముగించాలన్న ఆలోచనలో ఉన్నారు. చంద్రబాబూ అందుకు ఎదురుచూస్తున్నారు. పార్టీ శ్రేణుల్లోనూ అదే అభిప్రాయం ఉంది. మరోవైపు.. ఎంపీల ఎంపికలో సామాజిక న్యాయం పాటించిన పార్టీ వైఎస్సార్‌సీపీనే. పరిమళ్ నత్వానీతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని సీఎం జగన్ భావించి ఆయనను రాజ్యసభకు పంపించారు. కానీ, చంద్రబాబు మాదిరిగా డబ్బులు తీసుకోలేదు. అలాగే, మా పార్టీ నుంచి తొమ్మిది మంది రాజ్యసభ సభ్యులుంటే, వారిలో నలుగురు బీసీలు. మరి నువ్వెప్పుడైనా అలా బీసీలకు పదవులు ఇచ్చావా చంద్రబాబూ? వర్ల రామయ్యకు మొండిచెయ్యి చూపించావు. అదే నీకు, వైఎస్ జగన్‌కు ఉన్న తేడా? అన్ని కులాల వారు బాబు నైజం తెలుసుకున్నారు.

పద్దెనిమిదికి ముందే పెళ్లి!

కోవిడ్ కష్టకాలంలో దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు

- పెళ్లీడు రాకుండానే ఆడపిల్లలకు వివాహాలు...
- 2022లో పెళ్లయిన అమ్మాయిల్లో 18ఏళ్లు నిండనివారు 25.3 శాతం మంది
- అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 41.6 శాతం...
- యూనిసెఫ్ వెల్లడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపేసిన కోవిడ్... ప్రతి మనిషిని ఆరోగ్యపరంగా, ఆర్థికంగా కుంగదీసింది. ఉపాధినీ దెబ్బతీసింది. ఆ మహమ్మారి వ్యాప్తి తగ్గినా... దాని ప్రభావం మాత్రం సమాజంపై వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంది. మనుషుల ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేస్తూనే ఉంది. కోవిడ్ చేసిన గాయం కారణంగా అభద్రతాభావానికి గురవుతున్న తల్లిదండ్రులు తమ కుమార్తెలకు వయసుతో నిమిత్తం లేకుండా వెంటనే పెళ్లిళ్లు చేయాలనే భావనలోకి వచ్చారని యూనిసెఫ్ నిర్వహించిన సర్వేలో తేలింది. అందువల్లే దేశవ్యాప్తంగా 2022లో జరిగిన పెళ్లిళ్లలో 25.3శాతం మంది అమ్మాయిలు 18 ఏళ్లు నిండనివారే ఉన్నారని వెల్లడించింది. ఇందుకు కొన్ని కారణాలను ఈ సర్వేలో గుర్తించినట్లు తెలిపింది.

మొదటి స్థానంలో పశ్చిమబెంగాల్

పద్దెనిమిదేళ్ల వయసు నిండకముందే అమ్మాయిలకు వివాహాలు చేస్తున్న రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ తొలి స్థానంలో నిలిచింది. అక్కడ 41.6 శాతం బాల్యవివాహాలు నమోదయ్యాయి. ఆ తర్వాత స్థానాల్లో బిహార్ (40.8 శాతం), త్రిపుర (40.1శాతం), జార్ఖండ్ (32.2 శాతం), అస్సాం(31.8 శాతం), ఆంధ్రప్రదేశ్ (29.3 శాతం) ఉన్నాయి. జమ్మూ-కశ్మీర్‌లో అత్యంత తక్కువగా 4.5 శాతం, కేరళలో 6.3 శాతం చొప్పున 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేసినట్లు యూనిసెఫ్ గుర్తించింది.

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో బాల్యవివాహాల పరిస్థితి

మన రాష్ట్రంలో అత్యధికంగా ఉమ్మడి అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో 37.3 శాతం చొప్పున 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేసినట్లు గుర్తించారు. ఆ తర్వాత స్థానాల్లో ఉమ్మడి కర్నూలు (36.9 శాతం), గుంటూరు (35.4 శాతం), విజయనగరం (33.7 శాతం), చిత్తూరు (28.1 శాతం), తూర్పుగోదావరి (26.0 శాతం), వైఎస్సార్ కడప (25.6 శాతం), శ్రీకాకుళం (25.4 శాతం), విశాఖపట్నం (25.4 శాతం), కృష్ణా (25.3 శాతం), నెల్లూరు (23.8 శాతం), పశ్చిమగోదావరి (22.1 శాతం) చొప్పున 18 ఏళ్లలోపు బాలికలకు 2022లో వివాహాలు చేసినట్లు యూనిసెఫ్ వెల్లడించింది.

ప్రధాన కారణాలు ఇవీ...

- కోవిడ్ కారణంగా దాదాపు రెండేళ్లు పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. పది, ఇంటర్ చదువుతున్నవారు ఆన్‌లైన్ తరగతుల కారణంగా చదువులో రాణించలేకపోయారు. ఫలితంగా డ్రాపవుట్స్ పెరిగాయి.
- చదువు మధ్యలో ఆపేసిన ఆడపిల్లలు ఇంటి వద్దే ఉంటున్నారు.
- కరోనా రాకముందు వలస వెళ్లిన కుటుంబాలు తిరిగి సొంత గ్రామాలకు వచ్చేశాయి. నిరుద్యోగిత పెరగడంవల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎక్కువయ్యాయి.
- అందువల్ల అభద్రతాభావంతో పెళ్లీడు రాకపోయినా ఆడపిల్లలకు వివాహాలు చేస్తే బాధ్యత తీరిపోతుందని ఎక్కువ మంది తల్లిదండ్రులు భావిస్తున్నట్లు సర్వేలో గుర్తించినట్లు యూనిసెఫ్ ప్రకటించింది.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 12-2-2023

సండే స్పెషల్

ఇది పాదయాత్రల సీజన్.
దేశంలో అనేక యాత్రలు
సాగుతున్నాయి.
వాటి మతలబు వేరు.
కాని కర్ణాటకలో ఫిబ్రవరి 23న
200 మంది పల్లెటూరి యువకులు
పాదయాత్ర చేయనున్నారు.
దాని పేరు 'బహ్మచారిగళ పాదయాత్రె'
అంటే 'బ్రహ్మచారుల పాదయాత్ర'
మాండ్య జిల్లాలో గతంలో
ఆడపిల్ల భ్రూణ హత్యలు జరిగాయి.
ఇవాళ యువకులకు అక్కడ
వధువు కరువైంది.
బ్రహ్మచారులంతా డిప్రెషన్ బారిన పడ్డారు.
వారికి ఆశ కల్పించడానికి
దేవుని కొండ వరకూ
పాదయాత్ర చేయిస్తున్నారు.
ఆడపిల్ల ఎంత విలువైనదో
సిరి సమానమైనదో
తెలుసుకోవాల్సిన వాళ్లు
ఇంకా ఉన్నారు.
వారికి కనువిప్పు ఈ కథ.



ప్రతీకాత్మక చిత్రం

వధువు కోసం పాదయాత్ర

2003లో హిందీలో 'మాతృభూమి' అనే సినిమా వచ్చింది. మనీష్ ఝా దర్శకుడు. బిహార్‌లో ఆడపిల్ల పుడితే పాలల్లో ముంచి ప్రాణాలు తీసే దురాచారం ఉంది. అలాంటి ఆచారం పాటించిన ఒక ఊరు కొన్నాళ్లకు అసలు ఒక్క అమ్మాయి కూడా లేక అందరూ మగవాళ్లతో నిండిపోయే స్థితికి చేరుకుంటుంది. అప్పుడు ఏమవుతుంది? పెళ్లి కాని యువకులు ఎంత నిస్పృహకు లోనవుతారు? దొరక్క దొరక్క ఒక వధువు దొరికి ఆ ఊరికి కోడలిగా వస్తే ఏమవుతుంది? దర్శకుడు షాకింగ్‌గా ఈ సినిమా కథను అధివాస్తవిక దృష్టితో చూపిస్తాడు. దీనికి బోలెడన్ని అవార్డులు వచ్చాయి. ఇలాంటి స్థితి ఇప్పుడు మహారాష్ట్రలో, కర్ణాటకలో ఇంకా దేశంలో మరికొన్ని చోట్ల నెలకొని ఉన్నదంటే ఆ దర్శకుడు ఊహించిందే నిజమైంది.

> ఇవాళ అనేక ఇళ్లల్లో అబ్బాయిలు ఈసురోమంటూ ఒంటరిగా ఉంటున్నారు. సంబంధం ఒక పట్టాన కుదరడం లేదు. అమ్మాయిలు అంత సులువుగా దొరకడం లేదు.

లింగ నిష్పత్తికి విఘాతం

1970, 80, 90... ఈ మూడు దశాబ్దాలు మన దేశం అనేక భ్రూణ హత్యలను, ఆడపిల్ల అయితే శిశు హత్యలను చూసింది. ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించడం మధ్యతరగతి వారికి కట్నాలు, కానుకలు తప్పించుకునే ఒక మార్గం అయ్యింది. ఆ కాలంలో లింగ నిష్పత్తికి కలిగిన విఘాతం ఆ సమయంలో పుట్టిన ముఖ్యంగా 1990లలో పుట్టిన అబ్బాయిలు ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. 2000 సంవత్సరం తర్వాత ప్రభుత్వం మేల్కొని లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలపై కఠిన చట్టాలు తెచ్చినా 2005 నాటికి ప్రతి 1000 మంది అబ్బాయిలకు 876 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. 2018–20 నాటికి నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం ప్రతి 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య 907 ఉంది. ఇది జాతీయ సగటు. కాని కొన్ని రాష్ట్రాల్లో ఈ నిష్పత్తి చాలా ప్రమాదకరంగా ఉంది.

సోలాపూర్ పెళ్లికొడుకులు

మొన్నటి డిసెంబర్‌లో మహారాష్ట్రలోని సోలాపూర్‌లో 50 మంది బ్రహ్మచారులు పెళ్లికొడుకుల వేషాలు కట్టి, గుర్రాలు ఎక్కి, మేళ తాళాలతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి 'తగిన వధువు'ను వెతకమని మెమొరాండం ఇచ్చారు. కొందరు ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసి మొర పెట్టుకున్నారు. మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి లేదని అమ్మాయిని ఇవ్వడం లేదు. మరికొన్ని చోట్ల అమ్మాయిలు లేక దొరకడం లేదు. అక్కడ ప్రస్తుతం ప్రతి 1000 మంది అబ్బాయిలకు 889 మంది అమ్మాయిలే అందుబాటులో ఉన్నారు. దాంతో పెళ్లిళ్లు జరక్క అబ్బాయిలు ఆవేదన చెందుతుంటే, వాళ్ల తల్లిదండ్రులు మనోవేదనతో హార్ట్ ఎటాక్‌లు తెచ్చుకుని మరణిస్తున్నారు.

కర్ణాటక పాదయాత్ర

ఇప్పుడు కర్ణాటకలోని మాండ్య ప్రాంతం వార్తల్లోకి వచ్చింది. అక్కడ గత కొన్నేళ్లుగా బలవంతపు బ్రహ్మచర్యాన్ని అబ్బాయిలు అనుభవిస్తున్నారు. ఒకప్పుడు మాండ్య ప్రాంతంలో సాగిన భ్రూణ హత్యలు ఇపుడు పెళ్లి కాని యువకుల పట్ల శాపంగా మారాయి. దాంతో చదువు, యోగ్యత, ఉద్యోగాలు ఉన్నా సరే జంట లేక కుర్రాళ్లు డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. వీరు ఇదే విధంగా ఉండటం సరి కాదని అక్కడ కొంత మంది సామాజిక కార్యకర్తలు వారి ఓదార్పుకై, దైవ శక్తి తోడుకై 'బ్రహ్మచారి పాదయాత్ర'ను ప్రతిపాదిస్తే ప్రకటన వెలువడిన వెంటనే వందకు పైగా రిజిస్ట్రేషన్‌లు వచ్చాయి. ఫిబ్రవరి 23న 30 ఏళ్ల వయసు దాటిన 200 మంది బ్రహ్మచారులు మాండ్యాలోని మద్దూరు నుంచి పొరుగు జిల్లా చామరాజనగర్‌లోని ప్రఖ్యాత మాలె మహదేశ్వర గుడికి మూడు రోజుల పాటు 105 కిలోమీటర్ల మేరకు ఈ పాదయాత్ర సాగనుంది. ఆశ్చర్యంగా మాండ్యా జిల్లా నుంచే కాక మైసూరు, బెంగళూరు నుంచి కూడా నిర్వాహకులకు ఫోన్లు వస్తున్నాయి. 200కు పరిమితం చేశారు కాని ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చు. 'బ్రహ్మచారులకు బతుకు మీద ఆశ కల్పించడానికి ఈ పాదయాత్ర కొంతైనా ఉపకరిస్తే అదే పదివేలు' అని నిర్వాహకులలో ఒకరు వ్యాఖ్యానించారు.

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. 1970లలో 80లలో అబ్బాయిలు కట్నం కోసం అమ్మాయిలను కాల్చుకుతిన్నారు. వయసుకొచ్చిన యువకుడు ఇంట్లో ఉంటే ఆ ఇంటికి ఎంతో డిమాండ్ ఉండేది. ఇవాళ అనేక ఇళ్లల్లో అబ్బాయిలు ఈసురోమంటూ ఒంటరిగా ఉంటున్నారు. సంబంధం ఒక పట్టాన కుదరడం లేదు. అమ్మాయిలు అంత సులువుగా దొరకడం లేదు.

ఆడపిల్ల దేశానికి ఆయువు. ఈ వార్తలు చూసైనా ప్రతి ఇంటా ఆడపిల్లను సంతోషంగా ఆహ్వానించాలి.

కొత్తదారి



శివమ్ త్యాగి, ఆర్య

సింపుల్‌గా.. శుభంగా

ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే పెళ్లి అంత ఘనంగా జరిగినట్లు. అనే ఆలోచనధోరణి నుంచి బయటికి వచ్చి నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ ఆఫీసర్ ఆర్య, ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఆఫీసర్ శివమ్ త్యాగి.

'ఆనందం అనేది ఆడంబరపు ఖర్చుల్లో కాదు... మనం చేసే మంచి పనుల్లో దొరుకుతుంది' అని నమ్మిన ఈ నవదంపతులు 20 మంది అనాథ పిల్లల చదువుకు అయ్యే ఖర్చును భరించాలని వివాహ శుభసమయాన శుభనిర్ణయం తీసుకున్నారు...

కేరళ, కొట్టాయంలోని కూరోప్పడకు చెందిన ఆర్య ఎస్ నాయర్ తండ్రి రాధాకృష్ణన్‌నాయర్ జాయింట్ లేబర్ కమిషనర్‌గా రిటైరయ్యారు. కూతురికి చిన్నవయసు నుంచే దినపత్రికలు చదవడం అలవాటు చేశారు. ఈ అలవాటు తనకు ఎంతో మేలు చేసింది. ఎప్పటికప్పుడు సామాజిక సందర్భాలను అర్థం చేసుకోవడానికి మాత్రమే కాదు, రకరకాల సమస్యల విశ్లేషణ గురించి తెలుసుకోవడానికి కూడా ఆర్యకు ఉపకరించింది.

బంధువులకు సంబంధించిన ఎన్నో పెళ్లిళ్లకు హాజరయ్యేది ఆర్య. ఆ ఆడంబరపు ఖర్చును చూసి తన మనసు చివుక్కుమనేది.

'ఈ పెళ్లికి చేసిన ఖర్చుతో ఎన్నో మంచి పనులు చేయవచ్చు' అనుకునేది.

ఇదే విషయాన్ని ఇతరులతో పంచుకుంటే...

'ఇప్పుడు ఇలాగే అంటావ్. తీరా పెళ్లి టైమ్ వచ్చేసరికి మారిపోతావు. నా పెళ్లి ఎంత ఘనంగా జరిగిందో తెలుసా అని చెప్పుకోవడానికే ప్రాధాన్యత ఇస్తావు. నీ వయసులో నీలాగే ఆలోచించాను. కాని నా పెళ్లి ఘనంగా జరగక తప్పలేదు. చివరికి అప్పు కూడా చేయాల్సి వచ్చింది' అన్నవాళ్లే ఎక్కువ. ఈ మాటలు ఆర్య మనసులో గట్టిగా నిలిచిపోయాయి.

'పెళ్లంటూ చేసుకుంటే నిరాడంబరంగానే చేసుకోవాలి' అని నిర్ణయం తీసుకుంది.

దిల్లీకి చెందిన శివమ్ త్యాగి కూడా ఆర్యలాగే ఆలోచిస్తాడు. ఇద్దరూ ప్రస్తుతం అహ్మదాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వారి పరిచయం స్నేహం అయ్యే క్రమంలో, ఆ స్నేహం ప్రేమకు దారి తీసే క్రమంలో ఎన్నో సామాజిక సంబంధిత విషయాలు మాట్లాడుకునేవారు. అందులో ఆడంబర వివాహాల ప్రస్తావన కూడా తప్పనిసరిగా ఉండేది.

> 'కేరళలో వివాహాలు మూడు రోజుల పాటు అట్టహాసంగా జరుగుతాయి. నా పెళ్లి వార్త తెలియగానే బంధువులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూశారు. పెళ్లి ఆడంబరంగా జరుగుతుందని ఊహించారు. కాని కొట్టాయంలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్చుకోవడం ద్వారా నిరాడంబరంగా జరిగిన మా పెళ్లి వారిని కాస్త నిరాశకు గురిచేసింది. అయితే ఆ తరువాత వారు మమ్మల్ని అర్థం చేసుకొని అభినందించారు' అంటుంది ఆర్య.

'నిరాడంబరంగా పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం' అని ఆర్య చెప్పినప్పుడు తల్లిదండ్రులు ఇష్టపడలేదు. వారిని ఒప్పించడానికి కాస్త సమయం పట్టింది. మరోవైపు శివమ్ త్యాగి పరిస్థితి కూడా అంతే. అతడి తల్లిదండ్రులు కూడా నిరాడంబర వివాహానికి మొదట సుముఖంగా లేరు.

'మా నిరాడంబర వివాహం కొందరికైనా స్ఫూర్తిని ఇస్తే అంతకంటే గొప్ప ఆనందం ఏం ఉంటుంది!' అంటున్నాడు శివమ్ త్యాగి.

ఆనందాలు ఆడంబరపు ఖర్చులతో ముడిపడిన చోట ఆనందం మాటేమిటోగానీ అప్పులు మాత్రమే మిగులుతాయి. దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఈ ధోరణిలో మార్పు రావాలంటే నిరాడంబర వివాహాల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది. ఆర్య-శివమ్ త్యాగిలాంటి వారు ఇందుకు స్ఫూర్తిగా నిలుస్తారు.

బ్యూటిప్స్

ఒకోసారి వాతావరణంలో చర్మం పొడిబారిపోయి జీవం కోల్పోయినట్లుగా ఉంటుంది. చిన్న చిట్కాలతో చర్మం పునరుత్తేజం పొందుతుంది.

ఆలోవెరా గుజ్జు అరకప్పు, బాదం నూనె అరచెంచా, నువ్వుల నూనె అరచెంచా... వీటన్నింటినీ ఒక చిన్న గాజుసీసా లేదా కంటెయినర్‌లో పోసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే చర్మం మిల మిలలాడుతుంది. ఒకవేళ ఆలోవెరా దొరకలేదనుకోండి... అప్పుడు అరకప్పు అరమగ్గిన బొప్పాయి గుజ్జులో పచ్చిపాలు కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ ముద్దను ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.



హెల్త్



విటమిన్లే అయినా... మరీ అతిగా వద్దు!

ఇటీవల మనందరిలో పెరిగిన ఆరోగ్యస్పృహ గురించి తెలిసిందే. మరీ ముఖ్యంగా కరోనా తర్వాత ఇమ్యూనిటీ పెంచుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఈ ప్రయత్నంలో 'విటమిన్ల' కోసం సప్లిమెంట్లు అతిగా తీసుకునేవారూ ఉన్నారు. జీవక్రియల కోసం విటమిన్లు కీలకమే. కానీ 'ఆరోగ్య స్పృహ' అంటూ అతిచేయడంతో విటమిన్ల మోతాదు పెరిగి 'హైపర్ విటమినోసిస్'కు గురయ్యే ప్రమాదమూ ఉంది. ఆ అనర్థాలేమిటో తెలిపే కథనమిది.

మోతాదుకు మించి విటమిన్లు తీసుకోవడం వల్ల 'హైపర్ విటమినోసిస్' అనే కండిషన్ వస్తుందంటూ వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కండిషన్‌ను 'విటమిన్ టాక్సిసిటీ'గా కూడా పేర్కొంటున్నారు.

నీటిలో కరిగేవాటికంటే... ఫ్యాట్‌లో కరిగేవే డేంజర్

విటమిన్లలో ఏ, బీ కాంప్లెక్స్, సీ, డీ, ఈ, కే అనే విటమిన్లు ఉంటాయి. వీటిల్లో 'ఏ, డీ, ఈ, కే' అనేవి కొవ్వు (ఫ్యాట్)లో కరిగితేనే దేహంలోకి ఇంకుతాయి. ఇక విటమిన్ 'బీ-కాంప్లెక్స్'తో పాటు విటమిన్ 'సీ' మాత్రం నీళ్లలో కరుగుతాయి. ఈ బీ కాంప్లెక్స్, సీ విటమిన్లు నీళ్లలో కరగడం వల్ల కాస్త ఎక్కువైనా... మూత్రంతో పాటు బయటకు తేలిగ్గా వెళ్తాయి. దాంతో హానికి పెద్దగా అవకాశం ఉండదు. కానీ సమస్యల్లా విటమిన్ ఏ, డీ, ఈ, కే లు కొవ్వుల్లో కరగడం వల్ల... వీటి మోతాదు పెరిగినప్పుడు అంత తేలిగ్గా బయటకు వెళ్లడం సాధ్యపడదు. దాంతో ఎక్కువైనప్పుడు కొన్ని అనర్థాలు తెచ్చిపెడతాయి.

విటమిన్-ఏ పెరిగితే...

విటమిన్-ఏ లోపిస్తే రేచీకటి వంటి సమస్యలు వస్తాయి. విటమిన్- ఏ పెరగడం వల్ల ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డిప్లోపియా), వికారం లేదా వాంతులు, తలనొప్పి, కండరాల-కీళ్ల నొప్పులు, మరీ మోతాదు ఎక్కువైతే కాలేయం తన విధులు నిర్వర్తించలేకపోవడం వంటి అనర్థాలు వస్తాయి.

విటమిన్-డీ ఎక్కువైతే...

ఆరుబయట చేసే ఉద్యోగాలు బాగా తగ్గడం, దాదాపుగా అందరూ ఆఫీసుల (ఇన్‌డోర్స్)కే పరిమితం కావడంతో ఇటీవల మన దేశంలో విటమిన్ 'డీ' లోపం బాగానే పెరిగింది. ఒక దశలో విటమిన్-డీ లోపం కేసులు చాలా పెద్ద సంఖ్యలో రావడంతో చాలామంది డాక్టర్లు చాలా సందర్భాల్లో ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే విటమిన్-డీ సప్లిమెంట్లను ఇవ్వడం మొదలుపెట్టారు. డీ-విటమిన్ ఎక్కువైతే అది రక్తంలో క్యాల్షియమ్ మోతాదుల్ని పెంచుతుంది ఫలితంగా కుంగుబాటు (డిప్రెషన్) వంటి కొన్ని మానసిక సమస్యలు కనిపించవచ్చు. అలాగే తలనొప్పి, తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ, జీర్ణ వ్యవస్థకు (గ్యాస్ట్రో ఇంటస్టినల్) సమస్యలు రావచ్చు. అంటే ఉదాహరణకు వికారం, వాంతులు, మలబద్ధకం, కడుపునొప్పి వంటివి కనిపించే అవకాశాలున్నాయి. ఇక మూత్ర వ్యవస్థకు సంబంధించిన లక్షణాలు... అంటే తరచూ మూత్రవిసర్జనకు వెళ్లడం, మూత్రపిండాల్లో క్యాల్షియమ్ ఎక్కువగా చేరే 'నెఫ్రోక్యాల్సినోసిస్' వంటి సమస్యలూ రావచ్చు. ఫలితంగా కిడ్నీ పనితీరు దెబ్బతినేందుకు అవకాశాలుంటాయి.



డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

చికిత్స : సమస్య నిర్ధారణలో హైపర్ విటమినోసిస్ వల్ల వచ్చిన అనర్థమే అన్నది చాలా కీలకం. దేహంలో ఏ విటమిన్లు ఎక్కువయ్యాయో దాన్ని బట్టి నిర్దుష్టమైన చికిత్స ఉంటుంది. ఉదాహరణకు విటమిన్-ఏ ఎక్కువైతే... దానికి విరుగుడుగా మూత్రం ఎక్కువగా వచ్చేందుకు ఉపకరించే 'ఎసెటజోలమైడ్' వంటి మాత్రలు సూచిస్తారు. ● విటమిన్-డీ పెరిగినట్లు తెలిస్తే... దానికి విరుగుడుగా దేహంలోని క్యాల్షియమ్ మోతాదులు తగ్గించేందుకు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం, చాలా ఎక్కువ మోతాదులో మూత్రం వచ్చేందుకు వాడే 'లూప్ డైయూరెటిక్స్' వంటివి వాడతారు. అలాగే క్యాల్షియమ్ మోతాదులు తగ్గించేందుకు కల్సిటోనిన్ వంటి ముక్కు ద్వారా ఇచ్చే స్ప్రేలు, బిస్ఫాస్ఫోనేట్ వంటివి ఇస్తారు. ● విటమిన్-ఈ పెరిగినట్లు నిర్ధారణ అయితే రక్తస్రావాలు, అంతర్గత రక్తస్రావాలు నివారించేందుకు విటమిన్-కే, ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) వంటి ప్రక్రియలు చేస్తారు. ● విటమిన్-కే పెరిగినట్లు తెలిస్తే... దాని అనర్థాలు నివారించేందుకు వార్‌ఫేరిన్ వంటి మందులు లేదా కామెర్లకు వాడే మందులు ఉపయోగిస్తారు.

నివారణ : దేహంలోని జీవక్రియలకు ఎంతో కీలకమైన విటమిన్లు చాలావరకు మనం తీసుకునే సమతులాహారం తోనే సమకూరుతుంటాయి. నిర్దుష్టంగా ఏదైనా విటమిన్ లోపాల వల్ల వచ్చే లక్షణాలను కనుగొంటే డాక్టర్లు వీటిని సూచిస్తారు. అంతేతప్ప... విటమిన్లు పెరిగితే ఆరోగ్యమూ పెరుగుతుందనే అపోహతో 'ఓవర్ ద కౌంటర్ మెడిసిన్'లలా విటమిన్ సప్లిమెంట్లు వాడటం ఎంతమాత్రమూ సరికాదు.

విటమిన్-ఈ పెరగడం వల్ల

దేహాన్ని అందంగా ఉంచడంతో పాటు కొంతమేరకు ప్రత్యుత్పత్తికి ఉపయోగపడే ఇదే విటమిన్ దేహంలో పెరగడం వల్ల... అది మరో విటమిన్ అయిన విటమిన్-కే చేయాల్సిన విధుల్ని దెబ్బతీస్తుంది. దాంతో తేలిగ్గా రక్తస్రావం జరగడానికీ, అంతర్గత రక్తస్రావాలకూ అవకాశం ఏర్పడుతుంది.

విటమిన్-కే పెరుగుదలతో దుష్ప్రభావాలివి...

దేహంలో విటమిన్-కే పెరగడం అన్నది చాలా చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. అయితే ఇలా పెరగడం వల్ల కామెర్లు, హీమోలైటిక్ అనీమియా వంటి కండిషన్లు ఏర్పడతాయి.

మెడి టిప్


కీళ్ల నొప్పుల నివారణకు...

మన దేహం కూడా యంత్రం లాంటిదే. యంత్రంలోని భాగాలు అరుగుదలకు లోనైనట్టే... కీళ్లూ అరుగుదలకు లోనవుతుంటాయి. వయసు పెరుగుతున్నప్పుడు ఒకదశ తర్వాత కీళ్ల అరుగుదలతో నొప్పులు వస్తాయి. వాటి నివారణకూ లేదా ఆలస్యం చేయడానికి ఈ కింది సూచనలు పాటించాలి. ▲ క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాలు, ఆకుకూరల వంటి ఆహారాలు తీసుకోవాలి. ▲ బరువు పెరగకూడదు. ఎత్తుకు తగినంత బరువు ఉండేలా నియంత్రించుకోవాలి. ▲ కదలికల్ని చురుగ్గా ఉంచుకోవాలి. ▲ కాళ్లు బాగా ముడుచుకునేలా బాసింపట్టు వేసి కూర్చోవడాన్ని (స్క్వాటింగ్) నివారించాలి. వీలైనంత వరకు తగినంత ఎత్తులో సౌకర్యంగా కూర్చోవాలి. ▲ కీళ్లలో నొప్పి కనిపించినప్పుడు నిర్లక్ష్యం చూపొద్దు. తప్పక డాక్టర్‌ను కలవాలి.

సీకేడీ పిల్లలకు ఆశాకిరణం...

కిడ్నీ మార్పిడి చికిత్స!

మూత్రపిండాలు (కిడ్నీలు) రక్తంలోని మలినాలను బయటకు పంపుతాయి. అలా అవి మనలోని వ్యర్థపదార్థాలన్నింటినీ వడపోస్తాయి. కిడ్నీలు వాటి వడపోత సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు, మన శరీరంలో హానికారక ద్రవాలు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది ఒకేసారి జరగదు. ఇది క్రమక్రమంగా చోటు చేసుకుంటుంది. ఒకవేళ కిడ్నీలు తమ పనితనంలో 90 శాతాన్ని కోల్పోతే... దాన్ని మూత్రపిండాల వ్యాధి చివరి దశగా పేర్కొనవచ్చు. సిస్టిక్ డిస్‌ప్లాస్టిక్ కిడ్నీ, పాలిసిస్టిక్ కిడ్నీ, వారసత్వం వల్ల వచ్చే అనువంశీక కిడ్నీ వ్యాధులు, దీర్ఘకాలిక గ్లోమెరూలర్, ట్యూబ్యులార్ వ్యాధులు గల పిల్లల్లో క్రానిక్ కిడ్నీ డిసీజ్-సీకేడీ వస్తుంది. సీకేడీని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. అలాంటి బాధితులు జీవించి ఉండాలంటే డయాలసిస్ అవసరం. లేదా మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) జరిపించాలి.



బాధితులకు ఆశాకిరణం... మూత్రపిండాల మార్పిడి

మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్)లో... జీవించి ఉన్న లేదా చనిపోయాన దాత నుంచి మూత్రపిండాన్ని మొదట సేకరిస్తారు. ఆ తర్వాత శస్త్రచికిత్స ద్వారా బాధితుల్లోకి ఆ మూత్రపిండాన్ని అమర్చుతారు. దాంతో బాధితుల్లో ఈ కింది ప్రయోజనాలు చేకూరుతాయి. ● మెరుగైన జీవననాణ్యత (నాణ్యమైన జీవనశైలి) ● ఆహారంపై కొద్దిపాటి ఆంక్షలు ఉన్నప్పటికీ రోగి మరణించే ప్రమాదం తక్కువ ● చికిత్స ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.

సీకేడీ దుష్ప్రభావాలు, లక్షణాలు :

● రక్తహీనత ● ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు ● ఎముకల బలహీనత ● గుండెజబ్బు ● అధిక రక్తపోటు

సీకేడీని అదుపు చేయడం ఎలా?

బాధితులు ఆహారంలో ఉప్పు, మాంసాహారం, నూనె చాలా తక్కువగా తీసుకోవాలి. రక్తపోటు నియంత్రణ మందులు వాడాలి. రక్తహీనత నివారణకూ, పిల్లల్లో ఎదుగుదల లోపించకుండా చేసేందుకు ఎరిథ్రోపాయిటిన్, గ్రోత్ హార్మోన్ ఇంజెక్షన్లు, క్యాల్షియమ్ లవణాలు, బైకార్బొనేట్ సప్లిమెంట్స్ ఇవ్వాలి. సీకేడీ పిల్లలను రక్షించుకోడానికి ఉన్న మార్గం డయాలసిస్ లేదా మూత్రపిండాల మార్పిడి మాత్రమే.

దయాలసిస్ అంటే... డయాలసిస్‌ను రెండు రకాలుగా చేస్తారు. మొదటిది హీమోడయాలసిస్ రెండోది పెరిటోనియల్ డయాలసిస్. సీకేడీ చివరిదశలో ఉన్న పిల్లలందరికీ అంతిమంగా మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) తప్పనిసరి.

ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుగా...

కిడ్నీ అమర్చాల్సిన వ్యక్తికి ముందుగా అనేక రక్త పరీక్షలు, కొన్ని ఇమేజింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. బాధితుల శరీరం... బయటి మూత్రపిండాన్ని నిరోధించకుండా ఉండేందుకు ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందు, తర్వాత చిన్నారికి కొన్ని మందులు (ఇమ్యూనోసప్రెసెంట్స్, ఇమ్యూనోమాడ్యులేటర్స్) ఇవ్వాలి. ఇన్ఫెక్షన్స్‌ని నివారించేందుకు చిన్నారిని వేరుగా ఉంచాలి. ఇంట్లోనివాళ్లు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

గత కొన్నేళ్లుగా వైద్యచికిత్సల్లో వచ్చిన పురోగతి వల్ల మునుపు స్వీకర్తకూ, దాతకూ మ్యాచింగ్ వీలుకాదనే ఫలితం వచ్చిన కేసుల్లోనూ ఇప్పుడు మార్పిడి సాధ్యమవుతోంది. అనేక ఆధునిక ప్రక్రియల వల్ల ఇప్పుడు భిన్న బ్లడ్ గ్రూప్స్ వ్యక్తుల్లో సైతం కిడ్నీ మార్పిడి సాధ్యమవుతోంది. ఫలితంగా కిడ్నీ కోసం వెయిటింగ్ పీరియడ్ గణనీయంగా తగ్గింది. ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత కూడా చిన్నారులు అన్నివిధాలుగా ఆరోగ్యవంతులవుతారు. అంతేకాదు.. ఇతర పిల్లల్లాగే వాళ్లూ చదవడం, ఆటలాడటం... ఇలా అన్నీ చేయవచ్చు.



డాక్టర్ వి.వి.ఆర్. సత్యప్రసాద్,
సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బంజారాహిల్స్,
హైదరాబాద్. కాంటాక్ట్ నంబర్ 8882 046 046
www.rainbowhospitals.in

హెల్త్ టిప్

ఛాతీలో మంట...

కడుపులో యాసిడ్ పైకి తంతుంటే!

ఎంత ఆరోగ్యవంతులకైనా జీవితంలో ఎప్పుడో ఒకసారైనా కడుపులోని గ్యాస్ పైకి ఎగజిమ్ముతూ... ఇబ్బంది పెట్టడం ఎప్పుడో ఒకసారి అనుభవంలోకి వస్తుంది. ఈ సమస్యను వైద్యపరిభాషలో 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్' (జీఈఆర్‌డీ) అంటారు. కడుపులో యాసిడ్ ఆహారంపైన పనిచేసే సమయంలో దాని వాయువులు (ఫ్యూమ్స్) పైకి ఎగజిమ్మడంతో గొంతు, ఛాతీలో మంట అనిపిస్తుంది.

జీఈఆర్‌డీని నివారించాలంటే... ▸ ఈ సమస్య నివారణకు మంచి జీవనశైలిని అలవరచుకోవడం మేలు. ▸ రాత్రి భోజనం ఆలస్యం చేయకూడదు. ఆహారం తీసుకున్న తర్వాత కొద్దిదూరమైనా నడవాలి. ▸ పక్కమీదకు చేరగానే సాధ్యమైనంత వరకు ఎడమవైపునకు ఒరిగి పడుకోవాలి. ఒకవేళ కుడివైపు తిరిగి పడుకుంటే గొంతు చివర అన్నకోశం దగ్గర ఉండే స్ఫింక్టర్ మీద ఒత్తిడి పడి తెరుచుకుని, ఆహారం వెనక్కు రావచ్చు. అప్పుడు యాసిడ్ కూడా వెనక్కు వచ్చే అవకాశముంటుంది. ▸ తల వైపు భాగం ఒంటి కంటే కాస్త ఎత్తుగా ఉండేలా పక్కను సర్దుకోవాలి. రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారు వీలైతే తల కింద మరో దిండును ఎక్కువగా పెట్టుకోవడం ఉపశమనాన్ని కలిగిస్తుంది. ▸ మందుల విషయానికి వస్తే... హెచ్2 బీటా బ్లాకర్స్, ప్రోటాప్ పంప్ ఇన్హిబిటర్స్ (పీపీఐ) అనే మందులతోనూ చికిత్స చేస్తారు.




దీపక్ చహర్, శిఖర్ ధావన్, సచిన్ టెండూల్కర్

స్పిన్‌తో ‘విన్ ఇండియా’

ఎప్పట్లాగే భారత్ స్పిన్ అస్త్రంతోనే రంగంలోకి దిగుతుందని... వార్మప్‌లో పేస్ పిచ్‌తో మభ్య పెడుతుందని ఆస్ట్రేలియా సన్నాహక మ్యాచ్ అక్కర్లేదంది. నెట్స్‌లో అదేపనిగా స్పిన్ బౌలింగ్‌లోనే శ్రమించింది. అశ్విన్‌ను పోలిన డూప్లికేట్ బౌలర్‌తో తెగ ప్రాక్టీస్ చేసింది. ఇంత చేసినా ‘కంగారు’ తప్పలేదు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్ చేరిన జట్టు అనూహ్యంగా మూడే రోజుల్లో చిత్తయ్యింది. భారత్ భారీ విజయంతో బోర్డర్–గావస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌ను ప్రారంభించింది.

- ఇన్నింగ్స్ 132 పరుగులతో భారత్ భారీ విజయం
- అశ్విన్ ఉచ్చులో ఆసీస్ చిత్తు
- రెండో ఇన్నింగ్స్‌లో 91కే ఆలౌట్
- 17 నుంచి ఢిల్లీలో రెండో టెస్టు


అశ్విన్

నాగ్‌పూర్: ఆస్ట్రేలియా భయపడినట్లే జరిగింది. భారత్ స్పిన్ అస్త్రంతోనే గెలిచింది. అయితే కంగారూ టీమ్ చేసిన కసరత్తుకు ఓడిన తీరుకు ఏ మాత్రం పొంతనే లేదు. ఆసీస్‌లాంటి మేటి జట్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 100 (తొలి ఇన్నింగ్స్‌లో 63.5; రెండో ఇన్నింగ్స్‌లో 32.3) ఓవర్లయినా ఆడకపోవడం... మ్యాచ్ మూడో రోజే ముగిసిపోవడం మాత్రం ఎవరూ ఊహించనిది. తొలి ఇన్నింగ్స్‌ను జడేజా (5/47, 2/34) కూల్చినట్లే... రెండో ఇన్నింగ్స్‌ను అశ్విన్ (3/42, 5/37) పడగొట్టేశాడు. దీంతో తొలి టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో 1–0తో ముందడుగు వేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న జడేజాకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది.

ఆట మొదలైందిలా...

ఓవర్‌నైట్ స్కోరు 321/7తో మూడోరోజు శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 139.3 ఓవర్లలో సరిగ్గా 400 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో జడేజా (185 బంతుల్లో 70; 9 ఫోర్లు) తన క్రితం రోజు స్కోరుకు 4 పరుగులే చేసి మర్ఫీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. మరోవైపు అక్షర్ పటేల్ (174 బంతుల్లో 84; 10 ఫోర్లు, 1 సిక్స్) తొలి సెషన్‌లో కుదురుగా ఆడాడు. మిగిలిన టెయిలెండర్ల సాయంతో సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు చేయాలన్న పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. షమీ (47 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) వేగంగా ఆడాడు. తమ ప్రధాన బ్యాటర్లను వణికించిన మర్ఫీ బౌలింగ్‌లో షమీ వరుస సిక్సర్లతో అలరించాడు. అయితే షమీని మర్ఫీ తన మరుసటి ఓవర్లో బోల్తా కొట్టించాడు. దీంతో తొమ్మిదో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత సిరాజ్ (1 నాటౌట్) అండతో జట్టు స్కోరును 400 పరుగులకు చేర్చిన అక్షర్‌ను అదే స్కోరు వద్ద కమిన్స్ బౌల్డ్ చేయడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 223 పరుగుల ఆధిక్యం సాధించింది. అరంగేట్రం చేసిన బౌలర్ మర్ఫీ ఒకే ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీశాడు.

ఆసీస్ కూలిందిలా...



లంచ్ బ్రేక్ తర్వాత ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ మొదలైంది. కానీ మూడో సెషన్‌కు ముందే 32.3 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌటైంది. ఒకే ఒక్క సెషన్‌లో అగ్రశ్రేణి జట్టయిన ఆసీస్ మొత్తం 10 వికెట్లను కోల్పోవడం గమనార్హం. రెండో ఓవర్ నుంచే అశ్విన్‌ను రంగంలోకి దించడం... అతను ఉస్మాన్ ఖాజా (5)ను పెవిలియన్ చేర్చడంతో ఆసీస్ పతనం శరవేగంగా మొదలై అంతే వేగంగా ముగిసింది. కీలక వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ (17)ను జడేజా అవుట్ చేయగా, మిగతా బ్యాటర్లు వార్నర్ (10), రెన్‌షా (2), హ్యాండ్స్‌కోంబ్ (6), క్యారీ (10)లను అశ్విన్ తన వరుస ఓవర్లలో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 20వ ఓవర్ పూర్తవకముందే ఆసీస్ 64/6 స్కోరుతో ఇన్నింగ్స్ పరాజయానికి సిద్ధమైంది. తర్వాత అక్షర్ (1/6), జడేజా (2/34), షమీ (2/13) తలా ఒక చేయి వేయడంతో ఆస్ట్రేలియా వంద పరుగులైనా చేయలేకపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 177; భారత్ తొలి ఇన్నింగ్స్: 400. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖాజా (సి) కోహ్లి (బి) అశ్విన్ 5; వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 10; లబుషేన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 17; స్మిత్ (నాటౌట్) 25; రెన్‌షా (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 2; హ్యాండ్స్‌కోంబ్ (ఎల్బీడబ్ల్యూ)(బి) అశ్విన్ 6; క్యారీ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 10; కమిన్స్ (సి) భరత్ (బి) జడేజా 1; మర్ఫీ (సి) రోహిత్ (బి) అక్షర్ 2; లయన్ (బి) షమీ 8; బోలండ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (32.3 ఓవర్లలో ఆలౌట్) 91. వికెట్ల పతనం:** 1–7, 2–26, 3–34, 4–42, 5–52, 6–64, 7–67, 8–75, 9–88, 10–91. **బౌలింగ్:** షమీ 4.3–1–13–2, అశ్విన్ 12–3–37–5, సిరాజ్ 1–1–0–0, జడేజా 12–3–34–2, అక్షర్ 3–0–6–1.

91 భారత గడ్డపై టెస్టుల్లో ఆస్ట్రేలియాకిది అత్యల్ప స్కోరు. 2004లో ముంబైలో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా 93 పరుగులకు ఆలౌటైంది. ఓవరాల్‌గా భారత్‌పై ఆస్ట్రేలియాకిది రెండో అత్యల్ప స్కోరు. 1981 మెల్‌బోర్న్ టెస్టులో ఆస్ట్రేలియా 83 పరుగులకు ఆలౌటైంది.

5 ఆస్ట్రేలియాపై భారత జట్టు ఇన్నింగ్స్ విజయం సాధించడం ఇది ఐదోసారి. చివరిసారి భారత్ 2013లో హైదరాబాద్‌లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియాపై ఇన్నింగ్స్ విజయం అందుకుంది.

25 భారత్‌లో అశ్విన్ టెస్టు ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడం ఇది 25వసారి. తాజా ప్రదర్శనతో అనిల్ కుంబ్లే (25 సార్లు) సరసన అశ్విన్ నిలిచాడు. స్వదేశంలో అత్యధికంగా ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (45 సార్లు), రంగన హెరాత్ (26 సార్లు) ఉన్నారు.

10 నాగ్‌పూర్ టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్లు పది సార్లు ఎల్బీడబ్ల్యూగా అవుటయ్యారు. వారి టెస్టు చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. 2001లో కోల్‌కతా టెస్టులో, గత ఏడాది శ్రీలంకపై గాలె టెస్టులో తొమ్మిదిమంది బ్యాటర్లు ఎల్బీగా వెనుదిరిగారు. భారత బౌలర్లు కూడా ఓ టెస్టులో పదిసార్లు ఎల్బీగా అవుట్ చేయడం ఇదే తొలిసారి.

జడేజాకు జరిమానా



తొలి టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన రవీంద్ర జడేజాపై జరిమానా పడింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ సమయంలో స్పిన్నర్ అంపైర్ల అనుమతి తీసుకోకుండా తన చేతి వేలు వాపు తగ్గేందుకు అయింట్‌మెంట్ రాశాడు. ఇది కాస్తా బాల్ ట్యాంపరింగ్ అనుమానాల్ని రేకెత్తించగా... మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్ వీడియోల్ని పరిశీలించి ట్యాంపరింగ్‌కు పాల్పడలేదని తేల్చారు. అయితే అంపైర్ల అనుమతి లేకుండా అలా చేయడం ఐసీసీ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనని... మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ ఇచ్చారు.

పాక్‌తో పోరుకు భారత్ ‘సై’

- శుభారంభంపై హర్మన్ బృందం దృష్టి
- ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్
- సాయంత్రం గం 6:30 నుంచి ‘స్టార్ స్పోర్ట్స్–1’లో ప్రత్యక్ష ప్రసారం



కేప్‌టౌన్: టి20 ప్రపంచకప్‌ను సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్న భారత మహిళల జట్టు నేడు గ్రూప్ ‘బి’ తొలిపోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడుతుంది. కీలకమైన పోరుకు ముందు డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫిట్‌నెస్ సమస్యలు జట్టును సతమతం చేస్తున్నాయి. తొలి మ్యాచ్‌కు స్మృతి గాయంతో జట్టుకు దూరమవడం బ్యాటింగ్‌పై ప్రభావం చూపగలదు. అయితే ఇటీవల షఫాలీ వర్మ, రిచా అండర్–19 ఈవెంట్‌లో రాణించారు. ఇప్పుడు కూడా బాధ్యతను పంచుకుంటే ఆ సమస్యను అధిగమించవచ్చు. జెమీమా, హర్లీన్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మిడిలార్డర్‌లో రాణిస్తే జట్టుకు ఢోకా ఉండదు. బౌలింగ్‌లో రేణుక, శిఖా పాండే, దీప్తి శర్మ రాణిస్తే పాకిస్తాన్‌పై భారత్‌కు విజయం సులువవుతుంది.

జ్యోతి మళ్లీ జాతీయ రికార్డు



అస్తానా (కజకిస్తాన్): భారత యువ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఈ ఏడాది నాలుగోసారి 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది. ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం 60 మీటర్ల హర్డిల్స్ హీట్స్‌లో విశాఖపట్నం అమ్మాయి జ్యోతి 8.16 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో గతవారం 8.17 సెకన్లతో ఫ్రాన్స్‌లో జరిగిన మీట్‌లో తానే నెలకొల్పిన జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టింది.

హైదరాబాద్ ‘ఫార్ములా’ అదిరింది

విజయవంతంగా ముగిసిన ఫార్ములా ‘ఇ’ రేస్ • విజేతగా జీన్ ఎరిక్ వెర్నే

ఒకవైపు 320 కిలోమీటర్ల వేగంతో కార్లు దూసుకుపోతున్నాయి... మరోవైపు అంతే రేంజ్‌లో ఫ్యాన్స్ ఉత్సాహం, ఉత్కంఠ... ఒకవైపు వీఐపీ బాక్స్‌లో నుంచి సెలబ్రిటీలు రేస్‌ను ఆస్వాదిస్తుండగా... మరోవైపు గ్యాలరీల్లో ఉన్న సాధారణ అభిమానుల హోరుతో పరిసరాలు దద్దరిల్లుతున్నాయి... రెప్పపాటులో ట్రాక్‌పై జుమ్మంటూ జనరేషన్ ‘3’ కార్లు పరుగులు తీయగా... దాదాపు గంట పాటు హుస్సేన్ సాగర్ తీరం ప్రపంచ పటంపై కనువిందు చేసింది. న్యూయార్క్, బెర్లిన్, బీజింగ్, రోమ్, జ్యూరిక్... ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక ఫార్ములా ‘ఇ’ రేస్‌కు ఆతిథ్యం ఇస్తున్న నగరాల్లో కొన్ని. ఇప్పుడు హైదరాబాద్ కూడా వీటి సరసన చేరింది. కొత్తగా వచ్చిన క్రీడతో ‘స్ట్రీట్ సర్క్యూట్’ వద్ద అన్ని రకాలుగా కొత్త తరహా వాతావరణం కనిపించింది. ఫార్ములా ‘ఇ’ రేస్ విజయవంతమైందన్న సంకేతాన్ని చాటింది. ఈ హోరాహోరీ సమరంలో చివరకు డీఎస్ పెన్‌స్కే జట్టు డ్రైవర్ జీన్ ఎరిక్ వెర్నే విజేతగా నిలిచాడు.



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో తొలిసారి నిర్వహించిన ఎలక్ట్రిక్ కార్ రేసింగ్ ఫార్ములా ‘ఇ’ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అటు ప్రేక్షకాదరణతో పాటు ఇటు నిర్వాహకుల వైపు నుంచి కూడా సూపర్ సక్సెస్‌గా ప్రశంసలందుకుంది. ఫార్ములా ‘ఇ’ 9వ సీజన్‌లో భాగంగా హైదరాబాద్‌లో శనివారం నాలుగో రేస్ ముగిసింది. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో రూపొందించిన ‘స్ట్రీట్ సర్క్యూట్’పై 22 మంది పోటీ పడిన ఈ రేస్‌లో డీఎస్ పెన్‌స్కే టీమ్‌కు చెందిన జీన్ ఎరిక్ వెర్నే విజేతగా నిలిచాడు. 33 ల్యాప్‌లతో 2.83 కిలోమీటర్లు ఉన్న ట్రాక్‌పై సాగిన ఈ రేస్‌ను వెర్నే అందరికంటే వేగంగా 46 నిమిషాల 01.099 సెకన్లలో పూర్తి చేశాడు. ఎన్విజన్ రేసింగ్ డ్రైవర్ నిక్ కాసిడీ రెండో స్థానంలో, పోర్ష్ టీమ్ డ్రైవర్ ఫెలిక్స్ డి కోస్టా మూడో స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మహీంద్రా టీమ్ డ్రైవర్ ఒలివర్ రోలండ్‌కు ఆరో స్థానం దక్కింది. 29 పాయింట్లతో పెన్‌స్కే ‘టీమ్ చాంపియన్’గా నిలిచింది. విజేతగా నిలిచిన జీన్ ఎరిక్‌కు తెలంగాణ రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు... రన్నరప్ నిక్ క్యాసిడీకి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ట్రోఫీలు అందజేశారు. ఈ సీజన్‌లో భాగంగా ఐదో రేస్ ఈనెల 25న దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

హైదరాబాద్ రేస్ విశేషాలు...

• వెర్నే రేస్ పూర్తి చేసే సమయానికి అతని కారులో 0.5 శాతం ఎనర్జీ మాత్రమే మిగిలి ఉంది. • ఎన్విజన్ డ్రైవర్ సెబాస్టియన్ బ్యూమీ మూడో స్థానంలో నిలిచినా... ‘ఓవర్ పవర్’ ఉపయోగించినందుకు 17 సెకన్ల పెనాల్టీ విధించడంతో నాలుగో స్థానానికి పడిపోయాడు. • మహీంద్రా టీమ్ డ్రైవర్లలో రోలండ్ ఆరో స్థానంలో, డి గ్రాసి 14వ స్థానంలో నిలిచారు. • జాగ్వార్ టీమ్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు మిచ్ ఇవాన్స్, స్యామ్ బర్డ్ ఒకరినొకరు ట్రాక్‌పై ‘ఢీ’ కొట్టుకున్నారు. దాంతో ఇద్దరూ రేస్‌ను పూర్తి చేయలేకపోయారు. • మూడో స్థానంలో నిలిచిన మాజీ విజేత డి కోస్టాకు ఇది 100వ రేస్ కావడం విశేషం. • పెన్‌స్కే టీమ్‌కే చెందిన డిఫెండింగ్ చాంపియన్ స్టాఫెల్ వందూర్న్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. • 23వ ల్యాప్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ జేక్ హ్యూజెస్ కారు స్టీరింగ్ జామ్ అయి ఆగిపోవడంతో సేఫ్టీ కారును తీసుకోవాల్సి వచ్చింది. చివరకు అతనూ రేస్ పూర్తి చేయలేకపోయాడు. ఓవరాల్‌గా ఈ రేసులో ఆరుగురు డ్రైవర్లు రేసును పూర్తి చేయలేకపోయారు.

హైదరాబాద్ ‘ఇ’ రేసు ఫలితాలు (టాప్–10): 1. జీన్ ఎరిక్ వెర్నే (డీఎస్ పెన్‌స్కే: 46ని:01.099 సెకన్లు), 2. నిక్ క్యాసిడీ (ఎన్విజన్; 46ని:01.499 సెకన్లు), 3. ఫెలిక్స్ డి కోస్టా (పోర్ష్; 46ని: 02.958 సెకన్లు), 4. వెర్లిన్ (పోర్ష్; 46ని: 03.954 సెకన్లు), 5. సెటి కెమారా (నియో 333 రేసింగ్; 46ని: 04.622 సెకన్లు), 6. రోలండ్ (మహీంద్రా: 46ని: 08.237 సెకన్లు), 7. నార్మన్ నాటో (నిస్సాన్; 46ని: 08.417 సెకన్లు), 8. స్టాఫెల్ వాన్‌డూర్న్ (డీఎస్ పెన్‌స్కే; 46ని: 08.663 సెకన్లు), 9. లాటరర్ (అవలాంచె; 46ని: 9.802 సెకన్లు), 10. మొర్టారా (మసెరాటి; 46ని: 10.172 సెకన్లు).


జీన్ ఎరిక్ వెర్నే
నిక్ క్యాసిడీ
ఫెలిక్స్ డి కోస్టా

నగరానికి దక్కిన ‘భాగ్యం’

సాక్షి క్రీడా విభాగం



అక్టోబర్ 7, 2022... హైదరాబాద్‌లో ఫార్ములా ‘ఇ’ రేస్ నిర్వహించబోతున్నట్లు తొలిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన రోజు... ఇప్పుడు సరిగ్గా నాలుగు నెలల తర్వాత వచ్చిన స్పందనను చూస్తే ఈ రేసింగ్ ఈవెంట్ ఎంతగా సక్సెస్ అయ్యిందో అర్థమవుతుంది. ఫార్ములా ‘ఇ’ పోటీలను నిర్వహించే అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) కూడా హైదరాబాద్ పోటీలపై తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఫార్ములా ‘ఇ’ చరిత్రలో అత్యుత్తమ రేస్‌లలో ఒకటిగా ప్రకటించింది. హైదరాబాద్‌లో ‘ఇ’ రేసు జరుగుతుందని ప్రకటించిన సమయంలో ఇది సఫలం కావడంపై అనేక సందేహాలు కనిపించాయి. నగరం నడిబొడ్డున ‘స్ట్రీట్ సర్క్యూట్’ ట్రాక్‌ను సిద్ధం చేయడం అన్నింటికంటే పెద్ద సవాల్‌గా నిలిచింది. అత్యంత వేగంగా ఈ పనులు పూర్తి చేసిన అధికారులు హుస్సేన్ సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్, ఐమ్యాక్స్ పరిసరాలను రేసింగ్ కార్లకు అనుగుణంగా మార్చారు. అయితే గత నవంబర్‌లో దీనికి సన్నాహకంగా నిర్వహించిన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) ఆశించిన స్థాయిలో సఫలం కాలేదు. దానికి స్పందన గొప్పగా లేకపోగా, ఏర్పాట్లలో సాగిన లోపాలు, ట్రాక్‌పై డ్రైవర్ల అసంతృప్తి, రేస్‌ల వాయిదాలు వెరసి ప్రతికూల వ్యాఖ్యలు వినిపించాయి. దాంతో ఫార్ములా ‘ఇ’ నిర్వహణపై కూడా కొంత అపనమ్మకం వచ్చింది. అయితే ఎఫ్ఐఏ నేరుగా ట్రాక్ ఏర్పాటు అంశంలో భాగస్వామిగా మారి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేయించగలిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకంగా ఉన్న, ఫార్ములా ‘ఇ’ రేసింగ్‌లో జట్టు ఉన్న ‘మహీంద్రా’ కూడా సహభాగస్వామిగా భారత్‌లో తొలి రేసును విజయవంతం చేయడంలో చురుగ్గా పాల్గొంది. మరోవైపు ట్రాఫిక్ ఆంక్షలు, వాటిలో వచ్చిన ఇక్కట్లతో సామాన్యుల్లో తీవ్ర అసహనం కనిపించింది. శుక్రవారం ట్రాక్‌లోకి సాధారణ వాహనాలు దూసుకురావడం కూడా కొంత ఆందోళన రేపిన అంశం. అయితే సరైన సమయంలో స్పందించిన అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల అసంతృప్తిని సాధ్యమైనంతగా తగ్గించే ప్రయత్నం చేశారు. చివరకు అభిమానులు కూడా ఆసక్తిగా పెద్ద ఎత్తున హాజరు కావడం, తమ నగరంలో జరుగుతున్న అంతర్జాతీయ ఈవెంట్‌గా దానికి తగిన విలువ ఇవ్వడంతో ఇది సక్సెస్‌గా నిలవగలిగింది. భారత్‌లో ఢిల్లీ, ముంబైలాంటి నగరాలను కాదని హైదరాబాద్‌లో జరిగిన ‘ఇ’ రేసింగ్‌కు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరు కావడం కూడా దీనికి గల స్థాయిని చూపించింది. మొత్తంగా ఎఫ్ఐఏ కూడా సౌకర్యాలు, ఏర్పాట్ల విషయంలో ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం ఫార్ములా ‘ఇ’ రేసింగ్‌కు సంబంధించి పెద్ద సానుకూలాంశం. తాజా సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా మరో 12 రేస్‌లు మిగిలి ఉన్నాయి. వచ్చే ఏడాది వేదికపై ఇంకా స్పష్టత లేకున్నా... వచ్చే సీజన్‌లో కూడా హైదరాబాద్ మళ్లీ ఆతిథ్యం ఇవ్వడం పాటు శాశ్వత వేదికగా కూడా మారే అవకాశం ఉంది.

చాంపియన్ సురేఖ



సాక్షి, హైదరాబాద్: ఎన్టీపీసీ జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ విజేతగా నిలిచింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ టోర్నీ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో సురేఖ ‘టైబ్రేక్’లో మధ్యప్రదేశ్‌కు చెందిన రాగిణిని ఓడించింది. ఇద్దరూ 147–147తో సమంగా నిలువగా.. ‘టైబ్రేక్’ షాట్‌లో సురేఖ 10.. రాగిణి 9 పాయింట్లు స్కోరు చేశారు.

బ్లాక్‌హాక్స్‌కు రెండో ఓటమి

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఖాతాలో రెండో ఓటమి చేరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 14–15, 12–15, 11–15, 15–4, 14–15) కాలికట్ హీరోస్ జట్టు చేతిలో ఓడిపోయింది.

సినిమా


• రామ్‌చరణ్

హైదరాబాద్ టు వైజాగ్ వయా కర్నూలు

దర్శకుడు శంకర్ సినిమాల్లో పాటలు విజువల్ ట్రీట్‌లా ఉంటాయి. భారీ ఖర్చుతో పాటలు చిత్రీకరించడం శంకర్ స్టయిల్. పైగా ఒకే పాటను వివిధ రకాల లొకేషన్స్‌లో తీస్తుంటారు. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన పాటల చిత్రీకరణ అలానే జరుగుతోంది. ఈ చిత్రం కోసం రూ. 10 కోట్లకు పైగా బడ్జెట్‌తో న్యూజిల్యాండ్‌లో ఓ పాటను చిత్రీకరించారు. ఇప్పుడు మరో పాట చిత్రీకరణలో ఉన్నారు. ఈ పాటను తెలుగు రాష్ట్రాల్లోని డిఫరెంట్ లొకేషన్స్‌లో చిత్రీకరిస్తున్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ లొకేషన్‌లో ఈ పాట చిత్రీకరణ మొదలైంది. ఆ తర్వాత కర్నూలులోని కొండారెడ్డి బురుజు లొకేషన్‌లో, ఆ నెక్ట్స్ వైజాగ్‌లోని జగదాంబ సెంటర్‌లో చిత్రీకరణను ప్లాన్ చేశారు. కొండారెడ్డి బురుజు దగ్గర కొంత భాగం చిత్రీకరించి, వైజాగ్ షిఫ్ట్ అయింది యూనిట్. ఈ పాటను దాదాపు రూ. 5 కోట్ల బడ్జెట్‌తో తీస్తున్నారని టాక్. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, శ్రీకాంత్, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు చేస్తున్నారు. ‘దిల్’ రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంగీతం: తమన్.

నా భర్త విడాకులకు నేను కారణం కాదు

- హన్సిక


• హన్సిక, సోహైల్

గత ఏడాది డిసెంబరు 4న వ్యాపారవేత్త సోహైల్ కతురియా, హీరోయిన్ హన్సికల వివాహం జరిగిన విషయం తెలిసిందే. వీరి ప్రేమ, పెళ్లి గురించిన సంగతులతో ‘లవ్ షాదీ డ్రామా’ అనే వీడియో ఒకటి ఓ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వీడియోలో హన్సిక పంచుకున్న విషయాల్లో సోహైల్ మొదటి పెళ్లి గురించిన అంశం ఒకటి. ‘‘సోహైల్, నా పెళ్లి గురించిన విషయాలను రహస్యంగా ఉంచాలనుకున్నాను. నేను సెలబ్రిటీని కావడం వల్ల కాబోలు అవన్నీ బహిర్గతం అయ్యాయి. సోహైల్ విడాకులు తీసుకోవడానికి నేనే కారణమని వార్తలు వచ్చాయి. సోహైల్ పెళ్లి (మొదటి పెళ్లి)లో నేను పాల్గొన్న ఫోటోలను షేర్ చేసి, కొందరు నన్ను విమర్శించారు కూడా. నిజం చెప్పాలంటే సోహైల్ విడాకులకు నేను కారణం కాదు. నా భర్తకు గతంలో పెళ్లయిన విషయం నాకు తెలుసు. వారికి అధికారికంగా విడాకులు వచ్చాయి’’ అని చెప్పుకొచ్చారు హన్సిక. అలాగే ‘‘గతంలో నేనో రిలేషన్‌లో ఉన్నాను. ఈ విషయం అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి బంధాన్ని కొనసాగించాలని లేదు. అందుకే పెళ్లి చేసుకున్నాను. సోహైల్ నా జీవితంలోకి వచ్చిన క్షణాలు నాకు ఎప్పటికీ ప్రత్యేకమే. ఇకపై నా భర్తతోనే నేను పబ్లిక్‌లోకి రావాలనుకుంటున్నాను’’ అని కూడా పేర్కొన్నారు హన్సిక. ఇక తన మొదటి వివాహం విఫలం కావడానికి హన్సిక కారణం కాదని సోహైల్ కూడా పేర్కొన్నారు. 2014లో రింకీ బజాజ్‌ను పెళ్లాడారు సోహైల్. ‘‘ఆ వివాహ బంధం చాలా కొద్ది కాలం మాత్రమే సాగింది’’ అన్నారు సోహైల్. రింకీ, సోహైల్‌కి హన్సిక కామన్ ఫ్రెండ్ కావడంతో ఆ పెళ్లికి వెళ్లారామె. ఆ పెళ్లి వీడియోలో హన్సిక డ్యాన్స్ చేశారు కూడా. ఆ వీడియోను షేర్ చేసి, ఒక ఫ్రెండ్ వైవాహిక జీవితం ముగియడానికి కారణం హన్సిక అంటూ వచ్చిన వార్తలకు ‘లవ్ షాదీ డ్రామా’ ద్వారా స్పందించారు హన్సిక, సోహైల్.

ఆర్ఆర్ఆర్.. ఓ కనువిందు

- స్టీవెన్ స్పీల్‌బర్గ్


• రాజమౌళి, స్టీవెన్ స్పీల్‌బర్గ్

‘ఆర్ఆర్ఆర్’ సినిమాని ప్రశంసించారు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్. ఆయన దర్శకత్వంలో వచ్చిన హాలీవుడ్ చిత్రం ‘ది ఫేబుల్‌మ్యాన్స్’ గత ఏడాది నవంబరులో రిలీజ్ అయింది. ఈ చిత్రాన్ని ఈ నెల 10న రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఇండియాలో రిలీజ్ చేసింది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను దర్శకుడు రాజమౌళితో ఆన్‌లైన్ వేదికగా ఇంటర్వ్యూ చేయించారు సంస్థ ప్రతినిధులు. ఈ ఇంటర్వ్యూలోని కొన్ని విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా, ఈ ఇంటర్వ్యూ వేదికగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ‘ఆర్ఆర్ఆర్’ను మెచ్చుకున్నారు స్పీల్‌బర్గ్. ‘‘దర్శకుడు రాజమౌళిని తొలిసారి కలుసుకున్నప్పటికి నేను ‘ఆర్ఆర్ఆర్’ సినిమా చూడలేదు. ఇటీవల ఈ సినిమా చూశాను. ఐ క్యాండీ (కనువిందు)గా అనిపించింది. అద్భుతంగా ఉంది’’ అన్నారు స్పీల్‌బర్గ్. ఆ ప్రశంసలకు రాజమౌళి స్పందిస్తూ.. మీరు (స్టీవెన్ స్పీల్‌బర్గ్) సినిమా చూసినందుకు చాలా ఆనందంగా ఉందనీ, సంతోషంతో డ్యాన్స్ చేయాలనిపిస్తోందనీ అన్నారు. ‘ది ఫేబుల్‌మ్యాన్స్’ను తాను చూశానని, నచ్చిందని కూడా రాజమౌళి పేర్కొన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/M.Tech/ C.Govt. Asst. Engineer (IOCL)/ 80,000/-pm/5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10306]

మాల క్రిస్టియన్ / M.Tech / C.Govt. PO(SBI)/ 90,000/-pm / 5'9" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10306]

మాల హిందూ/ M.Tech / C.Govt. Income Tax Inspector/ 1 Lakh PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10306]

పద్మశాలి/M.Tech, NIT / Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept. / 13 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9908209244 [HA-13843]

వడ్డెర/కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept./80,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-13843]

క్రిస్టియన్ మాల/కట్న ప్రసక్తిలేదు/M.Tech/ C. Govt. Asst. ఇంజినీర్ / రైల్వే / 90,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13843]

వడ్డెర/కట్న ప్రసక్తిలేదు / B.Tech / Govt. ల్యాండ్ సర్వేయర్ / రెవెన్యూ Dept./ 38,000/-pm, 6' ఎత్తు. 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10304]

యాదవ/కట్న ప్రసక్తిలేదు /B.Tech / Govt. Asst. ఇంజినీర్ / ఎలక్ట్రికల్ Dept. / 1.15 Lakh p/m, 6' ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10304]

SC హిందూ మాదిగ/M.Tech/ Govt. ఎగ్జి॥ ఇంజినీర్/ BHEL/ 80,000/- pm, 5'10" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10304]

కమ్మ/M.Tech/ Govt. Asst.ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept./ 75,000/- pm, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-10304]

రజక/కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. బ్రాంచ్ మేనేజర్ / యూనియన్ బ్యాంక్/ 80,000/- pm, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10304]

SC హిందూ మాల/కట్న ప్రసక్తిలేదు/ M.Tech / Govt. గెజిటెడ్ ఆఫీసర్/ ఇరిగేషన్ Dept. / 90,000/- pm, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10304]

2వ పెళ్లి/ 39yr/ Govt/ ఎంప్లాయ్ 2,50,000/- (PM) కుల ప్రసక్తి లేదు/ బాగా స్థిరపడిన అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 9959815362 [H-793363]

రజక/27y/ 5'7"/ B.Tech/ Govt. Job/ 24 L PA & 31y/5'5"B.Tech/ AE/ Govt. Job/ 80K p/m వరులకు డిగ్రీ, PG వధువులు కావలెను. కొట్ల శ్రీనివాస్ మ్యారేజ్ బ్యూరో. Ph: 8106303155 [H-792974]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 5' 7", SWE, H1, 150 K, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE BITS, 28, 5'10", SWE, 120 K Pounds, 5 Cr. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 23, 5' 8", Engineer, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (BITS), 28, 5' 9", SWE, 24 L P/A, 6 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, MS, 25, 5' 5", Doctor, 30 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 23, 5' 8", 20 Crores, UK, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 4", Team Leader, 135 K, H1, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 23, 5'6", 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Business, BS, MS, 28, 5' 10", 25 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', SWE, 200 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DNBSS, 27, 6', Doctor, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 39, 5' 8", Sr SWE, 60 L P/A, 15 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 23, 5' 4", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 4", SWE, 200 K, 2 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MHA, 28, 5' 4", Doctor, 5 Crores, UK. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 30, 5' 4", SWE, 11 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

2వ పెళ్లి/కులప్రసక్తి లేదు/B.Tech/ Govt. A.E/APPDCL/70,000/-pm/ 5'8" ఎత్తు/ 45 సం॥ల పిల్లలు లేని సెటిల్డ్ వరునికి వధువు కావలెను. ఫోన్: 9550650024. [HA-13853]

కాపు, 2వ పెళ్లి, 59Y, Govt. ఎంప్లాయి,/ 90,000/-pm, Own House, etc. గల వరునికి వధువు కావలెను. అర్జెంట్ ఫోన్: 9701605100. [HA-13853]

కాపు, మున్నూరు కాపు,/33/5'5"BHM హోటల్ మేనేజ్‌మెంట్ జాబ్/లండన్/30 Lakhs P.A/ వెల్ సెటిల్ ఫ్యామిలీ వరుడికి ఇంటర్/డిగ్రీ/PG సాంప్రదాయ వధువు కావలెను. ఫోన్: 9346344474. [HA-13853]

క్రిస్టియన్ & SC మాదిగ/M.Tech, NIT / B.Tech, మెకానికల్ / C. Govt. A.E.E ONGC / 1,40,000/-pm/ 5'9" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. ఫోన్: 9515755529, 9912280929. [HA-13852]

SC & క్రిస్టియన్ మాల/B.Tech, EEE / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 80,000/-pm / 5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు ఫోన్: 9676995093. [HA-13852]

కాపు & మున్నూరు కాపు/B.Tech, MBA / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 12 Lakhs. P.A / 5'9" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు ఫోన్: 9515755529. [HA-13852]

బెస్త/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / ఆంధ్రా బ్యాంక్ 78,000/-pm / 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 7288048678. [HA-13852]

నాయి బ్రాహ్మణ/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / SBI / 78,000/-pm / 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 9581317506. [HA-13852]

వడ్డెర / B.Tech / SWE / 30 Lakhs. P.A / 5'8" ఎత్తు / 29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 9618579861. [HA-13852]

SC మాల/ఏకైక కుమారుడు/B.Tech/C.Govt. Jr. ఇంజినీర్/పవర్ గ్రిడ్ కార్పొరేషన్/1 లక్ష pm / 5'10" ఎత్తు/29 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 8897389698. [HA-13852]

SC మాదిగ / B.E / C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ONGC / 1,20,000/-pm / 5'11" ఎత్తు / 30 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 7032058965. [HA-13852]

రజక / B.Tech / C.Govt. Jr. ఇంజినీర్ / రైల్వే / 50,000/-pm / 5'9" ఎత్తు / 27 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 8897389698. [HA-13852]

రెడ్డి/45/5'7"/MBA/బిల్డర్/హైదరాబాద్‌లో కోట్ల ఆస్తి గల రెడ్డి వరుడికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ వాట్సప్. ఫోన్: 9032744799. [HA-13853]

2వ పెళ్లి, గోల్డ్‌స్మిత్, CNB, 43, 5'6" ఇంటర్, 1,20,000/-pm/ 1cr. ప్రాపర్టీ ఓన్ హౌస్ & షాప్ వరునికి వధువు కావలెను. అర్జెంట్ ఫోన్: 6303293337, వాట్సప్: 8187053655 [HA-13853]

లేట్ మ్యారేజ్/ హిందు/ఇంటర్ caste/ 50y/Sr. బిజినెస్ అడ్వైజర్(స్టాక్ మార్కెట్) 5Cr ఆస్తి గల వరుడికి డిగ్రీ చదువుకున్న లేట్ మ్యారేజ్ వధువు కావలెను. Ph: 9618050335 [H-793363]

Reddy Now Hyd. 29/6'/ B.Tech, MS USA 20 Cr. * 28/6'/ B.Tech, IIT MS USA * 32/5'10"/ Residency USA. Cont: PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 2nd Marriage 34/5'10"/ B.Tech, MS USA * 42/5'11"/ B.Tech, MS USA Citizen * 42/5'7"/ 500K PM/ Citizen - PP REDDY: 9391198332 [HA-2517]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

★★

డైరెక్ట్: కాపు/5'5"/ 56 Years/M.Sc./ కుల పట్టింపు లేదు. నెలకు 45వేల ఆదాయం కలిగి, 70 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న మహిళ కావలెను. వివరాలకు: 83414 82731. [K- 1232842]

క్రిస్టియన్ మాల/MCA/ 32Y, IT ఉద్యోగి, 2లక్షలు-pm, హైట్:5.7/వరుడుకి వధువు కావాలి / నెల్లూరు ఫ్యామిలీ ప్రిఫర్డ్ / నోబ్రోకర్లు, డైరెక్ట్ : 90663 66214. [N-5320]

Direct: కోనసీమ కాపు/ 36, 5'6" వరుడికి రాజకీయ వృత్తి ఇష్టం ఉన్న గొప్ప వధువు కావలెను. Ph: 9113679022 [WB-50953]

రిటైర్డ్ ప్రొ॥ Now Govt. సర్వీస్ 1L PM, 65Y ఏ బాధ్యతలు లేని వ్యక్తి కి 55సం॥పైబడి ఏబాధ్యతలు లేని O.C వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ © 80746 96179, 79950 45904. [O-786978]

కుల పట్టింపులేదు/45yr/ 5'3"/లేట్ మ్యాచ్ Govt టీచర్ 80K (PM) సింగిల్ సెటిల్డ్ గల వధువుకు 1వ, 2వ విడో గల వరుడు కావలెను సంప్ర: Ph: 7286031653 [H-793363]

యాదవ/ B.Tech / C. Govt. Asst. Manager (Canara Bank)/ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10306]

మాల క్రిస్టియన్/ B.Tech / C. Govt. Officer (Income Tax)/ 55,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10306]

క్రిస్టియన్ మాల / 50 లక్షల ఆస్తి / ఏకైక కుమార్తె/ M.Sc-Agri/ Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ A.E.O/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13843]

క్రిస్టియన్ మాల / B.Tech / SWE/ 30,000/-pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన SWE/Govt. ఎంప్లాయి వరుడు కావలెను. Ph: 7396369922 [HA-13843]

వాల్మీకి బోయ/ఏకైక కుమార్తె/ B.Tech / Govt. AEE/ ఇరిగేషన్ Dept./ 45,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10304]

ముదిరాజ్/ ఏకైక కుమార్తె / B.Tech / Govt. Jr. Asst./ ట్రాన్స్‌కో/ 40,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10304]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / C. Govt. డిప్యూటీ మేనేజర్/ SBI బ్యాంక్/ 85,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10304]

క్రిస్టియన్ మాల/ M.Com / C. Govt. అకౌంటెంట్ ఆఫీసర్/ FCI/ 60,000/-pm/ 5'5" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10304]

ఆర్యవైశ్య/23y/ 5'3"/ 30 వేలు/ 20 లక్షలు & 28y/ 5'4"/ 45 వేలు/ 35 లక్షలు & రెండో పెళ్లి/35y/ 5'2"/ 50 వేలు/ 40 లక్షలు & 43y/ 5'1"/ 25 వేలు/ 65 లక్షలు/ జి. సుబ్రహ్మణ్యం/ "మాసేవ". PH/WA: 9291503949 [H-792933]

రెండో పెళ్లి/కుల పట్టింపులేదు/ 54y/ 5'2"/ Govt./ 90 వేలు/ 2 కోట్లు & 45y/ 5'4"/ 80 వేలు/ ఒక కోటి & 36y/ 5'3"/ 35 వేలు/60 లక్షలు/ "మాసేవ". PH/WA: 9291503949 [H-792933]

బలిజ/కాపు/నాయుడు/24y/ 5'3"/ 30 వేలు / 50 లక్షలు & 29y/ 5'5"/ 45 వేలు/ 35 లక్షలు & రెండో పెళ్లి/34y/ 5'4"/ 75 వేలు/80 లక్షలు & 42y/ 5'2"/ 45 వేలు/ 65 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

మాల/22y/ 5'2"/ 25 వేలు/ 20 లక్షలు & 27y/ 5'3"/ 40 వేలు/ 30 లక్షలు & మాదిగ/26y/ 5'1"/ 55 వేలు/50 లక్షలు & 32y/ 5'4"/ 40 వేలు/ 70 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

రెడ్డి/23y/ 5'5"/ 80 వేలు/ 90 లక్షలు & 27y/ 5'4"/ 55 వేలు/ 60 లక్షలు & రెండో పెళ్లి/33y/ 5'3"/ 65 వేలు/70 లక్షలు & 38y/ 5'2"/ 40 వేలు/ 38 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

కాపు/నాయుడు/విడో/60/తక్కువ చదువు / సొంతబిజినెస్/ 2 ఇళ్ళు/2 ఎకరముల పంట పొలము కల సాంప్రదాయ వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8179141662 [H-793274]

రెడ్డి/విడో/59y/ 5'5"/ V.Fair/ Govt. (HM) రిటైర్డ్/ పెన్షనర్/సొంత ఇల్లు, ఆంధ్రాలో పొలాలు/ కోట్ల ప్రాపర్టీ/ పిల్లలులేని వెల్‌సెటిల్డ్ సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల అస్తి ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-793274]

బ్రాహ్మిన్స్/52y/విడో/ B.Ed./ సొంత ఇల్లు/ ఫ్యామిలీ పెన్షనర్/ 3 ఎకరాల ల్యాండ్ కల వధువుకి కుల, అస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9121433952 [H-793274]

కమ్మ/విడో/ 59Y/ 5'3"/ ప్రావట్ అంధ్ర Hydలో/ సొంతబిజినెస్/ రెంట్స్ మంచి అస్తి గల వధువుకి కుల, అస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (ఇల్లరికం, వారికే ప్రాధాన్యత (నో బ్రోకర్స్) Ph:7799083500, 7386660643 [H-793274]

2వ పెళ్లి/35yr / Govt / ఎంప్లాయ్ 2,00,000/- (PM) కుల ప్రసక్తి లేదు/ బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 9502046384 [H-793363]

2వ పెళ్లి/ కుల ప్రసక్తి లేదు/40yr/M.Sc./M.Ed Govt లెక్చరర్ 1 లక్ష (PM) 5 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 7396213324 [H-793363]

కుల పట్టింపులేదు/విడో/45y/Dept. of PR & RD/ 1L pm/ Own House/ 10 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9701385407 [H-787499]

రెండో పెళ్ళి/విడో/55y/ Guntur/ లెక్చరర్/ Own House Rents కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని ఏ బాధ్యతలులేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (పిల్లలున్నా OK). Ph: 8519803423 [H-787499]

కుల పట్టింపులేదు/విడో/48y/Govt. Job/ VRS/ Own Bussiness well settled/ Own House/ 12 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ఆస్తి కలిగిన అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. (ఇల్లరికం/పిల్లలున్నా OK). Ph: 9177631661 [H-787499]

కుల ప్రసక్తిలేదు/విడో/44y/Dept. of NPPA/ 1L pm/ Own House 18 ఎ॥ తోటలు/ కోట్ల ప్రాపర్టీ కలిగిన ఆర్థికంగా వెల్‌సెటిల్, అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8885985513 [H-787499]

FC/53y/ విడో/ 5'3"/ Fair / Own Business/ సొంత ఇల్లు గల సాంప్రదాయమైన వధువుకి వరుడు కావలెను. (CNB). Ph: 9346327887 [H-792974]

కమ్మ/Unmarried/ 28y/ 5'4"/ USA Bank Job/ చేపల చెరువులు, కొబ్బరి తోటలు, కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9515117629 [H-792974]

రెడ్డి/Unmarried/ 29y/ 5'4"/ Architecture in USA/ Phyrolysis Industries/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7382055839 [H-792974]

SC/ 25 / 5'5" / MBBS, MD Gynic, AIIMS Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. No Brokers ఫోన్: 9493285326. [HA-13853]

రెడ్డి, విడో/కుల, అస్తి ప్రసక్తి లేదు, A:30, Q:డిగ్రీ, బిజినెస్సులు గల అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9100717575. [HA-13853]

BC / 39 / 5'2" / డిగ్రీ, విడో, బ్యాంక్ పెన్షనర్, 6 L.P.A / Hydలో సొంత ఫామ్ హౌస్, 25 cr స్థిరాస్తి గల పెయిర్ వధువుకు బాదరబందీ లేని ప్రొఫెషనల్ వరుడు కావలెను. ఫోన్: 9573943211, 9848929647. [HA-13853]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ * 28 / 5'2" / B.Sc * 30 / 5'3" ఇంటర్ * 27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్, బిజినెస్ ok పురోహితులకు సం॥ధాలు కలవు ఫోన్: 7815999246. [HA-13853]

రెడ్డి అమెరికా, డివోర్స్ 31 సం॥లు, సాఫ్ట్‌వేర్ * రెడ్డి డివోర్స్, 35 సం॥లు, యూరప్‌లో జాబ్ * రెడ్డి, 42 సం॥లు, లేట్ పెళ్లి, జాబ్, తగిన వరులు కావలెను. ఫోన్: 6304826162. [HA-13853]

రెడ్డి/27 yrs/5'4"/ B.Tech/ కలర్: Fair/ సాఫ్ట్‌వేర్ జాబ్/85K PER Month: అందమైన వధువుకి వరుడు కావలెను. any Caste అయిన Ok. Ph: 7995825318 [H-793703]

OC Caste/ 40yrs/ 5'2"/ MBA/ కలర్: Fair/ Govt జాబ్/ 70K per Month. అందమైన వధువుకి వరుడు కావలెను. any Caste అయిన Ok. Ph: 8500427582 [H-793703]

FC/విడో/60yrs/V.Fair/డిగ్రీ/5'4"/ సొంత ఇల్లు & రెంట్స్/ House wife/50k/- pm/ 2 ఎకరాల పంట పొలం కల వధువుకి కుల పట్టింపులేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9059150892 [H-793703]

2వ పెళ్లి / B.Tech / Govt. Jr. Asst / కలెక్టరేట్ ఆఫీస్ / 40,000/-pm / 5'2" ఎత్తు / 28 సం॥ల వధువుకు వరుడు కావలెను ఫోన్: 9963757612. [HA-13852]

Reddy 26/ 5'5"/ B.Tech, MS USA/ Very Fair/ 50 Cr. * 28/ 5'5"/ BDS US Public Health H1. PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 25/ 5'5"/ MD (Radiology) 2nd Yr. * 27/ 5'5"/ V. Fair, B.Tech/SWE Hyd* 25/ 5'5"/ MD (Gen). PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 2nd Marriage 32/ 5'4"/ MBBS Govt. Dr. * 32/ 5'6"/ B.Tech/ SWE/ V.Fair * 25/ 5'4"/ B.Com. PP REDDY: 9391198332 [HA-2517]

★

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్. 7013362957 [HA-13817]

★★

క్రైస్తవ/మాల/ప్రభుత్వ టీచర్/B.Sc.,B.Ed/41/ 5'2"/Fair/ డైవర్సీ వధువుకు క్రైస్తవ వరుడు కావలెను. తూ॥గో॥/ప॥గో॥ వారికి ప్రాముఖ్యత/ వారి బయోడేటా/ఫోటోతో వాట్సాప్ 99897 70090 నకు పంపగలరు. నో ఫోన్ కాల్స్. [R-388]

Direct. Konaseema Kapu, 32, 5'4", BA seeks tall educated rich husband below 50. Ph: 9113679022 [WB-50521]

వరుడు కావలెను



రెడ్డి 40yr/5'4"/ కుల పట్టింపులేదు/MA, English/ Govt ఎంప్లాయ్ 70K (PM) వెల్ సెటిల్డ్, బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: Ph: 8008474869 [H-793363]

NO CASTE BAR/1, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరుడు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే Ph: W: 7794960803 [H-793703]

వేదికలు



వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

క్రైస్తవ వివాహ పరిచయ వేదిక www.indiachristianmatrimony.com 10,000 మంది ప్రొఫైల్స్‌తో ప్రతి శనివారం వివాహ వేదిక @ అమృత వాణి, Secbad. Ph: 8885073555, 8885428555 [H-793274]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-787499]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155 / 9391265304. [H-792974]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com © 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పెళ్లి/విదేశ సంబంధాలకై సం॥ S.వాముల గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-793251]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధ్రువ మ్యారేజెస్. 9949395407 [H-787368]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

మాల, మాదిగ : IAS, IPS, IRS, RTS, IES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-8470]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-906]

మాదిగ వివాహ పరిచయ వేదిక. 12-2-23, 12-6PM, ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారి ప్రొఫైల్ హాల్‌లో డిస్ప్లే చేస్తాము. # సికింద్రాబాద్ స్టేషన్. 9347046175 [H-793265]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsapp No.) [HA-863]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యవైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

★★

అన్ని కులముల వారికి మొదటి, రెండవ, లేటు సంబంధములు వెంటనే కుదర్చబడును. స్త్రీలకు ప్రత్యేక ఆఫర్ కలదు. Cell No: 95028 53265, 73962 92553 [R-1188056]

గౌడ, శెట్టిబలిజ, ఈడిగ వివాహ పరిచయ వేదిక తేది.26-02-2023, టైం : ఉ॥ 9గం॥ల. వేదిక : ఆషా ఫంక్షన్ హాల్, విజయ హాస్పిటల్ ప్రక్కన, స్వీట్ మ్యాజిక్ (OP), పడమట, విజయవాడ. ఫోన్: 92478 80567, 62810 09298 [V- 5631]

Kalyani Matrimony : కాపు, కమ్మ, గౌడ, బ్రాహ్మణ, వెలమ, వైశ్య వారి ఉన్నతమైన సంబంధం కొరకు వెంటనే సంప్ర: 8500747535, 9533133969 రెండవ సంబంధములు కూడా చూడబడును. [H-793269]

'అనంత' కొండల్లో కృష్ణ జింకల సందడి

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3 వేల వరకు జింకలు ఉన్నట్టు అంచనా
- ఏటా 200 వరకు పెరుగుతున్నట్టు గుర్తింపు
- ఇక్కడి కుంటలు, చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉండటమే కారణం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఏపీ రాష్ట్ర జంతువైన కృష్ణ జింకల సంతతి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరుగుతోంది. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని కొండలు, గుట్టల్లో ఎక్కడ చూసినా కృష్ణ జింకలు కనిపిస్తున్నాయి. నాలుగేళ్లుగా వర్షాలు పడుతుండటం.. కుంటలు, చెరువుల్లో నీళ్లు పుష్కలంగా లభ్యమవుతుండటం.. రుచికరమైన పశుగ్రాసాలు ఇక్కడ పెరుగుతుండటం కృష్ణ జింకలకు ఇక్కడ వాతావరణం స్వర్గధామంలా ఉన్నట్టు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3 వేలకు పైగా జింకలున్నట్టు చెబుతుండగా.. వాటిలో 2 వేల వరకూ కృష్ణ జింకలే ఉన్నాయని చెబుతున్నారు.

అనువైన ప్రదేశం కావడంతో ..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రెండు లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. చిన్న చిన్న గుట్టలు, చిట్టడవులు ఇక్కడ ఉన్నాయి. ఈ ప్రాంతం వాటికి ఆవాస యోగ్యంగా మారటంతో కర్నూలు, వైఎస్సార్ జిల్లాల నుంచి కూడా జింకలు ఇక్కడికి తరలివస్తున్నట్టు తేలింది. పెనుకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోని పచ్చిక బయళ్లలో జింకలు తిరుగుతూ చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఏడాది 200కు పైగా జింకలు సంతానోత్పత్తి చేస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు.

67 రకాల పశుగ్రాసం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 67 రకాల పశుగ్రాసం ఉందని శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ల బృందం గుర్తించింది. ఈ పశుగ్రాసాన్ని జింకలు బాగా ఇష్టపడుతున్నాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఇన్నిరకాల పశుగ్రాసం మరే ఇతర జిల్లాలోనూ లేదని పేర్కొంటున్నారు. ఎక్కువ రకాల గడ్డి జాతులు ఇక్కడ ఉండటంతో పాటు మంచి రుచికరమైన, శక్తివంతమైన గ్రాసం లభిస్తుండటంతో జింకలు ఆరోగ్యకరంగా పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు.

చిరుతలు.. తోడేళ్లూ ఉన్నాయ్

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 2 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 1.25 లక్షల హెక్టార్లలోను, అనంతపురం జిల్లాలో 0.75 లక్షల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ 30 వరకు చిరుత పులులు ఉన్నట్టు చెబుతున్నారు. అంతరించి పోయే జాబితాలో ఉన్న తోడేళ్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 వరకు ఉన్నాయని అంచనా.



జింకల వృద్ధి గణనీయం

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో కృష్ణ జింకల వృద్ధి గణనీయంగా ఉంది. ఇక్కడి వాతావరణం, చిట్టడవులు వీటికి సానుకూలం. అన్నిటికంటే ఇక్కడి గ్రాసం అద్భుతమైనదని ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్లు గుర్తించారు. దీంతో రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా ఇక్కడ జింకల వృద్ధి జరుగుతోంది. వీటిని కాపాడుకునేందుకు అన్నివిధాలా చర్యలు చేపట్టాం.

– సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్ట్ అధికారి





అనంతపురం జిల్లా ఉరవకొండ సమీపంలో కృష్ణ జింకల సందడి

ఆ వాహనాలు ఇక తుక్కే..

- 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాల రిజిస్ట్రేషన్లకు చెక్

సాక్షి, అమరావతి: వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని కేంద్ర రవాణా శాఖ నిర్ణయించింది. 15ఏళ్లు దాటిన రవాణా వాహనాలను ఇతరులకు విక్రయిస్తే ఇక మీదట రిజిస్ట్రేషన్లు చేయకూడదని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. కాలం చెల్లిన డీజిల్ వాహనాలు అత్యధికంగా వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు క్రమంగా విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా కట్టడి చేసేందుకు ఉద్యుక్తమైంది. అందుకోసం ప్రత్యేకంగా స్క్రాప్పింగ్ యూనిట్లు నెలకొల్పుతున్నది. దేశంలో 15ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలు దాదాపు 15లక్షల వరకు ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనాలను తుక్కు కింద మార్చాలని నిర్ణయించారు. ఇక ప్రైవేటు రంగంలో ఉన్న కాలం చెల్లిన వాహనాలను కూడా నియంత్రించేందుకు వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని కేంద్రం భావించింది. పాత వాహనాలను తుక్కు కింద మారిస్తే ప్రత్యేక సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ను చూపిస్తే కొత్త వాహనాల ధరలో రాయితీ ఇస్తారు. దాంతో కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేసేందుకు ప్రోత్సహించినట్లు అవుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈమేరకు గత ఏడాది నవంబరులోనే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై సలహాలు, సూచనల కోసం ఇచ్చిన మూడు నెలల గడువు తాజాగా ముగిసింది. దాంతో 15ఏళ్లు దాటిన రవాణా వాహనాలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేసేందుకు ఉద్యుక్తమవుతోంది. దీనిపై త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనుంది.


ప్రత్యేక కేటగిరీ కింద దివ్యాంగుల వాహనాలు

దివ్యాంగులు కొనుగోలు చేసే వాహనాలను ప్రత్యేకంగా 'దివ్యాంగ్ కేటగిరీ' కింద రిజిస్ట్రేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త, పాత వాహనాల కొనుగోలుకు ఈ విధానాన్ని వర్తింపజేస్తారు. డ్రైవర్లను పెట్టుకుని నిర్వహించేందుకు కొనుగోలు చేసే వాహనాలకు కూడా ఇదే కేటగిరీలో రిజిస్ట్రేషన్ చేస్తారు. వారికి దివ్యాంగుల కేటగిరీలో జీఎస్టీలో రాయితీలు ఇచ్చేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

రక్తహీనతకు చెక్

సమస్య గుర్తింపునకు రాష్ట్రవ్యాప్తంగా 10-19 ఏళ్ల బాలికలకు స్క్రీనింగ్

- ఇప్పటివరకు 26 వేల పాఠశాలల్లో 11.46 లక్షల మందికి నిర్వహణ
- 3.72 లక్షల మందిలో మైల్డ్, 4.45 లక్షల మందిలో మోడరేట్, 3,064 మందిలో తీవ్ర అనీమియాగా గుర్తింపు
- సమస్య పరిష్కారానికి వైద్యశాఖ చర్యలు
- విద్యా సంస్థల్లో ఫోలిక్ మాత్రలు, పౌష్టికాహారం పంపిణీ



సాక్షి, అమరావతి : రోజురోజుకు చాపకింద నీరులా విస్తరిస్తున్న రక్తహీనత సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. పిల్లలు, యువత, మహిళల్లో ఈ సమస్య నివారణకు ప్రత్యేక కార్యాచరణతో వైద్యశాఖ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా.. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఐరన్ రిచ్ ఫుడ్ అందించడంపై దృష్టిపెట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. నిజానికి.. కౌమార దశలో రక్తహీనత సమస్య బారినపడే అవకాశాలు బాలికల్లో ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో వీరి ఆరోగ్యంపట్ల ప్రత్యేక చొరవ చూపిన ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లోని 10–19 ఏళ్ల బాలికల్లో రక్తహీనత సమస్య గుర్తించడానికి స్క్రీనింగ్ నిర్వహిస్తోంది.

11.46 లక్షల మందికి స్క్రీనింగ్ పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా 31,632 పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 12.69 లక్షల మంది బాలికలకు స్క్రీనింగ్ నిర్వహించాల్సి ఉంది. ఇప్పటివరకూ 26,404 పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 11,46,529 మందికి స్క్రీనింగ్ చేశారు. వీరిలో 3,72,535 మంది మైల్డ్.. 4,45,919 మంది మోడరేట్.. 3,064 మందిలో తీవ్ర అనీమియా ఉన్నట్లు గుర్తించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాఠశాలలు, కళాశాలలు సందర్శించి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఫోలిక్ మాత్రల పంపిణీ

రక్తహీనతతో బాధపడుతున్న బాలికలకు ఫోలిక్ మాత్రల పంపిణీ, అవసరమైన వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మైల్డ్ అనీమియా ఉన్న వారికి ప్రతి గురువారం పాఠశాలలో ఫోలిక్ మాత్ర ఇస్తున్నారు. మోడరేట్ అనీమియాతో బాధపడుతున్న వారికి రోజుకు రెండు మాత్రల చొప్పున మూడు నెలలపాటు ఇస్తున్నారు. అనంతరం తిరిగి పరీక్షలు నిర్వహిస్తారు. సివియర్ అనీమిక్‌గా ఉన్న వారిని దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసి వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇవ్వడం లేదా కృత్రిమంగా రక్తం ఎక్కించడం చేస్తున్నారు. మరోవైపు.. పీహెచ్‌సీ వైద్యులందరికీ రక్తహీనత సమస్య నియంత్రణపై ప్రత్యేక శిక్షణనిచ్చారు.



సుఖవంతమైన డ్రైవింగ్ వెనుక పొంచివున్న పెనుముప్పు

ఈ కారణంతోనే హైవేలపై 60 శాతం రోడ్డు ప్రమాదాలు

హైవే హిప్నోసిస్.. ప్రయాణం మాటున ప్రమాదం

2-3గంటలు ప్రయాణం చేసిన తరువాత ఈ స్థితిలోకి..

- అప్రయత్నంగా మెదడు విశ్రాంతిలోకి వెళ్లడమే హైవే హిప్నోసిస్
- ప్రొఫెషనల్ డ్రైవర్ల కంటే సాధారణ వ్యక్తులపైనే ఈ ప్రభావం ఎక్కువ
- జాగ్రత్తలు పాటిస్తేనే ఈ తరహా ప్రమాదాలకు చెక్ : నిపుణులు

సాక్షి, అమరావతి

నాలుగు లేదా ఆరు వరుసల హైవేలు.. మధ్యలో డివైడర్లు ఉండటంతో ముందునుంచి వాహనాలకు ఆస్కారమేలేదు.. ఎక్కడోగానీ మలుపులు లేకుండా నల్లత్రాచులా రోడ్లు.. మరోవైపు, ఆధునిక ఫీచర్లతో కార్లు.. ఏసీతో చుట్టూ చల్లదనం.. ఆడియో సిస్టం నుంచి మంద్రంగా సంగీతం.. దీంతో వేగంగా దూసుకుపోయే



కార్లు.. ఇంకేముంది.. పెద్దగా శ్రమలేకుండానే ప్రయాణించవచ్చని అనుకుంటాం. కానీ, ఈ అత్యంత సౌకర్యవంతమైన డ్రైవింగ్ వెనుక ఓ పెనుముప్పు కూడా పొంచి ఉంది. అదే హైవే హిప్నోసిస్ స్థితి. ఇటీవల జాతీయ రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలకు ప్రధాన కారణమిదే. తగిన జాగ్రత్తలు పాటిస్తేనే ఈ స్థితికి గురికాకుండా ఉండగలమని నిపుణులు సూచిస్తున్నారు.

60% ప్రమాదాలకు ఇదే కారణం..

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం హైవే హిప్నోసిస్ అని నివేదికలు వెల్లడిస్తున్నాయి. మన దేశంలో కూడా హైవే హిప్నోసిస్ కారణంగానే 60 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నివేదిక తెలిపింది. కోల్‌కత–ఢిల్లీ జాతీయ రహదారిపై సంభవించిన రోడ్డు ప్రమాదాలపై ఎన్‌హెచ్‌ఏఐ చేసిన అధ్యయన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2021లో దేశంలో 4.12 లక్షల రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిల్లో 1.53 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా 3.84 లక్షల మంది గాయపడ్డారు.

ఏమిటీ హైవే హిప్నోసిస్..



సాధారణంగా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కనురెప్పలు మూతపడి ప్రమాదాలు సంభవిస్తుంటాయి. దీనికి హైవే హిప్నోసిస్ కాస్త భిన్నమైంది. పైన చెప్పుకున్నట్లు విశాలమైన హైవేలపై డ్రైవింగ్ సులభంగా మారింది. ఎదురుగా వాహనాలు రావు.. చాలా దూరం వరకు మలుపులు ఉండవు.. దీంతో కొంతదూరం వెళ్లిన తరువాత డ్రైవింగ్ గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. అంటే డ్రైవర్ మెదడుకు పెద్దగా పనిఉండదు. ఫలితంగా మెదడు మెల్లగా విశ్రాంతి తీసుకుంటుంది. ఆటోమేటిక్ వాహనాలైతే గేర్లు మార్చాల్సిన అవసరం కూడా ఉండదు కాబట్టి డ్రైవర్ మెదడుకు ఇంకా ఎక్కువ విశ్రాంతి లభిస్తుంది. ఈ స్థితిలో డ్రైవర్ నిద్రపోరు. కళ్లు తెరిచే ఉంటారు. స్టీరింగ్‌పై పట్టు ఉంటుంది. కానీ, పెద్దగా పనిలేకపోవడంతో డ్రైవర్ మెదడు మాత్రం నెమ్మదిగా విశ్రాంతిలోకి జారుకుంటుంది. ఈ స్థితినే హైవే హిప్నోసిస్ అంటారు. సాధారణంగా హైవేపై రెండు నుంచి మూడు గంటలు ప్రయాణం చేసిన తరువాత ఈ స్థితి ఏర్పడవచ్చు. అది కూడా రోజూ సాధారణంగా నిద్రించే సమయంలో ఎవరైనా డ్రైవింగ్ చేసేటప్పుడు ఈ స్థితి ఆవహిస్తుంది. అంటే రాత్రి 10గంటల తరువాత నుంచి తెల్లవారుజాము మధ్యగానీ.. మ.2 గంటల నుంచి 4 గంటల మధ్య హైవేపై ఎక్కువసేపు డ్రైవింగ్ చేసేటప్పుడు హైవే హిప్నోసిస్ స్థితి ఏర్పడుతుంది. ఇది 5–15 నిముషాల పాటు ఉంటుంది. ఆ సమయంలో డ్రైవర్‌కు వాహనంపై నియంత్రణ ఉండదు. ఎదురుగా ఏదైనా వాహనాన్ని నిలిపి ఉంచితే చివరి నిముషం వరకు గుర్తించలేక ఢీకొడతారు. ఇలాగే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అలాగే, హైవేపై మలుపు వస్తే డ్రైవర్లు చివరి క్షణం వరకు గుర్తించలేరు. కారు రోడ్డు నుంచి పక్కకు వెళ్లిగానీ లేదా డివైడర్‌ను ఢీకొట్టి గానీ పల్టీలు కొడుతుంది. హైవేపై ఏదైనా ఫ్లైఓవర్‌గానీ, బ్రిడ్జ్‌గానీ వస్తే గుర్తించలేక రెయిలింగ్‌ను ఢీకొడతారు. హైవేపై జంక్షన్ల వద్ద రోడ్డుకు అడ్డంగా ఏదైనా వాహనంగానీ వ్యక్తులుగానీ వచ్చినా సరే గుర్తించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రొఫెషనల్ డ్రైవర్ల కంటే కూడా సాధారణ వ్యక్తులు డ్రైవింగ్ చేసేటప్పుడు ఎక్కువగా ఈ స్థితికి గురవుతారు.

తగిన జాగ్రత్తలు పాటిస్తేనే..

హైవే హిప్నోసిస్‌కు గురికాకుండా ఉండేందుకు డ్రైవర్లు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. మన రోజువారి పనితీరుకు అనుగుణంగా మన మెదడు అలవాటు పడి ఉంటుంది. రోజూ సాధారణంగా నిద్రకు అలవాటైన సమయంలో డ్రైవింగ్ చేయకుండా చూసుకోవాలి. తప్పనిసరైతే మాత్రం నిపుణుల సూచనలు పాటించాలి. అవి ఏమిటంటే..

- సాధారణంగా రెండు గంటల డ్రైవింగ్ తరువాత హైవే హిప్నోసిస్ ఏర్పడే అవకాశాలున్నాయి కాబట్టి 90 నిమిషాల డ్రైవింగ్ తరువాత డ్రైవర్ బ్రేక్ తీసుకోవాలి.
- కిందకు దిగి అటూ ఇటూ నడవాలి. ఎవరికైనా ఫోన్ చెయ్యొచ్చు. కాసేపు మొబైల్ ఫోన్లో గేమ్స్ ఆడొచ్చు. దాంతో మెదడు మళ్లీ చురుగ్గా పనిచేయడం ప్రారంభిస్తుంది. తర్వాత మళ్లీ డ్రైవింగ్ మొదలుపెట్టొచ్చు.
- గంటసేపు డ్రైవింగ్ తరువాత డ్రైవర్ తనకు తాను కాస్త అసౌకర్యం కలిగించుకోవాలి. కారులో ఏసీని ఆఫ్ చేయలి. దాంతో చెమటలు పడతాయి. కారు అద్దాలు కిందకు దించితే బయట నుంచి వేగంగా గాలి లోపలకి వచ్చి కాస్త చికాకు పెడుతుంది. దాంతో డ్రైవర్ సుఖవంతమైన స్థితి నుంచి బయటకు వచ్చి అసౌకర్యానికి గురవుతారు. దాంతో మెదడు మళ్లీ చురుగ్గా పనిచేస్తుంది.
- డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సైడ్ మిర్రర్, రియర్ మిర్రర్‌ను మాటి మాటికి చూస్తుండాలి. దాంతో కనుగుడ్లు అటూ ఇటూ తిరుగుతుండటంతో మెదడు చురుకుదనం సంతరించుకుంటుంది.
- ప్రస్తుతం అధునాతన స్లీప్ మోనిటరింగ్ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. కార్లు, వాహనాల్లో వాటిని ఏర్పాటుచేసుకోవాలి. స్మార్ట్ వాచ్‌లు, స్మార్ట్‌ఫోన్లలోనూ ఇవి వస్తున్నాయి. ఇవి సెన్సార్ల ఆధారంగా పనిచేస్తాయి. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు డ్రైవర్ శరీరంలో కాసేపు కదలికలు లేకపోతే వెంటనే బీప్ శబ్దంతో అప్రమత్తం చేస్తాయి. దాంతో హైవే హిప్నోసిస్ స్థితి నుంచి వెంటనే బయటకు రావచ్చు.
- రోడ్డుపై దృష్టి సారించలేకపోతున్నామని గుర్తించగానే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వాహనాన్ని నిలిపివేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, సురక్షిత దాబాలు, అనివార్యమైతే పెట్రోల్ బంకుల సమీపంలో వాహనాన్ని నిలిపి కాసేపు కునుకు తీయాలి. అనంతరం నిద్రలేస్తే మెదడు మళ్లీ చురుగ్గా పనిచేస్తుంది.

కురుక్షేత్రలో వేదోక్తంగా లక్ష చండీ మహాయజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణలోని కురుక్షేత్రలో లక్ష చండీ మహా యజ్ఞం శనివారం వేదోక్తంగా సాగింది. యజ్ఞంలో పాల్గొన్న పండితులంతా ఉదయం సప్తశతి పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి గణపతి పూజతో యజ్ఞాన్ని ప్రారంభించారు. షోడశ స్తంభ పూజచేసి ప్రధాన మండపంపై దేవతల ఆరాధన చేపట్టారు. వేదోక్తంగా అగ్నిమథనం చేశారు. లక్ష చండీతో పాటు పదకొండు అతిరుద్ర హోమాలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంటి మాత యజ్ఞాన్ని పర్యవేక్షించారు. ఈనెల 26 వరకు జరిగే ఈ యజ్ఞానికి దేశ నలుమూలల నుంచి పండితులు హాజరవుతారు. లక్ష చండీ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా ఆచరించారు.

మత్తును చిత్తు చేద్దాం

- రాష్ట్రంలో విస్తృతంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం
- ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500

సాక్షి, అమరావతి: మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ముమ్మరం చేసింది. ప్రధానంగా యువత, విద్యార్థులకు మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) దుష్ఫలితాలను వివరిస్తూ అవగాహన కల్పించేందుకు 'యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్'ను విస్తృతం చేసింది. మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలని పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులతో గతంలో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆమేరకు పోలీసు, ఎస్‌ఈబీ సంయుక్త కార్యాచరణ చేపట్టాయి. ఈ కార్యాచరణను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు పోలీసు, ఎస్‌ఈబీ అధికారులు వారానికి రెండు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

విద్యా సంస్థల్లో విస్తృత ప్రచారం

మాదక ద్రవ్యాల వినియోగ దుష్ఫలితాలపై ప్రచారం చేసేందుకు కాలేజీలు, యూనివర్సిటీల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేసి యువతను జాగృతం చేస్తున్నారు. అందుకోసం రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, కాలేజీలు కలిపి మొత్తం 2,541 విద్యా సంస్థలను గుర్తించారు. ఆయా వీసీలు, ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి కార్యాచరణ చేపట్టారు. విద్యా సంస్థల సమీపంలోగానీ మరెక్కడైనాగానీ మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్టుగానీ వినియోగిస్తున్నట్టుగానీ తెలిస్తే వెంటనే పోలీసులు, ఎస్‌ఈబీకి సమాచారమిచ్చేలా ఎస్‌ఈబీ ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 14500ను అందుబాటులోకి తెచ్చింది. పోస్టర్లు, హోర్డింగులలో ఆ నంబరును కూడా ప్రముఖంగా ముద్రించింది. ఇప్పటివరకు 1,105 విద్యా సంస్థల్లో పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. మిగిలిన 1,436 విద్యా సంస్థల్లో ఈ నెలాఖరులకు ఏర్పాటు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కమిటీలు... సదస్సులు

విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఈబీ నిర్ణయించింది. ఆయా విద్యా సంస్థల ప్రతినిధులతోపాటు స్థానిక పోలీస్ అధికారి, వైద్య అధికారులు, తల్లిదండ్రులు నిర్ణయించే ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ తరచూ సమావేశమై యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ అమలు తీరుపై చర్చిస్తుంది. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. వైద్య నిపుణులు, మానసిక వ్యక్తిత్వ నిపుణులు, సామాజికవేత్తలు ఈ సదస్సుల్లో యువతకు భవిత పట్ల దిశానిర్దేశం చేస్తారు.

క్లుప్తంగా...

రైతన్నకు కంటి వెలుగును ప్రసాదించిన ఆరోగ్యశ్రీ

నెల్లూరు జీజీహెచ్‌లో తొలిసారిగా కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్



ఆపరేషన్ చేస్తున్న కంటి డాక్టర్ల బృందం

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర విభాగంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఓ రైతన్నకు కంటి మార్పిడి (కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చేసి చూపును ప్రసాదించారు. నెల్లూరు జీజీహెచ్‌లో తొలిసారి కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన సందర్భంగా ఆ వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ శనివారం తెలియజేశారు. తోటపల్లిగూడూరు మండలం పేడూరు గ్రామానికి చెందిన రామయ్య (60) అనే రైతుకు 20 ఏళ్ల క్రితం కంటికి దెబ్బతగిలి నల్లగుడ్డు మీద పువ్వు ఏర్పడింది. దీంతో కంటి చూపు పూర్తిగా తగ్గి రోజువారీ పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. రామయ్య ఈ నెల 3న నెల్లూరు జీజీహెచ్‌కి రాగా, కంటి విభాగాధిపతి డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి కంటి గుడ్డు మార్పిడి ద్వారా చూపును ప్రసాదించవచ్చని చెప్పారు. ఈ నెల 9న రామయ్య కంటికి ఆపరేషన్ చేసి దాత నుంచి సేకరించిన నల్లగుడ్డును విజయవంతంగా అమర్చారు. ఆపరేషన్‌ను విజయవంతంగా చేసిన డాక్టర్ సంధ్య బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు. రోగి రామయ్య మాట్లాడుతూ తనకు చూపును ప్రసాదించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉడుకు బెల్లం'కు రంగినేని సాహిత్య పురస్కారం

సిరిసిల్లకల్చరల్: రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా జాతీయస్థాయిలో అందజేస్తున్న రంగినేని ఎల్లమ్మ స్మారక సాహిత్య పురస్కారానికి 2022 సంవత్సరానికి చింతకింది శ్రీనివాసరావు రచించిన 'ఉడుకు బెల్లం'కథాసంపుటి ఎంపికైంది. మార్చిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పురస్కార కమిటీ సమన్వయకర్త మద్దికుంట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు కింద రచయితకు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు వెల్లడించారు.

రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లకు మహర్దశ

- అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఆధునికీకరణ
- 53 మౌలిక సదుపాయాల అభివృద్ధి
- విశాఖ, విజయవాడ సహా పలు స్టేషన్ల ఎంపిక
- స్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ సహా 72 రైల్వే స్టేషన్లను రైల్వే శాఖ అభివృద్ధి చేయనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన 'అమృత్ భారత్ స్టేషన్స్' పథకం కింద దేశంలో 1,275 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. వాటిలో మన రాష్ట్రంలోని 72 రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు. ఈ పథకం కింద రైల్వే స్టేషన్లలో 53 రకాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ప్రతి స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన స్టేషన్ల అభివృద్ధికి త్వరలోనే మాస్టర్ ప్లాన్లు రూపొందించేందుకు నిపుణుల కమిటీలను నియమిస్తామని రైల్వే శాఖ వర్గాలు తెలిపాయి. అనంతరం బడ్జెట్‌ను రూపొందించి దశలవారీగా పనులు చేపడతామన్నారు.

స్టేషన్లలో కల్పించే ప్రధాన సౌకర్యాల్లో కొన్ని..

- ప్రతి స్టేషన్‌లో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునిక శైలిలో నిర్మాణం
- ప్రస్తుతం ప్లాట్‌ఫామ్‌లు 600 మీటర్ల పొడవుతో ఉన్నాయి. వాటి పొడవు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పెంపు
- స్టేషన్ల వద్ద ట్రాక్‌ల శుభ్రత, సులభమైన నిర్వహణ కోసం 'బ్యాలస్టలెస్ ట్రాక్'ల ఏర్పాటు
- ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండే ఎన్‌ఎస్‌జీ 1 – 4, ఎస్‌జీ 1– 2 కేటగిరీ స్టేషన్లలో ఎస్కలేటర్ల ఏర్పాటు
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చెయిర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ఇతర సదుపాయాలు
- వెయిటింగ్ హాల్స్, వాటికి అనుబంధంగా కేఫెటేరియా
- స్థానిక ఉత్పత్తుల విక్రయానికి కనీసం రెండు స్టాల్స్ ఏర్పాటు
- ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా
- సమావేశ మందిరాలు
- స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేక దారి
- ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్
- వేగవంతమైన వైఫై సేవలకు 5జీ టవర్లు

రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న రైల్వే స్టేషన్లు..

విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం, విజయనగరం, తెనాలి, గుంటూరు, ఆదోని, అనకాపల్లి, అనపర్తి, అరకు, బాపట్ల, భీమవరం టౌన్, బొబ్బిలి, చీపురుపల్లి, చీరాల, చిత్తూరు, కడప, కంభం, ధర్మవరం, డోన్, దొనకొండ, దువ్వాడ, యలమంచిలి, ఏలూరు, గిద్దలూరు, గుత్తి, గుడివాడ, గూడురు, గుణదల, హిందూపూర్, ఇచ్ఛాపురం, కదిరి, కాకినాడ టౌన్, కొత్తవలస, కుప్పం, కర్నూలు సిటీ, మాచర్ల, మచిలీపట్నం, మదనపల్లి రోడ్, మంగళగిరి, మార్కాపూరం రోడ్, మంత్రాలయం రోడ్, నడికుడి, నంద్యాల, నరసరావుపేట, నరసాపూర్, నౌపడ, నెల్లూరు, నిడదవోలు, ఒంగోలు, పాకాల, పలాస, పార్వతీపురం, పిడుగురాళ్ల, పీలేరు, రాజంపేట, రాజమహేంద్రవరం, రాయనపాడు, రేణిగుంట, రేపల్లె, సామర్లకోట, సత్తెనపల్లి, సింహాచలం, సింగరాయకొండ, శ్రీకాళహస్తి, శ్రీకాకుళం రోడ్, సూళ్లూరుపేట, తాడేపల్లిగూడెం, తాడిపత్రి, తుని, వినుకొండ.



గగనతలం.. విమాన విహారం

బెంగళూరులోని యలహంక వైమానిక స్థావరంలో ఈ నెల 13 నుంచి అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన (ఏరో ఇండియా– 2023) ప్రారంభం కానుంది. దీన్ని పురస్కరించుకుని భారత వాయుసేన విమానాలు శనివారం రిహార్సల్స్‌లో భాగంగా గగన తలంపై విహరించి కనులవిందు చేశాయి. –యశవంతపుర

మండువా లోగిలి..ఓ అందమైన జ్ఞాపకం

- ఉమ్మడి కుటుంబాలకు ఆతిథ్యమిచ్చిన నివాసాలు
- ఆధునిక పరిస్థితుల్లో కనుమరుగవుతున్న వైనాలు
- కుటుంబం చిన్నదై .. నిర్వహణ భారమై ఉనికి కోల్పోతున్న మండువా లోగిళ్లు



కూనవరంలో రాజప్రసాదాన్ని తలపించే మేడ, మండువా లోగిలి

దెస్కు–రాజమహేంద్రవరం : శతమానం భవంతి సినిమా చూశారు కదూ..సీతారామయ్య గారి మనవరాలు సినిమా గుర్తుంది కదూ..ఈ సినిమా నేపథ్యంలో కనిపించే మండువా లోగిళ్లు తప్పకుండా గుర్తుండే ఉంటాయి. పాత తరం వారికి పరిచయమక్కరలేని మమతల నిలయాలివి. ఈతరంవారికి ఆశ్చర్యం కలిగిస్తూ ఆనందం నిలిపే ఈ అందాల లోగిళ్లకు ఇప్పుడు పెద్ద కష్టమొచ్చింది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం..ఆధునికత ప్రభావం ఫలితంగా ఉనికి కోల్పోయే పరిస్థితులెదురవుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మరీ ముఖ్యంగా కోనసీమలోని కొన్ని పల్లెల్లో రాజమహల్‌ను తలపించే ఈ ఇళ్లు ఇప్పుడు రాన్రానూ కనుమరుగవుతున్నాయి. నిర్వహణ కష్టతరమై ఉనికి కోల్పోతున్నాయి.

ఒకప్పుడు గ్రామీణ వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రస్తుతం చిన్నదైపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే విచ్ఛిన్నమైపోయింది. వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకునేవారు కొందరు.. వ్యవసాయానికి దూరంగా వెళ్లిపోతున్నవారు మరికొందరు.. ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణ బాట పడుతున్న వారు మరికొందరు. కారణాలేమైతేనేం.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఒకనాటి జ్ఞాపకంగా మిగిలింది.. ఇంటికి ఇద్దరో ముగ్గురో ఉంటున్నారు. మహా అయితే నలుగురుంటున్నారు. దీంతో నివాసాలూ కుచించుకుపోతున్నాయి. దీంతో ఊరిలో దర్పంగా నిలిచే మండువా లోగిళ్లు ఇప్పుడు చిక్కిశల్యమైపోతున్నాయి. జమీందారీ వ్యవస్థకు, మోతుబరి రైతు కుటుంబాలకు చిహ్నంగా నిలిచే ఈ అందాల భవంతులు నెమ్మది నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి.

దాని వైభోగమే వేరు

18 అంగులాల మందాన వెడల్పున గోడలు, నగిషీలు చెక్కిన సింహద్వారాలు, టేకుతో తయారు చేసిన సరంబీలు.. కిటికీలు. రాజులమహల్‌ను తలపించే చెక్క స్తంభాలు.. వెలుగు.. వెలుతురు పంచే మండువాలు.. పిరమిడ్‌ను తలపించే ఇంటిపైకప్పు.. కళాకృతి ఉట్టిపడే పెంకులనేత.. ఎత్తయిన అరుగులు.. కోట బురుజులంత గోడలు... విశాలమైన ఆవరణ.. అందమైన పూలమొక్కలు.. చూడగానే మనసును దోచుకునే వైభోగం మండువా లోగిలి సొంతం. ఇప్పటికీ ఇలాంటివి కోనసీమ జిల్లాల్లోని అల్లవరం ..అమలాపురం..ఉప్పలగుప్తం..అంబాజీపేట లాంటి మండలాల్లో అక్కడక్కడ ఉనికి చాటుతున్నాయి. నాటి ఉమ్మడి కుటుంబాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

సినిమా షూటింగులక్కడే

గ్రామీణ కథా నేపథ్యంతో సాగే చాలా సినిమాల్లో మండువా లోగిలి కనిపిస్తుంది. అభిరుచి గల నిర్మాతలు బోలెడు ఖర్చు భరించి మరీ కోనసీమ జిల్లాకు వస్తుంటారు. ఈ తరహా ఇళ్లలో షూటింగులు చేస్తుంటారు. వీటిలో తీసే సినిమాలు హిట్ అవుతాయని సినిమా రంగంలో సెంటిమెంటు ఉంది. నాటి నుంచి నేటి వరకూ చాలా చిత్రాలకు ఈ మండువా లోగిలిలో షూటింగులు తీస్తున్నారు. ఈ సెంటిమెంటును నిజం చేస్తున్నారు.

నిర్వహణ భారమై..

'వాళ్లకేంటి... లంకంత ఇల్లు' అని గోదావరి పల్లెల్లో చెప్పుకోవడం తరచూ వినేదే. కానీ ఇప్పుడు వాటి నిర్వహణ ఇంటి పెద్దకు భారమవుతున్నాయి. అంత పెద్ద ఇళ్లలో ఉండేది ఇప్పుడు ఒకరిద్దరే. రోజువారీ పరిశుభ్రం చేసేందుకు మనుషులు దొరకడం లేదు. వ్యవసాయానికే కూలీలు దొరకని పరిస్థితి. ఇవన్నీ గుర్తించి చాలా మంది మండువా లోగిళ్లను, వాటి ముందు నిర్మించిన పాత కాలం నాటి మేడలను తొలగిస్తున్నారు. వాటి స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా చిన్నచిన్న ఇళ్లను నిర్మించుకుంటున్నారు. వందల ఏళ్ల నాటి అనుబంధమే అయినా తప్పని పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తుందని ఈ భవనాల యజమానులు ఆవేదనా స్వరంతో చెబుతున్నారు. అక్కడక్కడ కొంతమంది ఆధునిక పద్ధతిలో మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ఇప్పటి అవసరాలకు అనుగుణంగా టైల్స్, సీలింగ్ వంటివి జోడిస్తున్నారు.

ముందు ముందు కష్టమే



మండువా లోగిలి మన వారసత్వ సంపద. మన సంస్కృతి, జీవన విధానంలో భాగం. ప్రస్తుత రోజుల్లో వీటి నిర్వహణ చాలా భారంగా మారింది. అయినా వెనకడుగు వేయకుండా మా తరం వాళ్లం కాపాకుంటూ వస్తున్నాం. కానీ ముందుముందు నిర్వహణ కష్టమే.

మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, లక్కవరం, మలికిపురం మండలం.

కొత్త ఇల్లు కట్టాలనుకుంటున్నాం



మా ఇల్లు కట్టి 55 ఏళ్లు పూర్తవుతుంది. అప్పట్లో దీన్ని మూడు వాటాలుగా విభజించారు. అందులో మా కుటుంబానిది ఒక వాటా. 1998లో మానాన్నగారు ఈ వాటను కొన్నారు. అప్పటినుండి పరిరక్షిస్తూనే ఉన్నాం. ఈ మధ్య గోడలు బీటలు వారుతున్నాయి. పాతగోడలు కావడంతో సిమెంటుతో మరమ్మతులు చేయటం కష్టంగా ఉంది. ఎంత మరమ్మతులు చేసినా ఏదో వెలితి కనిపిస్తూనే ఉంది. దీన్ని పడగొట్టి కొత్త ఇల్లును నిర్మించే ప్రయత్నంలో ఉన్నాం.

నూకల నారాయణరుషి, ఉప్పలగుప్తం.

నిర్వహణ చేయలేక పోతున్నాం

పెద్ద భవంతుల్లో ఉండడం ఆదష్టంగా భావిస్తాం. కానీ వీటి నిర్వహణ మాత్రం చాలా కష్టతరంగా మారింది. టేకు గుమ్మాలు, కిటికీలు కావడం వల్ల ఎప్పటికప్పుడు పాలిష్ పెట్టించాల్సి ఉంది. ఇళ్ల నేత కార్మికుల కొరత ఎక్కువగా ఉంది. కూలీలు దొరకడం లేదు. చెదల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

కంచిపల్లి రాజు, అమలాపురం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943